సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 120

SUNDAY Special

ఆదివారం 21-7-2024



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



ఆమె బడ్జెట్ ఎంత?

ఇప్పుడు రానున్నది బడ్జెట్ కాలం. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో ఆయా సభలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నాయి. ఈ సందర్భంగా స్త్రీలు ఏం కోరుతున్నారు? ఆర్థిక మంత్రులకు ఏం సందేశం ఇస్తున్నారు?

- వివరాలు 13లో



'హ్యాట్రిక్'పై సింధు గురి

ఒలింపిక్స్‌లో భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్ల అవకాశాలపై ప్రత్యేక కథనం. 2016, 2020లలో రజతం, కాంస్యం సాధించిన సింధు మరో పతకం గెలిస్తే ఒలింపిక్స్‌లో 3 పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా నిలుస్తుంది.

- వివరాలు 14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బంగ్లాదేశ్‌లో కనిపిస్తే కాల్చివేత

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల వ్యతిరేక హింసాకాండ నేపథ్యంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది.

- వివరాలు 6లో



యూపీఎస్సీ చైర్మన్ రాజీనామా

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మనోజ్ సోనీ వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు.

- వివరాలు 6లో



జెండా ఎగరడం వెనక...

చంద్రునిపై వ్యోమగామి నీల్‌ఆర్మ్ స్ట్రాంగ్ పాతిన అమెరికా జెండా రెపరెపలాడటం పెద్ద గందరగోళానికే దారితీసింది.

- వివరాలు 6లో



నాలుగు కొత్త లైన్లు!

నూతన గ్రీన్ ఫీల్డ్ మార్గాలతో ప్రధాన రైల్వే లైన్లను అనుసంధానించే నాలుగు కొత్త రైల్వే లైన్లు రానున్నాయి

- వివరాలు 16లో

కరువుతీరా వర్షాలు

రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదు

అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 4.6 సెం.మీ. సగటు వర్షపాతం

రాష్ట్రవ్యాప్తంగా 1.79 సెం.మీ. సగటు వర్షపాతం.. పలుచోట్ల పొంగి పొర్లుతున్న వాగులు.. లోతట్టు ప్రాంతాలు జలమయం

పంట పొలాలను ముంచెత్తిన వరద

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో తెగిన తాత్కాలిక వంతెన

మరో రెండ్రోజులు వర్షాలు..

10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా ఈదురుగాలులు, వర్షసూచన



భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గుబ్బలమంగి వాగు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: కరువుతీరేలా.. వరుణుడు కరుణించాడు. వానాకాలం ప్రారంభమైన నలభై రోజుల అనంతరం ఒకేసారి రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదవుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. రాష్ట్రంలోని పలు వాగులు, ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. పలుచోట్ల పంట పొలాల్లోకి నీరు చేరింది. శనివారం జిల్లాల వారీ గణాంకాలు పరిశీలిస్తే.. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో సగటున 4.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆ తర్వాత ములుగు జిల్లాలో 4.19 సెంటీమీటర్లు, భద్రాద్రి కొత్తగూడెం

మిగతా 2వ పేజీలో ▶

శ్రీశైలం చెంతకు కృష్ణమ్మ

శనివారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 33,499 క్యూసెక్కుల ప్రవాహం

వరద గోదారి!

భద్రాచలం వద్ద 35.5 అడుగులకు చేరిన నీటిమట్టం

నేడు మరింత వరద!

వివరాలు 2లో

నేడు అతిభారీ, అత్యంత భారీ వర్షాలు!

ఆదివారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ.. ఆ మేరకు పది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీస్తాయని అధికారులు చెబుతున్నారు.

బడ్జెట్ సమావేశాల్లో జాబ్ కేలండర్

23 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటిస్తాం

ఇకపై ఏటా కేలండర్ తేదీల ప్రకారం ఉద్యోగ నియామకాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

- జూన్ 2లోగా నోటిఫికేషన్లు.. డిసెంబర్ 9 నాటికి నియామక పత్రాలు
- నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత
- 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం' పథకం ప్రారంభించిన సీఎం
- 2023 సివిల్స్ విజేతలకు ఘన సన్మానం

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లలో ఉద్యోగ నియామక పరీక్షల నిర్వహణలో జాప్యంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపై అలా జరగకుండా యూపీఎస్సీ తరహాలో ఏటా ప్రణాళికాబద్ధంగా కేలండర్ తేదీల ప్రకారం ఉద్యోగ నియామకాలు జరుపుతామని చెప్పారు. ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే జాబ్ కేలండర్‌ను ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల నుంచి ప్రతి ఖాళీని మార్చి 31లోగా తెప్పించుకుని జూన్ 2లోగా నోటిఫికేషన్లు జారీ చేస్తామని అన్నారు. ఎన్ని ఖాళీలున్నా డిసెంబర్ 9 నాటికి నియామక

మిగతా 5వ పేజీలో ▶



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి

కమ్మ అంటేే అమ్మ లాంటి ఆలోచన

కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆ సామాజికవర్గంతో నాకున్న సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.. నన్ను ఆ వర్గం ఎంతో అభిమానంతో చూసుకుంటుంది

3లో

న్యూస్‌రీల్

పంటరుణాలపై తప్పుడు వివరాలిస్తే కఠిన చర్యలు



పంటరుణాలకు సంబంధించి తప్పుడు సమాచారమిచ్చే బ్యాంకర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల హెచ్చరించారు. బ్యాంకులవారీగా సమాచారాన్ని తెప్పిస్తున్నామన్నారు.

- వివరాలు 3లో

ఫీజులు.. గుండెలు గుభిల్లు



విద్యార్థులు, తల్లిదండ్రుల డ్రీమ్ కోర్సు అయిన ఇంజనీరింగ్‌కు సంబంధించి దేశంలోనే ప్రఖ్యాత విద్యాసంస్థ ఐఐటీ బాంబేలో 2008లో మొత్తం ట్యూషన్ ఫీజు రూ.1,08,000 ఉండగా ఇది 2024–25 నాటికి ఏకంగా రూ.8,00,000కు పెరిగింది. 15 ఏళ్లలో 7.2 రెట్లు పెరగడం గమనార్హం.

- వివరాలు 16లో

31 వరకు ఉద్యోగ బదిలీలు



రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల షెడ్యూల్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3న ఇచ్చిన జీవో ప్రకారం శనివారంతో బదిలీల షెడ్యూల్ ముగియాల్సి ఉండగా.. ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 12లో

బడుల పనివేళల్లో మార్పు



రాష్ట్రంలో పాఠశాలల పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసింది. ఉన్నత పాఠశాలలు ప్రస్తుతం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కొనసాగుతుండగా.. ఈ సమయాన్ని అరగంట ముందుకు జరిపింది. ఇకపై ఉన్నత పాఠశాలలు జిల్లాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.15 గంటలకు ముగుస్తాయి.

- వివరాలు 12లో

ఇదండీ సంగతి



రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు



రాజ్యాంగ ఉల్లంఘనపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం

మా ఎమ్మెల్యేలను భయపెట్టి చేర్చుకుంటున్నారు

ప్రభుత్వం ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తోంది

- గవర్నర్‌కు వివరించిన బీఆర్ఎస్ బృందం
- 'ప్రొటోకాల్'పై ప్రభుత్వాన్ని వివరణ కోరతానని గవర్నర్ చెప్పారు: కేటీఆర్
- జాబ్ కేలండర్‌పైనా లేఖ రాస్తామన్నారు..
- గ్రూప్ 2 వాయిదాతో సీఎంకు ఎన్ని కోట్లు ముట్టాయో?.. మేడిగడ్డ ప్రాజెక్టును కాంగ్రెస్ భూతద్దంలో చూపిందని ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న రాజ్యాంగ విరుద్ధ చర్యలను రాష్ట్రపతి దృష్టికి కూడా తీసుకెళ్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని కూడా కలుస్తామన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఓ వైపు రాజ్యాంగాన్ని రక్షిస్తున్నట్లు పోజులు కొడుతూ మరోవైపు దానిని తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కొందరు ముఖ్యనాయకులు శనివారం

మిగతా 5వ పేజీలో ▶

పెనం పైనుంచి పొయ్యిలోకి!



కాంగ్రెస్ పాలనలోనూ మారని ప్రజల బతుకులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం

5లో

ఒకే సెంటర్‌లో 85% మందికి అర్హత

పరీక్ష కేంద్రాలు, నగరాలవారీగా నీట్ ఫలితాల విడుదల

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ

6లో

ఒక 'క్లౌడ్'ను నమ్ముకుంటే ఇంతే..

- ప్రపంచానికి గుణపాఠం నేర్పిన మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ ఔటేజ్
- ఖర్చుల నియంత్రణకు క్లౌడ్ సర్వీసులపై ఆధారపడుతున్న ఐటీ సంస్థలు
- అజూర్ క్లౌడ్ సర్వీస్‌లో చిన్న అప్‌డేట్‌తో ప్రపంచవ్యాప్తంగా ఆగిపోయిన పలు సేవలు
- ఇప్పుడు ఇతర క్లౌడ్ సర్వీసులపై కంపెనీల దృష్టి.. మ్యాక్, లీనక్స్ వంటి సేవలపైనా దృష్టిపెట్టాలి: నిపుణులు



సాక్షి, అమరావతి: ఒక్క 'క్లౌడ్'నే నమ్ముకుంటే ఇంతే.. మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ ప్రపంచానికి నేర్పిన గుణపాఠమిది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో క్లౌడ్ సర్వీసులు ఉన్నప్పటికీ, మైక్రోసాఫ్ట్ అజూర్ పైనే ఆధారపడిన సంస్థలన్నీ ఇప్పుడు చిక్కుల్లో పడ్డాయి. ఐటీ, ఇతర రంగాలకు చెందిన సంస్థలు ఖర్చుల నియంత్రణ కోసం క్లౌడ్ సర్వీసులపై ఆధారపడుతుంటే ఇప్పుడు వాటి ఉనికే ప్రశ్నార్థకం అవుతోంది. తాజాగా మైక్రోసాఫ్ట్‌కు చెందిన క్లౌడ్ సర్వీసెస్ 'అజూర్' సంక్షోభంతో ఐటీ కంపెనీలు వాటి విధానంపై పునరాలోచనలో పడ్డాయి. అజూర్ సైబర్

మిగతా 5వ పేజీలో ▶



తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరదనీరు


భద్రాచలం వద్ద గోదావరి..


కడెం వరద గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

శ్రీశైలం చెంతకు కృష్ణమ్మ

- ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి స్థిరంగా వరద
- నారాయణపూర్ డ్యామ్ నుంచి 1.08 లక్షల క్యూసెక్కులు దిగువకు
- జూరాల నుంచి 1.04 లక్షల క్యూసెక్కులు దిగువకు..


నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు


సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: ఎగువ నుంచి కృష్ణా జలాలు శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు 33,499 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 813.7 అడుగుల్లో 36.56 టీఎంసీలకు చేరుకుంది. గరిష్ట నీటి మట్టం 885 అడుగులున్న ఈ ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 179.26 టీఎంసీలు అవసరం. పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కొనసాగుతుండటంతో కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 79 వేల క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుత్‌కేంద్రం, గేట్ల ద్వారా 69 వేల క్యూసె క్కులను దిగువకు వదులుతున్నారు. నారాయ ణపూర్ డ్యామ్‌లోకి లక్ష క్యూసెక్కులు చేరుతుండగా.. 1,08,860 క్యూసెక్కులను విద్యుత్‌కేంద్రం, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. దాని దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టులోకి శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 90,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 17 క్రస్టుగేట్లను ఎత్తి 66,810 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు వదిలారు. అలాగే ఎగువ, దిగువ జెన్‌కో జల విద్యుత్‌కేంద్రంలోని 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపట్టగా ఇందుకోసం 33,084 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే, కుడి, ఎడమ కాల్వలతోపాటు నెట్టెంపాడు, భీమా లిఫ్టులకు కలిపి మొత్తం 1,04,416 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, నాగార్జున సాగర్‌లోకి ఎలాంటి వరద ప్రవాహం లేదు.

తుంగభద్రలో...

కృష్ణా ప్రధాన ఉప నది అయిన తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లోకి 1,03,787 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 68.77 టీఎంసీలకు చేరుకుంది. మరో 37 టీఎంసీలు చేరితే తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తేస్తారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే మరో మూడు రోజుల్లో తుంగభద్ర ప్రాజెక్టు నిండుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అటు కృష్ణా ప్రధానపాయ.. ఇటు తుంగభద్ర బేసిన్‌లలో శనివారం వర్షాలు కురిసిన నేపథ్యంలో ఆదివారం కూడా వరద ఇదే రీతిలో కొనసాగుతుందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు ఇప్పటికే నిండగా, మరో మూడు నాలుగో రోజుల్లో తుంగభద్ర జలాశయం సైతం నిండే అవకాశాలున్నాయి. దీంతో మరో నాలుగైదు రోజుల్లో శ్రీశైలం జలా శయానికి వరద ప్రవాహం మరింతగా పెరిగే అవకాశముంది. వర్షాలు కొనసాగితే నెలాఖరు లోగా శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండే అవకాశాలున్నాయి.

మూసీ ప్రాజెక్టుకు జలకళ

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు అయిన మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. హైదరాబాద్‌తోపాటు మూసీ నది పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరద వస్తోంది. బిక్కేరు వాగు నుంచి కూడా నీరు వస్తుండటంతో మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. శనివారం ఉదయం ప్రాజెక్టుకు 810 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో.. సాయంత్రానికి ఒక్కసారిగా 1700 క్యూసెక్కులకు పెరిగింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.06 టీఎంసీల నీరు ఉంది.


జూరాల ప్రాజెక్టు వద్ద 12 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వ ఇలా..:

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	1,705	129.72	1699.44	101.48	79,000	69,000
నారాయణపూర్	1,615	37.64	1612.30	33.95	91,263	1,08,860
ఉజ్జయిని	1,630	117.64	1604.27	50.66	4,266	225
జూరాల	1,045	9.66	1041.92	6.99	90,800	1,04,416
తుంగభద్ర	1,633	105.79	1622.53	68.77	1,03,787	2,923
శ్రీశైలం	885	215.81	810.89	36.56	33,499	0
నాగార్జునసాగర్	590	312.05	504.59	122.68	0	9874
పులిచింతల	175	45.77	100.19	0.77	443	50

జనజీవనానికి ఆటంకాల్లేకుండా చర్యలు చేపట్టండి

- మంత్రి పొంగులేటి
- రెవెన్యూ అధికారులు, సిబ్బంది సెలవుల రద్దుకు ఆదేశాలు జారీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సాధారణ జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతుండటంతో పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ మేరకు ఇద్దరు కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడిన పొంగులేటి వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కోరారు. ఇతర జిల్లాల్లో కురుస్తున్న వర్షాలపై కూడా ఆరా తీసిన మంత్రి లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యల గురించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ విభాగాలతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని కోరారు. అత్యవసర పరిస్థితులు ఉన్నందున రెవెన్యూ అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

వరద గోదారి!

భద్రాచలం వద్ద 35.5 అడుగులకు చేరిన నీటిమట్టం

ప్రాజెక్టులు, బరాజ్‌ల్లోకి పెరుగుతున్న ప్రవాహం

పలుచోట్ల గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

నేడు వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి పోటెత్తుతోంది. ప్రాజెక్టుల్లోకి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. శనివారం నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు మూడు వరద గేట్లను, ఆసిఫాబాద్ జిల్లా కుమురంభీం (ఆడ) ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తారు. పలు బరాజ్‌ల గేట్లను కూడా ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద శనివారం రాత్రి 35 అడుగులు దాటి ప్రవహిస్తోంది. తాలిపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడం, వర్షాలు ఇంకా కురిసే అవకాశం ఉండటంతో గోదావరికి వరద పెరగొచ్చని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మేడిగడ్డకు వచ్చిన నీళ్లు వచ్చినట్లే..


కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కి 3,73,500 క్యూసెక్కుల వరద వస్తుండగా, గేట్లన్నీ పైకి ఎత్తి ఉంచడంతో వచ్చిన నీళ్లు వచ్చినట్టు కిందికి వెళ్లిపోతున్నాయి. బరాజ్ ఇప్పటికే దెబ్బతిని ఉండడంతో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు నిరంతరం వరద పరిస్థితిని, బరాజ్ భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం బరాజ్‌లో నీటి మట్టం 100 మీటర్లకు గాను 93 మీటర్లు ఉంది. మహదేవపూర్ మండలం అన్నారం (సరస్వతీ) బరాజ్‌లో నీటి మట్టం 119 మీటర్లకు గాను 106.96 మీటర్లు ఉంది. బరాజ్‌లోని 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తుపాకులగూడెం (సమ్మక్క) బరాజ్‌లోకి 4,82,800 క్యూసెక్కులు చేరుతుండగా 59 గేట్లు ఎత్తి అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. వాటి దిగువన ఉన్న దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బరాజ్‌లోకి 5,93,167 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో వరదను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో భద్రాచలం వద్ద వరద ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. శనివారం రాత్రి వరద తీవ్రత 6,02,985 క్యూసెక్కులు చేరగా, నీటి మట్టం 35.5 అడుగులకు పెరిగిపోయింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసింది. నీటిమట్టం 43 అడుగులకు పెరిగితే తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు. ఇక పోలవరం ప్రాజెక్టులోకి 4.35 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా 48 గేట్ల ద్వారా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు.

6 రోజుల్లో 73 టీఎంసీలు సముద్రం పాలు

మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడంతో గేట్లన్నీ పైకి ఎత్తి ఉంచారు. దీంతో వచ్చిన వరద వచ్చినట్టు దిగువనకు వెళ్లిపోతోంది. గత ఆరు రోజుల్లో ఏకంగా 73 టీఎంసీల వరద మేడిగడ్డ బరాజ్ గుండా ప్రవహించి సముద్రంలో కలిసిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

తాలిపేరుకు పోటెత్తిన వరద

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరుకు వరద పోటెత్తుతోంది. దీంతో 25 గేట్లు ఎత్తి 1,45,078 క్యూసెక్కుల చొప్పున వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇలావుండగా నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు మూడు వరద గేట్లను శనివారం ఎత్తారు. ప్రాజెక్టు ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి 15,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 (7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 690.400 (5.345టీఎంసీ) అడుగులు ఉంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అడ గ్రామంలోని కుమురంభీం (అడ) ప్రాజెక్టుకు వరద నీరు చేరడంతో మూడు గేట్లు ఎత్తారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 5.9 టీఎంసీలు కాగా 1,941 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.


ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న ఇన్‌ఫ్లో

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కూడా వరద కొనసాగుతోంది. శనివారం ఉదయం నుంచి 18,245 క్యూసెక్కుల వరద నిలకడగా కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరిగింది. అయితే సాయంత్రానికి 15,100 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1,091 (80 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం రాత్రికి 1,067.00 (18.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. శనివారం రాత్రి 9గంటల వరకు నీటిమట్టం 140.91 మీటర్లుగా, నీటి నిల్వ 5.96 టీఎంసీలుగా ఉంది.


మేడిగడ్డ బరాజ్ వద్ద వరద ఉధృతి

వర్షాలు, గోదావరి వరదలపై మంత్రి సీతక్క సమీక్ష



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, గోదావరి వరదలపై పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమీక్షించారు. ఉమ్మడి అదిలాబాద్ ఇన్‌చార్జ్ మంత్రిగా జిల్లాల కలెక్టర్లు, ములుగు కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి గోదావరి వరద పరిస్థితి వివరాలు ఎప్పటికప్పుడు మంత్రి తెలుసుకున్నారు. వరదల విషయంలో అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు గోదావరి సమీప గ్రామాలు, గ్రామీణ లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గత అనుభవాల దృష్టిలో ఇప్పటికే ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. ఇప్పటికే కంట్రోల్ రూం, పునరావాస కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

వరద నష్టంపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరా


బండి సంజయ్‌తో ఫోన్‌లో మాట్లాడిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్

అశ్వారావుపేట రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టు వరద బాధిత రైతులతో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం ఫోన్‌లో మాట్లాడి నష్టంపై ఆరా తీశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ మండలంలోని నారాయణపురం, పెదవాగు ప్రాజెక్టు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా సంజయ్‌కి ఫోన్ చేసి బాధిత రైతులతో మాట్లాడించారు. పెదవాగు ప్రాజెక్టు సమస్యను ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీఇచ్చారు. వరదలో చిక్కుక్కున్న బాధితుల యోగక్షేమాలు, వరద నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సహకరించడం వల్లే హెలిక్యాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించగలిగారని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర యంత్రాంగం బాగా పని చేసిందని సంజయ్ ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి పోనిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు మాలోత్ గాంధీ, బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరువుతీరా వర్షాలు

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలో 4.0 సెంటీమీటర్ల వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో 12.15 సెం.మీ వర్షపాతం నమోదైంది.

ఖమ్మం జిల్లా అంతటా..

ఉమ్మడి ఖమ్మం జిల్లా అంతటా రెండురోజులుగా వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షపాతం నమోదు కాగా, ఇంకొన్ని చోట్ల భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అత్యధికంగా ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ ప్రాంతంలో 2.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా కూడా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ముసురు వాన ఉండడంతో పలుచోట్ల వరి నారుమడులు, పత్తి చేన్లలో వరద నీరు నిలిచింది. పలుచోట్ల చెరువులు నిండి అలుగు పోస్తుండగా అక్కడక్కడా రహదారులు, లోలెవల్ బ్రిడ్జిలపైకి వరద చేరింది.

ఉధృతంగా జంపన్న, ముసలమ్మ వాగులు

ములుగు జిల్లాలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. దీంతో ఏజెన్సీలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఏటూరునాగారం మండలంలోని కొండాయి, ఎలిశెట్టి గ్రామాల సమీపంలో జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అధికారులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మర పడవలను ఏర్పాటు చేశారు. ఎలిశెట్టిపల్లి సమీపంలో జంపన్న వాగు ఉధృతి ఎక్కువ కావడం, దబ్బగట్ల శైలజ, పులిసె అనూష అనే గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో వారిని పడవల్లో వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. రామన్నగూడెం పుష్కరఘాట్‌కు 6 కిలోమీటర్ల దూరంలో కరకట్ట కోతకు గురవుతుండటంతో ఇరిగేషన్ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. మంగపేట మండలంలోని రాజుపేట ముసలమ్మ వాగు వరద ఉధృతికి ఒడ్డు కోతకు గురవుతుండటంతో ఒడ్డు వెంట నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాజేడు మండల పరిధిలోని కొప్పుసూరు గుట్టల వద్ద ఉన్న గుండ్ల వాగు ప్రాజెక్టు కట్ట ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు పరిస్థితిని సమీక్షించారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం పోతుల్వాయి సమీపంలోని బొర్రవాగు, గుండ్రాత్‌పల్లి సమీపంలోని అలుగువాగులు కూడా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద కాజ్‌వేల పైనుంచి వెళ్తుండడంతో పలు గ్రామాలకు మండలం మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో పత్తి చేలల్లోకి వరద చేరింది.


ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి వద్ద నీట మునిగిన వరి పొలాలు

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

వర్షాలతో మల్హర్ మండలం తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, మైన్ మేనేజర్ కేఎస్‌ఎన్ మూర్తిలు తెలిపారు. వర్షాల కారణంగా 1.30 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ, 6 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు.

గోదావరిలో కలెక్టర్, ఎస్పీ బోటు ప్రయాణం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్, పలిమెల మండలాల్లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే పర్యటించారు. గోదావరిలో బోటులో ప్రయాణించి వరద ఉధృతిని పరిశీలించారు. అక్కడి నుండి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు మారుమూల గ్రామమైన దమ్మూరుకు చేరుకొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఉమ్రి–సాంగిడి దారి మూసివేత

ఎడతెరిపిలేని వర్షాలతో వరద నీరు పోటెత్తడంతో ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని ఉమ్రి వాగుపై ఉన్న తాత్కాలిక వంతెన తెగిపోయింది. దీంతో ఉమ్రి–సాంగిడి దారిని పోలీసులు మూసివేశారు. రెండు మండలాల పరిధిలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వాగుపై కొత్త బ్రిడ్జి పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో, తాత్కాలిక వంతెన గుండానే రాకపోకలు కొనసాగుతున్నాయి.

60 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. జిల్లాలోని ఎల్లంపల్లి, ర్యాలీవాగు, గొల్లవాగు, నీల్వాయి ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పలు మండలాల్లో 60 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సింగరేణి ప్రాంతాల్లోని శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి, కైరిగూడ, డొర్లి ఏరియాల్లోని ఓపెన్ కాస్టుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడి రూ.కోట్ల నష్టం వాటిల్లింది. నిర్మల్ జిల్లా కడెం మండలంలో అత్యధికంగా 65.5మి.మీ వర్షపాతం నమోదైంది. ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ వెళ్లే మార్గంలో రెంకోనివాగుపై వేసిన తాత్కాలిక రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయింది.

శనివారం రాష్ట్రంలోని వివిధ మండలాల్లో వర్షపాతం

జిల్లా	మండలం	వర్షపాతం (సెం.మీ.)
భద్రాద్రి కొత్తగూడెం	చర్ల	12.15
ములుగు	వెంకటాపురం	8.29
ఖమ్మం	వేంసూరు	7.78
ములుగు	ఏటూరునాగారం	7.5
ఖమ్మం	సింగరేణి	7.42
ఖమ్మం	కామేపల్లి	6.93
భద్రాద్రి కొత్తగూడెం	దుమ్ముగూడెం	6.93
మహబూబాబాద్	బయ్యారం	6.08
భద్రాద్రి కొత్తగూడెం	మణుగూరు	5.99
భద్రాద్రి కొత్తగూడెం	జూలూరుపాడు	5.95


ఆదిలాబాద్ జిల్లాలో ఉమ్రి వాగుపై తెగిన తాత్కాలిక వంతెన

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలో 13.9 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సింగరేణి ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో శనివారం రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. కమ్మర్‌పల్లిలో 34.3 మిల్లీమీటర్లు, మెండోరాలో 28.0, నవీపేట్‌లో 27.5, బాల్కొండలో 24.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పాలమూరులో ముసురు వాన

వనపర్తి జిల్లాలో 2.7 సెంటీమీటర్లు, నారాయణపేట జిల్లాలో 2.69, మహబూబ్‌నగర్ జిల్లాలో 2.49, జోగుళాంబ గద్వాల జిల్లాలో 2.04, నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.42 సెంమీటర్ల వర్షపాతం నమోదైంది.ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా మహమ్మదాబాద్ మండలంలో 4.9 సెంమీ వర్షపాతం నమోదైంది. కొత్తకోట, జడ్చర్ల, ఆత్మకూరులో ముసురు వర్షానికి తడిసిన మట్టి ఇళ్లు కూలిపోయాయి.

వీడని ముసురు

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో రెండు రోజులుగా ముసురు కొనసాగుతోంది. అక్కడక్కడా తేలికపాటి వర్షాలు నమోదవుతున్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో శనివారం 1.43 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదవగా కడ్తాలలో అత్యల్పంగా 0.95 సెంటీమీటర్లు నమోదైంది. వికారాబాద్ జిల్లాలోని పలు వాగులు ఉరకలెత్తుతున్నాయి.

వాయుగుండానికి తోడు ఉపరితల ద్రోణి

పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం శనివారం మరింత ముందుకు సాగి ఒడిశాలోని చిలికా సరస్సు వద్ద కేంద్రీకృతమైంది. రానున్న ఆరు గంటల్లో వాయుగుండం తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు తూర్పు, మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టంపై 3.1 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండురోజులు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది.

12 జిల్లాల్లో సగటు కంటే ఎక్కువగా..

శనివారం రాష్ట్రంలో 1.79 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో భాగంగా జూన్1 నుంచి ఈనెల 20వ తేదీ వరకు రాష్ట్రంలో కురవాల్సిన సగటు సాధారణ వర్షపాతం 26.46 సెంటీమీటర్లు కాగా, ఇప్పటివరకు 33.11 సెంటీమీటర్ల వర్షపాతం (25 శాతం అధికం) నమోదైంది. గతేడాది ఇదే సీజన్‌లో 32.84 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత నైరుతి సీజన్‌లో శనివారం నాటికి రాష్ట్రంలోని జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఖమ్మం, నాగర్‌కర్నూల్, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, ములుగు, కరీంనగర్, సూర్యాపేట, పెద్దపల్లి, జగిత్యాల, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షం కురిసింది. మిగిలిన జిల్లాలో గడిచిన నాలుగు రోజుల క్రితం వరకు సాధారణం కంటే తక్కువ నమోదైనా.. శుక్ర, శనివారాల్లో ఎడతెరిపిలేని వర్షాలతో సాధారణ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ శనివారం రాత్రి ప్రకటించింది.



బొగత ఉగ్రరూపం


విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం శనివారం ఉగ్రరూపం దాల్చింది. పాల నురగలాంటి జలధారలు కనువిందు చేస్తున్నాయి. బొగత జలపాతం ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో పర్యాటకులను నీటిలోకి దిగనివ్వకుండా సిబ్బంది జాగ్రత్త పడుతున్నారు. - వాజేడు

పాండవుల జలపాతంతో పరవశం



భారీ వర్షాలతో వస్తున్న వరదతో మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం పరవశింప జేస్తోంది. జలపాతం అందాలను తిలకించేందుకు ఖమ్మం, ఇల్లందు, గార్ల, డోర్నకల్, కురవి, మహబూబాబాద్, గూడూరు, నర్సంపేట ప్రాంతాల నుంచి సందర్శకులు తరలి వస్తున్నారు. - బయ్యారం

గట్టు 'సింగారం'



ఎత్తయిన గుట్టలు.. వాటి పైనుంచి నీటి పరవళ్లు.. చుట్టూ పచ్చని చెట్లు.. ఆకాశం దిగివచ్చినట్లు పలకరించే మేఘాలు.. పెద్దపల్లి జిల్లా సబ్బితం గ్రామ సమీపంలోని గౌరీగుండాలు (గట్టు సింగారం) జలపాతం సోయగాలివి. కొద్ది రోజులుగా కురుస్తున్న ఏకధాటి వానలతో జాలువారుతున్న జలపాతాన్ని తిలకించేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన యువత భారీగా తరలి వస్తోంది. జలపాతం అందాలతో సెల్ఫీ దిగుతూ సందడి చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా...

ప్రతి రైతుకూ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి

లేకుంటే అసెంబ్లీ, సచివాలయం ముట్టడిస్తాం: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి రైతుకూ రూ.రెండు లక్షల రుణ మాఫీ చేయకపోతే అసెంబ్లీ, సచివాలయం ముట్టడిస్తామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. అసెంబ్లీలో చర్చించకుండానే రైతు రుణమాఫీ చేసినప్పుడు.. రైతు భరోసా చెల్లింపుపై అసెంబ్లీలో చర్చ దేనికో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు భరోసాను ఎగ్గొట్టడానికే అసెంబ్లీలో చర్చ ముందుకు తెస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రతి స్కీమ్‌లో స్కాం ఉంటోందని ఆరోపించారు. శనివారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు పాస్ బుక్ ఆధారంగా రుణమాఫీ అని చెప్పి రేషన్ కార్డు ఆధారంగానే చేస్తున్నారని విమర్శించారు. రైతు భరోసా యాసంగి పంటకు ఇవ్వలేదని, ఇప్పుడు వానాకాలం పంటకు కూడా ఎగ్గొట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందన్నారు. 'కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని మరోసారి మోసం చేసింది. రుణమాఫీ మొత్తం చేయకముందే సంబరాలు చేసుకుంటున్నారు. రూ.2లక్షల రుణమాఫీ కొంతమందికే చేసి మిగతా రైతులకు ఆంక్షలు పెట్టి, గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన విధంగానే ఇప్పుడూ చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల్లో చాలామంది రైతులకు రుణమాఫీ కావట్లేదు' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మఠంపల్లి: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరువేల కోట్ల రూపాయలు మాత్రమే రుణమాఫీ చేసి గ్రామగ్రామాన సంబరాలు చేస్తోందని ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రెండు దఫాలుగా రూ.31 వేల కోట్లు ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసిందని, రైతు బంధు అందించిందని గుర్తుచేశారు. ఇన్ని చేసిన బీఆర్ఎస్ ఎన్నిసార్లు సంబరాలు చేసుకోవాలని ప్రశ్నించారు. గ్రూప్- 2, 3 వాయిదా వేస్తున్నామని చెప్పారే తప్ప ఎన్ని పోస్టులు పెంచుతారో చెప్పలేదని, ఏ ప్రాతిపదికన ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించారో, టీజీపీఎస్సీ ఇంతవరకు మార్కులు ఎందుకు ప్రకటించడం లేదో చెప్పాలన్నారు. జీఓనంబర్ 46 ద్వారా నిరుద్యోగులకు న్యాయం చేస్తామని, ఇంతవరకు అమలు చేయలేదని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ఆయన విమర్శించారు.

కమ్మ అంటే అమ్మ లాంటి ఆలోచన

- కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అమ్మ ఆకలి చూస్తుంది..వ్యవసాయంతో పది మందిని బతికించేది కమ్మ కులం
- వారిని గుర్తించేందుకు కష్టపడనవసరం లేదు
- సారవంతమైన భూమి, సాగునీరు ఎక్కడ ఉంటే అక్కడ ఉంటారు
- కమ్మ సోదరులు తమ డీఎన్ఏ వదులుకోకుండా ముందుకు సాగాలన్న సీఎం



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ప్రతినిధులు. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, నటుడు మురళీమోహన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'కమ్మ అంటే అమ్మ లాంటి ఆలోచన. అమ్మ బిడ్డ ఆకలి చూస్తుంది. అలాగే భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసి పది మందిని బతికించే కులం కమ్మ. కమ్మ వారు ఎక్కడున్నారో గుర్తించేందుకు కష్టపడనవసరం లేదు. సారవంతమైన భూమి, సాగునీరు ఎక్కడ ఉంటే అక్కడ కమ్మ సోదరులు ఉంటారు.. కష్టపడాలనే మనస్తత్వం కమ్మ వాళ్లది. సమాజ శ్రేయస్సు కోసం కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు చేసే కృషికి ప్రభుత్వం తగిన సహకారాన్ని అందిస్తుంది. పది మందికి సాయం చేయాలనే ఆలోచన ఉన్న కమ్మ సోదరులు తమ డీఎన్ఏను వదులుకోకుండా ముందుకు సాగాలి..'అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. శనివారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగే కమ్మ గ్లోబల్ సమిట్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

రాజకీయాల్లో ఎన్టీఆర్ ఓ బ్రాండ్

'కమ్మ సామాజిక వర్గం వారితో నాకున్న సంబంధాల గురించి చెప్పనవసరం లేదు. నన్నెంతో అభిమానంతో చూసుకుంటుంది. నేను అనర్గళంగా మాట్లాడడానికి, తక్షణమే స్పందించడానికి ఎన్టీఆర్ లైబ్రరీలో చదువుకున్న చదువు ఎంతో ఉపయోగపడింది. ఎన్టీఆర్ రాజకీయాల్లో, నాయకత్వంలో ఒక బ్రాండ్ (ఎన్టీఆర్ ఈజ్ ఏ బ్రాండ్ ఫర్ పాలిటిక్స్, బ్రాండ్ ఫర్ లీడర్‌షిప్). 1982 కన్నా ముందు కమ్మ ఎమ్మెల్యేలు ఎందరు ఉన్నా, ఎన్టీఆర్ ఇచ్చిన అవకాశాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎందరో నాయకులుగా ఎదిగారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంకీర్ణ రాజకీయాలే నేడు దేశానికి మార్గదర్శకం..' రేవంత్ అని అన్నారు.

గ్లోబల్ సిటీగా మార్చడానికి కృషి చేయాలి


'కమ్మ సామాజిక వర్గం వాళ్లు అన్ని రంగాల్లో ఎదిగారు. ఎన్టీఆర్, ఎన్జీ రంగా, వెంకయ్యనాయుడు, చంద్రబాబు నాయుడు వంటి వాళ్లు కమ్మ సామాజిక వర్గం నుంచి వచ్చి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. సత్య నాదెళ్ల మొదలు ఎందరో ప్రపంచస్థాయి సీఈవోలుగా రాణిస్తున్నారు. కమ్మ సోదరులకు అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవు. సొంత కులం పట్ల అభిమానం ఉంది. అదే సమయంలో ఇతర కులాలను గౌరవిస్తాం. తెలంగాణలో కుల వివక్ష ఉండదు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చడానికి దేశ, విదేశాల్లో ఉన్న కమ్మ సోదరులు కృషి చేయాలి. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందాలంటే పెట్టుబడులు రావాలి. అందుకోసం కృషి చేయాలి..'సీఎం కోరారు.

ఢిల్లీలో తెలుగువాళ్ల నాయకత్వ కొరత

'ఢిల్లీలో తెలుగువాళ్ల రాజకీయ నాయకత్వం కొరత ఉంది. జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు, ఎన్టీఆర్ వంటి వాళ్లు ఢిల్లీ రాజకీయాల్లో ఉన్నప్పటి పరిస్థితి ఇప్పుడు లేదు. కులానికి, ప్రాంతానికి అతీతంగా తెలుగువారు ఢిల్లీలో రాణించేలా ముందుకు రావాలి. కమ్మ సంఘానికి గత ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల స్థలానికి సంబంధించిన వివాదాలను పరిష్కరించి, భవన నిర్మాణానికి కూడా ప్రభుత్వం సహకరిస్తుంది..'అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కాగా తమది దార్శనికతతో కూడిన సామాజిక వర్గమని కేజీఎఫ్ అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్ అన్నారు. కమ్మ వారి దాతృత్వానికి నాగార్జున సాగర్ ఉదాహరణ అని, ముత్యాలరాజా 57 లక్షలు విరాళంగా ఇచ్చి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఏపీ టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, తమిళనాడు ఎంపీ కళానిధి వీరాస్వామి, కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, మాజీ ఎంపీ మురళీమోహన్, తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, సత్యవాణి ప్రసంగించారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తమిళనాడు మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రులు వసంత నాగేశ్వర్‌రావు, వడ్డే శోభనాద్రీశ్వర్ రావు, క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పెద్దవాగు ప్రాజెక్టుకు గండి: హరీశ్‌రావు

- సకాలంలో ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంటే ప్రమాదం తప్పేది
- నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలి



సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి, కట్ట కొట్టుకు పోయిన ఘటనపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్లే పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడిందన్నారు. రైతులు హెచ్చరించినప్పుడే జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై గేట్లు తెరిచి ఉంటే రూ.వంద కోట్ల నష్టం జరిగేది కాదన్నారు. అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించి వందల మంది గిరిజన బిడ్డల ప్రాణాలు పణంగా పెట్టారని హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పెద్దవాగు ప్రాజెక్టు తెలంగాణ భూ భాగంలోనే ఉన్నదని, పర్యవేక్షణ చేస్తున్నది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ అధికారులేనని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు గండి పడటం వల్ల గుమ్మడివల్లి, రంగాపురం, కోయరంగాపురం, బుచ్చువారిగూడెం, నారాయణపురం గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలతోపాటు, పశుసంపదకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హెలికాప్టర్లు సరైన కాలంలో రాకుంటే వరదలో చిక్కుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండు రోజులైనా పరిశీలనకు మంత్రులకు తీరిక దొరకడం లేదా అని ప్రశ్నించారు. ముగ్గురు మంత్రులుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒరగబెట్టింది ఏమిటని నిలదీశారు. ఇసుకమేట వేసిన ప్రతి ఎకరాకు రూ 25 వేలు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం కింద ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చెయ్యాలని, పశువులు కోల్పోయిన రైతులకు ప్రకృతి వైపరీత్య నిధి నుంచి వెంటనే సహాయం చేయాలని హరీశ్‌రావు సూచించారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

తప్పుడు వివరాలిస్తే కఠిన చర్యలు

- పంటరుణాలపై బ్యాంకర్లకు మంత్రి తుమ్మల హెచ్చరిక... ఒకేరోజు భారీగా మంజూరు చేసిన రుణాలపై విచారణ
- అర్హులైన రైతులందరికీ నెలలోగా రుణమాఫీ
- రైతుభరోసాపై అందరితో చర్చించి ముందుకెళ్తాం



సాక్షి, హైదరాబాద్: పంటరుణాలకు సంబంధించి తప్పుడు సమాచారమిచ్చే బ్యాంకర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల వారీగా క్షేత్రస్థాయి సమాచారాన్ని తెప్పిస్తున్నామని, ఒక సొసైటీ పరిధిలో ఒకే రోజు ఐదువందల మందికి రుణాలు ఇచ్చినట్లు సమాచారం వచ్చిందని, ఇదే తరహాలో 7 బ్యాంకులు సమాచారం ఇచ్చాయన్నారు. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని, ఒకే రోజు ఇంత పెద్ద సంఖ్యలో రుణ మంజూరుకు కారణాలను పరిశీలించి నిర్ధారించుకుంటామన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం సచివాలయంలో వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి తుమ్మల మీడియాతో మాట్లాడారు. రుణమాఫీకి 25 లక్షల కుటుంబాలు అర్హత సాధిస్తాయని ప్రాథమికంగా భావించామని, అయితే, రాష్ట్రవ్యాప్తంగా 32 బ్యాంకుల ద్వారా రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న వారి సంఖ్య 44 లక్షలు ఉందన్నారు. కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. రేషన్ కార్డు ఆధారంగా కుటుంబ నిర్ధారణ చేస్తామని, ఈ కార్డు లేని వారిని పాస్‌బుక్ ఆధారంగా గుర్తిస్తామన్నారు.

రుణమాఫీ చేయకుంటే ఉరితీయండి

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పంటరుణ మాఫీ చారిత్రక నిర్ణయమని తుమ్మల చెప్పారు. అన్నదాతకు లబ్ధి చేకూరే ఈ పథకంపై రాజకీయ నేతలు తప్పుగా మాట్లాడొద్దని, అర్హత ఉన్న ప్రతి రైతుకూ పంటరుణాన్ని మాఫీ చేస్తామన్నారు. నెలరోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఏవైనా అనుమానాలు ఉంటే రైతు వేదికల వద్ద వ్యవసాయాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇంకా నాలుగున్నరేళ్లపాటు తమ ప్రభుత్వం కొనసాగుతుందని, రుణమాఫీ చేయకుంటే తమను ఉరితీయాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రూ.లక్ష లోపు రుణమాఫీ చేశామని, త్వరలో రూ.1.5 లక్షలలోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని, ఆ తర్వాత రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామన్నారు. రూ.1.50 లక్షలు, రూ.2 లక్షల రుణమాఫీ లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారో ఇప్పుడు చెప్పలేమని, నిధులు విడుదల సమయంలో వెల్లడిస్తామని మంత్రి ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మొత్తంగా రూ.31 వేల కోట్ల మేర రుణమాఫీ జరుగుతుందని, ఇప్పటివరకు చేసిన రూ.లక్ష లోపు మాఫీ ద్వారా 11 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని వివరించారు. రుణమాఫీ పొందని రైతులు సంబంధిత కలెక్టరేట్‌లో లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి కారణాలు తెలుసుకోవచ్చన్నారు.

నేడు ఢిల్లీకి రేవంత్?

- ఇప్పటికే హస్తినలో భట్టి, ఉత్తమ్.. రుణమాఫీ కృతజ్ఞత సభకు కాంగ్రెస్ పెద్దలకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం ఢిల్లీకి వెళ్లే అవకాశాలున్నాయి. రైతు రుణమాఫీ అమలు చేస్తున్న నేపథ్యంలో వరంగల్‌లో కృతజ్ఞత సభ నిర్వహించాలనే యోచనలో ఉన్న ఆయన, ఈ సభకు రావాలని కాంగ్రెస్ పెద్దలను ఆహ్వానించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌లతో కలసి ఆయన రాహుల్ గాంధీని కలవనున్నట్టు తెలుస్తోంది. కాగా, డిప్యూటీ సీఎం భట్టి శనివారం సాయంత్రమే ఢిల్లీ వెళ్లారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా శనివారం ఉదయం హస్తినకు చేరుకుని ఎన్డీఎస్ఏ చైర్మన్‌తో భేటీ అయ్యారు. వారిద్దరూ ఢిల్లీలోనే ఉన్న నేపథ్యంలో సీఎం రేవంత్ కూడా ఆదివారం ఢిల్లీ వెళ్తారని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది.

నిరుద్యోగులను మోసం చేసిందే కేటీఆర్: చనగాని

సాక్షి, హైదరాబాద్: ఓడిపోయిన తర్వాత కేటీఆర్‌కు నిరుద్యోగులు గుర్తుకు వస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల గోడు వినకుండా వారిని మోసం చేసిందే కేటీఆర్ అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోచింగ్ సెంటర్ల దోపిడీపై సీఎం రేవంత్ మాట్లాడిన వాస్తవాల గురించి కేటీఆర్ ఆలోచించలేక పోతున్నారని, ప్రభుత్వాన్ని విమర్శించడమే ఆయన పనిగా పెట్టుకున్నారని అన్నారు.

పెద్దవాగుకు తనిఖీలు చేశారా?

వానాకాలానికి ముందు స్థితిగతులపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లిలోని పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా గండ్లుపడి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) స్పందించింది. ఈ ఘటనపై సమగ్ర నివేదికను ఇవ్వాలని రాష్ట్ర నీటిపారుదల శాఖలోని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్‌ను కోరింది. ఈ మేరకు ఎన్డీఎస్ఏ డైరెక్టర్ (గేట్స్ డిజైన్) రాహుల్‌కుమార్ సింగ్ శనివారం లేఖ రాశారు. ఈనెల 18న ఆకస్మిక వరదలు ముంచెత్తగా, పెద్దవాగు గేట్లను పైకి ఎత్తలేకపోయారు. దీంతో కరకట్టకు 25 చోట్ల గండ్లు పడ్డాయి. గేట్ల పక్కనే భారీగా గండిపడటంతో లోతట్టు ప్రాంతాల్లో వరద ముంచెత్తింది. 2021లో డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అమలులోకి రాగా... ఈ ప్రాజెక్టు కూడా దాని పరిధిలోకి వెళ్లింది. నిబంధనల ప్రకారం ప్రాజెక్టుకు వానాకాలానికి ముందు, తర్వాత తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలి. వానాకాలానికి ముందు ప్రాజెక్టు స్థితిగతులపై తనిఖీలు చేశారా? అని ఎన్డీఎస్ఏ ఆరా తీసింది. వైఫల్యానికి గల కారణాలు, చర్యలపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించింది. ప్రాజెక్టు వద్ద అమలు చేస్తున్న వరద ప్రమాద హెచ్చరికల వ్యవస్థ, అత్యవసర చర్యల ప్రణాళికకు సంబంధించిన వివరాలు కూడా ఇవ్వాలని చెప్పింది. చట్టం ప్రకారం వరదను విడుదల చేసే ముందు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, వారంతా సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాక విడుదల చేయాలి. కానీ, అలాంటి ప్రయత్నం చేయలేదని తేలింది. నివేదిక అందగానే ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ రాష్ట్రానికి వచ్చి, పెద్దవాగును పరిశీలించనుంది. గోదావరి బేసిన్‌లోని పెద్దవాగును 1976లో నిర్మించగా, దాని కింద 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో 85 శాతం ఆయకట్టు ఏపీలో, 15 శాతం తెలంగాణలో ఉంది.

అన్ని గేట్లు ఎత్తి పెట్టాల్సిందే

- మేడిగడ్డ బరాజ్ సహా మిగతా రెండు బరాజ్‌ల గేట్లెత్తాలి... వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదిలేయండి
- మంత్రి ఉత్తమ్, అధికారుల స్థాయి భేటీలో స్పష్టం చేసిన ఎన్డీఎస్ఏ
- రేపు మరోమారు సమావేశం
- ఎన్డీఎస్ఏ సూచనల మేరకే నడుచుకుంటామన్న ఉత్తమ్
- కమీషన్ల కోసం డిజైన్ మార్చి ఇప్పుడు కారుకూతలా అంటూ కేటీఆర్‌పై మండిపాటు



శనివారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఎస్ఏ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్ సహా మిగతా రెండు బరాజ్‌ల గేట్లను పూర్తిగా ఎత్తి పెట్టాల్సిందేనని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. ప్రస్తుతం బరాజ్‌ల్లోకి వస్తున్న వరదను వచ్చింది వచ్చినట్లుగా దిగువకు వదిలేయాలని సూచించింది. సోమవారం మరోమారు ఇంజనీర్ల స్థాయిలో చర్చించి, తదుపరి కార్యాచరణపై చర్చిద్దామని తెలిపింది. మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ సహా ఇతర అంశాలపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం మధ్యాహ్నం ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌తో సమావేశమయ్యారు. మంత్రితో పాటు నీటి పారుదల శాఖ కార్యదర్శులు రాహుల్ బొజ్జ, ప్రశాంత్ జీవన్ పాటిల్, ఓఅండ్ఎం ఈఎన్సీ నాగేంద్రరావు, కాళేశ్వరం సీఈ సుధాకర్ రెడ్డిలు పాల్గొన్నారు. సుమారు రెండున్నర గంటల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల మరమ్మతులు, నీటి తరలింపు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ సహా ఇతర బరాజ్‌ల్లో మరమ్మతులు, పునరుద్ధరణలో భాగంగా ఎన్డీఎస్ఏ సూచనల మేరకు చేపట్టిన పనుల వివరాలను ఇంజనీర్లకు వివరించారు. సీడబ్ల్యూపీఆర్ఎస్, సీఎస్ఎమ్మార్ఎస్‌కు సంబంధించిన నివేదికలు పూర్తి స్థాయిలో అందనందున బరాజ్‌ల్లో నీటి నిల్వలపై ఇప్పటికిప్పుడు నిర్ణయం చేయలేమని, ఈ దృష్ట్యా అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడమే ఉత్తమమని ఎన్డీఎస్ఏ చైర్మన్ స్పష్టం చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. భేటీ వివరాలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు.

ఎన్డీఎస్ఏ సూచనల మేరకే ముందుకు: ఉత్తమ్

కాళేశ్వరం బరాజ్‌ల విషయంలో ఎన్డీఎస్ఏ సూచనల మేరకు ముందుకు వెళతామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. 'బరాజ్‌లో నీటి నిల్వలు, వాటిని తిరిగి వినియోగంలోకి తెచ్చే అంశాలపై రెండున్నర గంటల పాటు చర్చించాం. ఎన్డీఎస్ఏ కమిటీ సూచనల మేరకు ఇప్పటికే చేపట్టిన పనులను, పరీక్షలను వివరించాం. ఇంకా కొన్ని పరీక్షల ఫలితాలు రావాల్సి ఉందని చెప్పాం. దీనిపై వారు ఇప్పటికైతే అన్ని గేట్లు ఎత్తిపెట్టి నీళ్ల కిందకి వదిలేయండని చెప్పారు. దానికి అనుగుణంగానే అన్ని గేట్లు ఎత్తినీటిని వదిలేస్తాం. దీనిపై కేబినెట్‌లోనూ చర్చించి నిర్ణయాలు తీసుకుంటాం'అని వివరించారు. మేడిగడ్డలో మాత్రం ఒక గేటు పనిచేయడం లేదని, దానిని పూర్తిగా కట్ చేసి మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మేడిగడ్డతో పాటు అన్నారంలో సీపేజీలను, సుందిళ్లలో కొన్ని లోపాలను కేంద్ర సంస్థ గుర్తించిందని, ప్రజా జీవితాలకు సంబంధించిన విషయమైనందున నిపుణుల సూచన మేరకే ముందుకెళ్తామన్నారు. ఎల్లంపల్లి ఎగువన నీటిని వినియోగించుకొని, ఆయకట్టుకు నీటిని అందించే అవకాశాలన్నింటినీ పరిశీలిస్తున్నామని మంత్రి చెప్పారు.

కుంగిందెప్పుడు..ఆర్కిటెక్ట్ ఎవరు..?

ఈ సందర్భంగా కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్‌ని వినియోగించుకోవడంతో కాంగ్రెస్ విఫలమైందంటూ బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి కేటీఆర్ చేసిన విమర్శలపై మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. 'కేవలం కమిషన్ల కోసం తుమ్మిడిహెట్టి డిజైన్‌ను మేడిగడ్డకు మార్చారు. రూ.38వేల కోట్లతో పూర్తయ్యేదాన్ని రూ.1.50లక్షల కోట్లకు పెంచారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని తప్పుడు లెక్కలు చెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కడితే ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చని అంచనా వేస్తే, ఇప్పుడు కాళేశ్వరంతో ఏటా ఖర్చు రూ.10వేల కోట్లకు చేరుతోంది. ప్రాజెక్టుకు తెచ్చిన అప్పులపై వడ్డీలకే ఏటా రూ.15వేల కోట్లవుతున్నాయి. ఇంతా చేసి ఏడాది 13 టీఎంసీల చొప్పున ఐదేళ్లలో 65 టీఎంసీలు ఎత్తిపోశారు. దీనికి కర్త, ఆర్కిటెక్ట్, బిల్డర్ అన్నీ కేసీఆర్ అన్ని గొప్పలు చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉండగానే మేడిగడ్డ కుంగితే మాత్రం ఒక్క మాట మాట్లాడలే. ప్రాజెక్టు నాశనం చేసిన వాళ్లే ఇప్పుడు మాపై నిందలు వేస్తున్నారు. అబద్ధాలు చెప్పడానికైనా కేటీఆర్‌కు హద్దుండాలి'అని ఉత్తమ్ విరుచుకుపడ్డారు.

మా హయాంలోనే తుమ్మిడిహెట్టి పూర్తి..

ఇక తమ హయాంలోనే తుమ్మిడిహెట్టి బరాజ్‌ని పూర్తి చేస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత వరద దృష్ట్యా ఏ ప్రాజెక్టులోనూ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ఇంజనీర్లను అప్రమత్తం చేశామన్నారు. ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు అంతరాష్ట్ర ప్రాజెక్టు అని, 90 శాతం ఆయకట్టు ఏపీలో ఉందని, ఐదు అడుగుల మేర వరద రావడంతో అక్కడ కొన్ని ఇక్కట్లు ఎదురయ్యాయని ఉత్తమ్ వెల్లడించారు.



> పరలోకమునుండి దిగి వచ్చి, లోకమునకు జీవము నిచ్చునది దేవుడనుగ్రహించు ఆహారమై యున్నదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** పౌర్ణమి సా.4.12 వరకు, తదుపరి బహుళ పాడ్యమి; **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.52 వరకు, తదుపరి శ్రవణం; **వర్జ్యం:** ఉ.10.13 నుండి 11.47 వరకు, తదుపరి తె.5.43 నుండి 7.16 వరకు (తెల్లవారితే సోమవారం); **దుర్ముహూర్తం:** సా.4.49 నుండి 5.41 వరకు; అమృత ఘడియలు రా.7.34 నుండి 8.56 వరకు; గురు పూర్ణిమ – వ్యాసపూర్ణిమ.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

నిర్మలా సీతారామన్ (ఆర్థిక మంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రెండ్రోజుల్లో బడ్జెట్. పంకజ్ చౌదరి ఇంకా హల్వా గురించే మాట్లాడుతున్నారు! చూస్తుంటే జీవితం పట్ల ఆయన కొత్తగా ఒక దృక్పథాన్ని ఏర్పరుచుకున్నట్లుగా నాకు అనిపిస్తోంది.

"బాగా వండిన హల్వా మానవ జీవితాన్ని రసమయం చేస్తుంది కదా మేడమ్‌జీ..." అంటూ, ఈ ఏడాది బడ్జెట్ విశేషం హల్వానే అన్నట్లు గత వారం రోజులుగా ఆయన నన్ను కీర్తిస్తూ ఉన్నారు. అంతగా హల్వా ఆయనకు నచ్చినట్లుంది.

ఆ రోజు – జూలై 16న, హల్వా సెర్మనీలో ఆయన తన చేతిలోని హల్వాను ఎంతో ప్రియంగా ఒక్కో తునకా నోట్లో వేసుకోవటం గమనించాన్నేను.

"బాగుందా పంకజ్‌జీ, బడ్జెట్ హల్వా" అనేయబోయి, తమాయించుకున్నాను.



ఒకవేళ ఆయన "బాగుంది మేడమ్‌జీ" అని అనుంటే కనుక, అనుబంధ ప్రశ్నగా నేనాయన్ని "మరికొంచెం వడ్డించమంటారా?" అని అడగటం నా కనీస ధర్మం అయ్యేది. అప్పుడాయన... "చాలు మేడమ్‌జీ... 'అందరికీ సరిపోవాలి కదా" అని బిడియపడవచ్చు. లేదంటే... "అలాగే మేడమ్‌జీ, మరికొంచెం వడ్డించండి" అనీ అనొచ్చు.

పంకజ్ ఒక్కరికే మరికొంచెం వడ్డించినంత మాత్రాన హల్వాకు వచ్చే కొరత ఏమీ ఉండదు. పైగా పంకజ్ మూడేళ్లుగా ఆర్థికశాఖ సహాయ మంత్రి. మరికొంచెం హల్వాపై ఆయనకు ఆ మాత్రం హక్కు ఎలాగూ ఉంటుంది.

సమస్య ఏమిటంటే, తక్కిన వాళ్లు కూడా ఆయన స్ఫూర్తితో మరికొంచెం అంటూ ముందుకు వస్తే కొంచాన్నే కొంచెం కొంచెంగా అందరికీ సర్దవలసి వస్తుంది. అందుకే నేను "బాగుందా పంకజ్‌జీ, బడ్జెట్ హల్వా..." అని అడగబోయి కూడా ఆగిపోయాను.

హల్వాను తను ఇష్టంగా తింటున్నంత సేపూ నాలో ఇంత సంఘర్షణ జరిగిందని పంకజ్‌కు తెలిసే అవకాశం లేకున్నా... ఆయన అక్కడితో సరిపెట్టుకుని నా వైపు వచ్చారు!

టీమ్‌లోని మిగతా ఆరుగురు మాకు కాస్త దూరంగా నిలబడి ఉన్నారు. సోమనాథన్, అజయ్ సేథ్, తుహిన్ కాంత పాండే, సంజయ్ మల్హోత్రా, వివేక్ జోషీ, అనంత నాగేశ్వరన్... అంతా ఫైనాన్స్ సెక్రెటరీలు, ఎకనమిక్ అడ్వైజర్‌లు. బడ్జెట్ తయారైంది వాళ్ల చేతుల్లోనే! నా బడ్జెట్ స్పీచ్ డ్రాఫ్ట్‌కి మెరుగులు దిద్దింది సంజయ్ మల్హోత్రా.

"ఈసారి బాగా కుదిరింది మేడమ్‌జీ..." అన్నారు పంకజ్.

"అవును పంకజ్‌జీ! ఈసారి మన మీద చాలా ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి" అన్నాన్నేను.

"మేడమ్‌జీ! ఎక్స్‌పెక్టేషన్స్ బడ్జెట్ మీద కదా ఉంటాయి. హల్వా మీద కూడా ఉంటాయా?" అన్నారు పంకజ్! అప్పుడు గానీ నాకు అర్థం కాలేదు ఆయన బాగా కుదిరింది అని అంటున్నది హల్వా గురించి అని.

"అవును పంకజ్‌జీ... హల్వా బాగా కుదిరింది. బడ్జెట్ కూడా అలా వస్తే బాగుంటుంది కదా..." అన్నాను నవ్వుతూ.

"మీరేదైనా బాగా చేయగలరు మేడమ్‌జీ." అన్నారాయన. నవ్వాన్నేను.

"హల్వాకు గానీ, బడ్జెట్ స్పీచ్ డ్రాఫ్ట్‌కు గానీ ఒక ఫినిషింగ్ టచ్ ఉండాలి పంకజ్‌జీ. అప్పుడు మాత్రమే అవి పూర్తయినట్లు. అంతగా ఇష్టమైంది కదా మీకు హల్వా, ఆ హల్వాకు ఫినిషింగ్ టచ్ ఏమిటో చెప్పండి చూద్దాం?" అన్నాను.

"నేనైతే... హల్వాలో కనిపించే ఆ డ్రైఫ్రూట్స్ పలుకులు అనుకుంటున్నాను మేడమ్‌జీ.." అన్నారాయన.

"సరిగ్గా చెప్పారు. బడ్జెట్ స్పీచ్‌కి కూడా అలాంటి పలుకులే కావాలి. చాణక్యుడివీ, తిరువళ్లువార్‌వీ... నా కోసం కొన్ని పలుకులు వెదకి పెట్టగలరా పంకజ్‌జీ?" అని అడిగాను.

అడిగి వారం కావస్తోంది.

ఆయన అవుననలేదు. కాదనలేదు! ఇవాళొచ్చి... "దేనికైనా ఫినిషింగ్ టచ్ ఇవ్వటం అంత తేలిక కాదేమో కదా మేడమ్‌జీ" అంటున్నారు!!

రాష్ట్రపతి పాలనే శరణ్యం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



''మేం అధికారంలోకి వస్తున్నాం, రాగానే 'అకౌంట్స్' సెటిల్ చేస్తాం. ఒక ఆరు నెలలపాటు మాలో కొందరం ఇదే పని మీద ఉంటాం. అందరి అకౌంట్లూ సెటిల్ చేస్తాం''. ఎన్నికలకు ముందు ఒక తెలుగుదేశం నాయకురాలు టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలివి. ఇప్పుడా నాయకురాలు హోం మంత్రిగా పని చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ యువనేత అనేక సభల్లో తన చేతుల్లోని 'రెడ్ బుక్'ను ప్రజలకు చూపెట్టారు. ఈ 'రెడ్ బుక్'లో ప్రత్యర్థుల పేర్లను రాసుకుంటున్నాననీ, అధికారంలోకి రాగానే వారి సంగతి తేల్చేస్తాననీ హెచ్చరికలు జారీ చేశారు. తమ మాట వినని అధికారులకు కూడా ఈ హెచ్చరికలు వర్తిస్తాయనే బెదిరించే ప్రయత్నం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఆంధ్రప్రదేశ్ అంతటా యువనేత, 'రెడ్ బుక్' బొమ్మలతో కూడిన హోర్డింగులు ప్రత్యక్షమయ్యాయి. ఆ యువనేత ఇప్పుడు క్యాబినెట్‌లో ఉన్నారు. కీలక నిర్ణయాలన్నీ ఆయనే తీసుకుంటున్నారని సమాచారం.

ఈ రెండు ఉదాహరణలు మచ్చుకు మాత్రమే! తెలుగుదేశం ప్రభుత్వం కక్షపూరిత పాలనా విధానానికి దిగజారిందని చెప్పడానికి ఇటువంటి డజన్లకొద్దీ ఉదాహరణలు ఇవ్వవచ్చు. రాజ్యాంగ వ్యవస్థల్లోని అతి ప్రధాన విభాగమైన ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ బాహాటంగానే రాజ్యాంగేతర పాలనా పద్ధతులను ఎంచుకుంటున్నది. పర్యవసానాలు జనజీవితాన్ని భయకంపితం చేస్తున్నాయి.

అధికార పార్టీ కక్షలకూ, కార్పణ్యాలకూ ఆరు వారాల స్వల్పకాలంలోనే 32 మంది వైసీపీ అభిమానులు హతమైనట్టు వార్తలందుతున్నాయి. వినుకొండలోని ఒక ప్రధానమైన సెంటర్‌లో వేలాది మంది ప్రజల సమక్షంలో వైసీపీ కార్యకర్త రషీద్‌ను నరికి చంపిన దృశ్యం రాష్ట్ర ప్రజలకు దిగ్భ్రాంతిని కలిగించింది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పట్టింది. వైసీపీకి అనుకూలంగా ఉండే ఒక దళిత మహిళా రైతును తెలుగుదేశం కార్యకర్త అత్యంత పాశవికంగా ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన దారుణం జరిగిన వారం రోజుల్లోనే రషీద్ దారుణ హత్య జరగడం రాష్ట్ర ప్రజలను కలవరపరుస్తున్నది.

వైసీపీ కార్యకర్తలూ, అభిమానులపై ఈ ఆరు వారాల్లో 305 హత్యాయత్నాలు జరిగినట్టు వివరాలు అందుతున్నాయి. తిరువూరులో ఒక మునిసిపల్ కౌన్సిలర్‌నే రోడ్లపై పరుగెత్తిస్తూ కత్తులతో పొడిచిన వీడియో చిత్రం కూడా కలకలం సృష్టించింది. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడి 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్టు వైసీపీ చెబుతున్నది. దాదాపు నాలుగు వేల కుటుంబాలు సొంత ఊరును వదిలి దూరంగా శరణార్థుల మాదిరిగా తలదాచుకుంటున్నాయి.

> అధికార పార్టీ కక్షలకూ, కార్పణ్యాలకూ ఆరు వారాల స్వల్పకాలంలోనే 32 మంది వైసీపీ అభిమానులు హతమైనట్టు వార్తలందుతున్నాయి. వినుకొండలోని ఒక ప్రధానమైన సెంటర్‌లో వేలాది మంది ప్రజల సమక్షంలో వైసీపీ కార్యకర్త రషీద్‌ను నరికి చంపిన దృశ్యం రాష్ట్ర ప్రజలకు దిగ్భ్రాంతిని కలిగించింది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పట్టింది. వైసీపీకి అనుకూలంగా ఉండే ఒక దళిత మహిళా రైతును తెలుగుదేశం కార్యకర్త అత్యంత పాశవికంగా ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన దారుణం జరిగిన వారం రోజుల్లోనే రషీద్ దారుణ హత్య జరగడం రాష్ట్ర ప్రజలను కలవరపరుస్తున్నది.
>
> వైసీపీ కార్యకర్తలూ, అభిమానులపై ఈ ఆరు వారాల్లో 305 హత్యాయత్నాలు జరిగినట్టు వివరాలు అందుతున్నాయి. తిరువూరులో ఒక మునిసిపల్ కౌన్సిలర్‌నే రోడ్లపై పరుగెత్తిస్తూ కత్తులతో పొడిచిన వీడియో చిత్రం కూడా కలకలం సృష్టించింది. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడి 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్టు వైసీపీ చెబుతున్నది. దాదాపు నాలుగు వేల కుటుంబాలు సొంత ఊరును వదిలి దూరంగా శరణార్థుల మాదిరిగా తలదాచుకుంటున్నాయి.

వైసీపీ పార్లమెంట్ సభ్యుడు, లోక్‌సభలో ఆ పార్టీ నాయకుడైన మిథున్‌రెడ్డిపై దాడి చేశారు. ఆయన సొంత నియోజకవర్గంలో మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంట్లో కూర్చుని మాట్లాడుతున్న సందర్భంలో పథకం ప్రకారం రౌడీ మూకల్ని తరలించి రాళ్ల దాడి చేశారు. ఎంపీ వాహనంతో సహా డజనుకు పైగా వాహనాలకు నిప్పుపెట్టారు. 560 కుటుంబాల ఆస్తులను అధికార పార్టీ మూకలు ధ్వంసం చేశాయి. పరిపాలనా వికేంద్రీకరణకు ఆయువుపట్టు వంటి గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లపై వందల సంఖ్యలో దాడులు జరిగాయి. వైఎస్ జగన్ ఆనవాళ్లు కనిపించకూడదన్న కక్షతో వేలాది శిలాఫలకాలను పగులగొట్టారు.

జరిగిన సంఘటనలనూ, వాటి తీవ్రతనూ గమనంలోకి తీసుకుంటే ఈ ఆరు వారాల కాలాన్ని 'బీభత్స పాలన' (reign of terror) గా పరిగణించాలి. ఈ నేపథ్యంలోనే నిన్న రషీద్ కుటుంబ పరామర్శకు వెళ్లిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మాట్లాడిన మాటలను అర్థం చేసుకోవాలి. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీవ్ర భంగం వాటిల్లిన నేపథ్యంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బెంగాల్, తమిళనాడుల్లో ఎన్నికల తర్వాత బీజేపీ కార్యకర్తలపై జరిగిన స్వల్ప దాడులకే ఆ రాష్ట్రాలకు కేంద్ర బలగాలను పంపిన మోదీ సర్కార్ ఆంధ్రప్రదేశ్‌లోని తమ కూటమి ప్రభుత్వం బీభత్సపాలన చేస్తున్నా మిన్నకుండటం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం.

ఒకపక్క తెలుగునాట మెజారిటీ మీడియా సంస్థలపై తెలుగుదేశం అనుకూలవర్గ గుత్తాధిపత్యం కొనసాగుతున్నది. మరోపక్క కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ భాగస్వామి. ఈ పరిస్థితుల్లో దేశంలో ఉన్న ప్రజాస్వామ్య మద్దతుదారులందరి దృష్టికీ జరుగుతున్న ఆగడాలను తీసుకురావడం కోసం ఈ బుధవారం ఢిల్లీలో ధర్నా చేయాలని వైసీపీ సంకల్పించింది. రాష్ట్రపతి పాలన అంశాన్ని గత కేంద్ర ప్రభుత్వాలు ఒక రాజకీయ ఆయుధంగా వాడుకున్నందు వల్ల దానిపై ప్రజాస్వామికవాదుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొని ఉన్నాయి. ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొని ఉన్న యథార్థ పరిస్థితులను జాతీయ స్థాయికి తీసుకొని వెళ్లడం వైసీపీకి అవసరం.

భారత రాజ్యాంగం ఆర్టికల్ 355 ప్రకారం 'విదేశీ దాడుల నుంచీ, అంతర్గత కల్లోలం నుంచీ రాష్ట్రాలను కాపాడే బాధ్యత యూనియన్ ప్రభుత్వానిదే. ఆ రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన పాలన కొనసాగేలా చూడటం కూడా కేంద్రం బాధ్యత'. ఈ ఆర్టికల్‌ను మరింత విశదీకరిస్తే 'రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగానే రాష్ట్రాల ప్రభుత్వాలు పరిపాలించాలి. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ భద్రత కల్పించడంతోపాటు, అతని ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడటం కూడా రాష్ట్ర ప్రభుత్వం విధి'. రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన పరిపాలన జరగడం కోసం అవసరాన్ని బట్టి రాష్ట్రపతి పాలన విధించే విశేషాధికారాన్ని ఆర్టికల్ 356 ద్వారా రాష్ట్రపతికి రాజ్యాంగం కట్టబెట్టింది.

రాష్ట్రాల్లో రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా పరిపాలించడం కుదరని పరిస్థితులు ఏర్పడినట్లయితే ఆర్టికల్ 356 (1) ప్రకారం రాష్ట్రపతి పాలన విధించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు శాంతిభద్రతల పరిస్థితికి ఏర్పడిన విఘాతం సాధారణమైనది కాదు. జరుగుతున్నవి చెదురుమదురు సంఘటనలు అసలే కావు. సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు లెక్కగట్టిన వివరాల ప్రకారం శుక్రవారం నాటికే రోజుకు సగటున 130 హింసాత్మక సంఘటనలు జరిగాయి. నెలరోజుల్లో 22 మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. ఇందులో నలుగురిని చంపేశారు. అభం శుభం తెలియని చిన్నారులను కూడా చిదిమేశారు. ఒక బాలిక చనిపోయిందని చెబుతున్న పోలీసు యంత్రాంగం ఆమె శవాన్ని కూడా రెండు వారాలు దాటినా గుర్తించలేకపోయింది.

'ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో రాష్ట్రపతి పాలనపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును చెప్పింది. రాజకీయ కారణాలతో ఎడాపెడా రాష్ట్రపతి పాలన విధించే సంప్రదాయాలకు చెక్ పెడుతూనే, ఏయే సందర్భాల్లో విధించడం సమర్థనీయమో కూడా రాజ్యాంగ విస్తృత ధర్మాసనం తీర్పు (1994) చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉంటే రాష్ట్రపతి పాలన విధించవచ్చని అభిప్రాయపడింది. ఉదాహరణకు సెక్యులరిజం అనే అంశం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగం. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు సెక్యులరిజాన్ని బలహీనపరిచేవిగా ఉంటే ఆ రాష్ట్ర పరిస్థితులు 356వ అధికరణంలో పేర్కొన్నట్టుగా ఉన్నాయనే భావించాలి.

రాజ్యాంగ పీఠికను రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గుర్తుగా భావిస్తారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజంతోపాటు ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం – ఆలోచనా, భావప్రకటన, విశ్వాసం, ఆరాధనా స్వేచ్ఛ – అవకాశాల్లో, హోదాల్లో సమానత్వం – వ్యక్తిగత గౌరవం వంటి అంశాలకు కూడా పీఠిక ప్రాధాన్యమిచ్చింది. ఇందులో దేనికి భంగం కలిగినా రాజ్యాంగ మౌలిక స్వరూపంపై జరిగిన దాడిగానే పరిగణించాలి. భిన్నమైన రాజకీయ అభిప్రాయాలు కలిగి ఉండటాన్ని ప్రస్తుత ఏపీ ప్రభుత్వం నేరంగా పరిగణిస్తున్నది. ప్రతిపక్ష కార్యకర్తలను మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు జోడింపజేసి అధికారపక్షీయులు తమ నాయకునికి జైకొట్టించుకుంటున్నారు. ఇటువంటి వీడియోలు అసంఖ్యాకంగా యూట్యూబ్‌లో కనిపిస్తున్నాయి. ఈ చర్యలు అనైతికమే కాదు రాజ్యాంగ విరుద్ధం కూడా!

రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడడం, హింసను రెచ్చగొట్టడం కూడా రాష్ట్రపతి పాలన విధించడానికి అనువైన చర్యలుగా బొమ్మై కేసులోనే సుప్రీంకోర్టు తేల్చింది. ఉద్దేశపూర్వకంగానే తమ ప్రత్యర్థులపై దాడులు చేస్తామని, 'అకౌంట్లు' సెటిల్ చేస్తామని ఎన్నికల ముందునుంచే తెలుగుదేశం నాయకులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రత్యర్థులపై కక్ష సాధించడమే ధ్యేయంగా 'ఉద్దేశపూర్వకంగా' రెడ్‌బుక్ హోర్డింగులను రాష్ట్రవ్యాపితంగా నెలకొల్పి, తమ పార్టీ కార్యకర్తల హింసాప్రవృత్తిని రెచ్చగొడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తన రాజ్యాంగ విధులను, బాధ్యతలను విస్మరించడం కూడా రాష్ట్రపతి పాలనకు దారితీయాల్సిన పరిస్థితిగానే సర్వోన్నత న్యాయస్థానం పరిగణించింది. ఈ నలభై రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఐదువేల పైచిలుకు హింసాయుత ఘటనల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యతలను విస్మరించింది. ఏ సందర్భంలోనూ పోలీసు యంత్రాంగం స్పందించకపోవడానికి వెనుకనున్న కారణం – రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాలే! ఎంపీ మిథున్‌రెడ్డిని తన నియోజకవర్గంలో పర్యటించకుండా రౌడీ మూకలు అడ్డుకున్న సందర్భంలో గానీ, వినుకొండ నడి బజారులో రషీద్‌ను తెగనరుకుతున్న సందర్భంలో గానీ పోలీసులు ప్రేక్షకపాత్రనే పోషించారు.

ఈ హింసాకాండ – నరమేధం ఆరు మాసాలపాటు కొనసాగిస్తామని ఆ పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు. ఇక ఉపేక్షించడం క్షంతవ్యం కాదు. తన కూటమి భాగస్వామ్య పక్షం పట్ల మోదీ ప్రభుత్వం ఒలకబోస్తున్న ధృతరాష్ట్ర ప్రేమకు వారు కూడా మూల్యం చెల్లించవలసి ఉంటుంది. ఈ ఆటవిక పాలనను ఇంకా కొనసాగించడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక అవసరంగా మారింది. తమ పార్టీ ఇచ్చిన అలవికాని హామీలను అమలు చేయడం సాధ్యం కాదు. ప్రశ్నించడానికి ప్రతిపక్షాలు, ప్రజలు భయపడాలి. అందుకోసం ఈ బీభత్స పాలన కొనసాగాలి. రేపటి బడ్జెట్‌లో తమ 'సూపర్ సిక్స్' హామీల అమలుకు అదనంగా లక్ష కోట్లు పైచిలుకు కావాలి. అందువల్ల పూర్తి బడ్జెట్‌ను మరోసారి వాయిదా వేసి, మళ్లీ 'ఓట్ ఆన్ అకౌంట్' పెట్టే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే ఇది కూడా అసాధారణ చర్యే!

> ఉద్దేశపూర్వకంగానే తమ ప్రత్యర్థులపై దాడులు చేస్తామని, 'అకౌంట్లు' సెటిల్ చేస్తామని ఎన్నికల ముందునుంచే తెలుగుదేశం నాయకులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రత్యర్థులపై కక్ష సాధించడమే ధ్యేయంగా 'ఉద్దేశపూర్వకంగా' రెడ్‌బుక్ హోర్డింగులను రాష్ట్రవ్యాపితంగా నెలకొల్పి, తమ పార్టీ కార్యకర్తల హింసాప్రవృత్తిని రెచ్చగొడుతున్నారు.
>
> రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తన రాజ్యాంగ విధులను, బాధ్యతలను విస్మరించడం కూడా రాష్ట్రపతి పాలనకు దారితీయాల్సిన పరిస్థితిగానే సర్వోన్నత న్యాయస్థానం పరిగణించింది. ఈ నలభై రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఐదువేల పైచిలుకు హింసాయుత ఘటనల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యతలను విస్మరించింది. ఏ సందర్భంలోనూ పోలీసు యంత్రాంగం స్పందించకపోవడానికి వెనుకనున్న కారణం – రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాలే! ఎంపీ మిథున్‌రెడ్డిని తన నియోజకవర్గంలో పర్యటించకుండా రౌడీ మూకలు అడ్డుకున్న సందర్భంలో గానీ, వినుకొండ నడి బజారులో రషీద్‌ను తెగనరుకుతున్న సందర్భంలో గానీ పోలీసులు ప్రేక్షకపాత్రనే పోషించారు.
>
> ఈ హింసాకాండ – నరమేధం ఆరు మాసాల పాటు కొనసాగిస్తామని ఆ పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు. ఇక ఉపేక్షించడం క్షంతవ్యం కాదు. తన కూటమి భాగస్వామ్య పక్షం పట్ల మోదీ ప్రభుత్వం ఒలకబోస్తున్న ధృతరాష్ట్ర ప్రేమకు వారు కూడా మూల్యం చెల్లించవలసి ఉంటుంది.

vardhelli1959@gmail.com

నిరుపేదల నెత్తురులో ఎన్ని విప్లవాలో!



దాశరథి కృష్ణమాచార్య

నిజాం పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కావు. ఆయన్ని ప్రశ్నించటం అంటే ప్రాణాలకు తెగించడమే. దాశరథి కృష్ణమాచార్యులు చేసింది అదే! నిజాం పాలనలో తెలంగాణ ప్రజల ఆర్తనాదాలనూ, ఆకలి కేకలనూ చూసి చలించి ఉక్కు పిడికిలి బిగించి జంగు సైరన్ ఊదారు దాశరథి. నిజాం రాజు తనను నిజామాబాద్ జైలులో బంధిస్తే జైలు గోడలపై బొగ్గుతో నిజాంకు వ్యతిరేకంగా 'ఓ నిజాం పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని' అంటూ కవితలు లిఖించారు. దాశరథి శతజయంతి సంవత్సర ప్రారంభ సందర్భంగా ఆయన రచించిన 'అగ్నిధార' కవితా ఖండికలోని కొన్ని సాహిత్య విషయాలూ, చారిత్రక వాస్తవాలూ పరిశీలించడం నేటి తరానికి స్ఫూర్తినిస్తుంది.

'ఇది నిదాఘము; ఇందు సహింపరాని/ వేడి యేడ్పించుచున్నది; పాడువడిన / గోడలందున జైలులో పాడినాడ/ వాడిపోనున్న పూమొగ్గ పైన పాట;/ ఆయాసపడు జైలులో యెన్ని ప్రజల రా/జ్యము లున్నవో! యని యరసినాను;/ నిరుపేదవాని నెత్తురు చుక్కలో నెన్ని/ విప్లవాలో! యని వెదకినాను' అని ఇందూరు జైలులో (నిజామాబాద్) బందీ అయినది శరీరమే కానీ మనస్సు కాదంటూ నిప్పులు చెరిగే కవిత్వాన్ని రాశారు. బొగ్గుతో గోడలపై వ్రాసి నన్ను బంధిస్తే తన గళం ఇంకా పదునెక్కుతుందని గొంతు చించుకొని అరిచారు. జైలులోని పరిస్థితులను వివరిస్తూ– సహింపరాని వేడి ఏడ్పిస్తు ఉండగా, మొత్తుకున్నాను, ఏడ్చాను నా స్వేచ్ఛకు ఆంక్షలు విధించిన ఓ నిజాం పిశాచమా నన్నే నువ్వు ''బందీని'' చేస్తే సామాన్యులు పరిస్థితి ఏమిటి? నిరుపేద వాని నెత్తురు చుక్కలో ఎన్ని విప్లవాలో అని వెదికాను అంటూనే... 'వెన్నెలలు లేవు, పున్నమ కన్నే లేదు, పైడి వెన్నెల నెలవంక జాడలేదు, చుక్కలే లేవు, ఆకాశ శోకవీధి, ధూమ దామమ్ము దుఃఖ సంగ్రామ భూమి' అంటూ తెలంగాణ ప్రాంతం మొత్తం చీకట్లో ఉన్నట్లుగా, యుద్ధ భూమిని తలపిస్తున్నట్లుగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఓసి కూలిదానా! అరుణోదయాన/ మట్టి తట్ట నెత్తిన బెట్టి మరుగులేని/యెత్తు రొమ్మును పొంగించి యెందుకొరకు/ ఉస్సురనెదవు? ఆకాశ ముడికిపోవ?' అంటూ రాసిన కవితా పాదాలు చార్మినారు పరిసరాలలో రాతికట్టడాల నిర్మాణ సమయంలో ఓ మహిళా కూలీని చూసి చలించి వ్రాసిన 'ఉస్సురనెదవు' కవితలోనివి.

'అనాదిగా సాగుతోంది/ అనంత సంగ్రామం/ అనాథుడికి, ఆగర్భ/ శ్రీనాథుడికీ మధ్య/ సేద్యం చేసే రైతుకు/ భూమి లేదు, పుట్రలేదు/ రైతుల రక్తం త్రాగే/ జమీందార్ల కేస్టేట్లు' అంటారు 'అనంత సంగ్రామం' కవితలో! యుద్ధం ఇంకా మిగిలేవుంది అన్నట్లుగా ఆదిమ కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు అనేక సంఘర్షణలకు పరిష్కారం లభించట్లేదు. పెద్ద చేప చిన్నచేపను మింగుతున్నట్లుగా, ఉన్నవాడు లేనివాడిని దోచుకుంటే, కర్షకుడికి భూమి లేకుండా, విలాసంగా గడిపేవారికి వందల ఎకరాలు (ఎస్టేట్లు) వుంటే తప్పకుండా 'సంగ్రామం' జరుగుతుంది మరి!

'ఇదే మాట ఇదే మాట/ పదే పదే అనేస్తాను/ కదం తొక్కి పదం పాడి/ ఇదే మాట అనేస్తాను/ దగాకోరు బటాచోరు/ రజాకారు పోషకుడవు/ వూళ్ళ కూళ్ళు అగ్గిపెట్టి/ ఇళ్ళన్నీ కొల్లగొట్టి/ తల్లి పిల్ల కడుపుకొట్టి/ నిక్కిన దుర్మార్గమంత/ దిగిపోవోయ్ తెగిపోవోయ్ / తెగిపోవోయ్ దిగిపోవోయ్/ ఇదే మాట ఇదే మాట/ పదే పదే అనేస్తాను' అంటారు 'అగ్నిధార' కావ్యంలోని చివరి కవితలో. ఈ కవిత శ్రీశ్రీ 'జగన్నాథుని రథ చక్రాలు' కవితను గుర్తుకు తెస్తుంది. 'ఇక చాలు నీ అసమర్థపాలన' అంటూ కడిగిపారేశారు, ఈ కవితలో. కవి ఎప్పుడూ పాలకపక్షం కాకుండా ప్రజలపక్షం నిలబడాలి. అన్నార్థుల వైపు, అనాథల వైపు, ఆకలి కేకల వైపు నిలబడాలి. అచ్చంగా అదే చేశారు దాశరథి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఊరు ఊరునా వాడవాడలా 'అగ్నిధార' కావ్యంలోని వాక్యాలు తెలంగాణ సమాజంలోని ప్రతి గొంతుకను పిడికిలెత్తి అరిచేలా చేశాయి. స్వరాష్ట్రం సిద్ధించాక దాశరథి పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా లబ్ధప్రతిష్ఠులకు అవార్డులు ఇచ్చి సన్మానించి దాశరథి కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తోంది అధికారికంగా!


– డా॥ మహ్మద్ హసన్
తెలుగు సహాయాచార్యులు, నల్గొండ
99080 59234

(రేపు దాశరథి శతజయంతి ప్రారంభం)

గురువే దైవం

అయిదవ వేదంగా ప్రసిద్ధికెక్కిన మహాభారతాన్ని, 18 మహా పురాణాలను, 545 బ్రహ్మసూత్రాలను రచించి వేద విభాగాన్ని చేసిన వేదవ్యాస మహర్షి 'ఆషాఢ పౌర్ణమి' నాడు జన్మించాడు. జ్ఞాన సముద్రంగా పేర్కొనదగిన విస్తారమైన వాఙ్మయాన్ని అందించిన వ్యాస మహర్షి జన్మదినాన్ని 'గురు పౌర్ణమి'గా ఆచరించే సంప్రదాయాన్ని మన పూర్వీకులు ఏర్పాటు చేశారు.

అజ్ఞానమనే అంధకారంలో ఉన్న వారి కళ్లను వేద విజ్ఞానమనే కాటుక పుల్లతో తెరిపించిన గురువుకు నమస్కారం అని పేర్కొనే– **'అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా / చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః॥'** అనే గురువందన శ్లోకం అన్నివిధాలుగా వేదవ్యాస మహర్షికి వర్తించేదే! సృష్టికర్తయైన బ్రహ్మదేవుని వలె శిష్యులలో కొంగ్రొత్తగా ఆలోచనలను, ఆశయాలను చిగురింపజేస్తూ, విష్ణుమూర్తివలె శిష్యులలోని అజ్ఞానమును నశింపజేస్తూ త్రిమూర్తులను తలపించే పరబ్రహ్మ స్వరూపుడైన గురువుకు కృతజ్ఞతాపూర్వకంగా త్రికరణ శుద్ధితో



'గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః॥'

అంటూ గురువుకు నమస్కరించడమే శిష్యులు చేయగలిగిన కార్యం. గు అనే అక్షరానికి అంధకారమని అర్థమైతే, రు అనే శబ్దానికి నిరోధించువాడు అని అర్థం. గురు శబ్దం విజ్ఞానదాతలైన వాల్మీకి వ్యాసాది మహర్షులు మొదలుకొని పూర్వులైన ఆచార్యులతోపాటు వర్తమాన కాలంలో మనల్ని జ్ఞానమార్గంలో నడిపించే అధ్యాపక బృందానికి కూడా వర్తిస్తుంది.

గురువులు తమ దగ్గర ఉండే విద్యా సంపద, శక్తియుక్తులన్నింటినీ శ్రద్ధాసక్తులు, వినయ విధేయతలు కలిగిన సద్గుణవంతులైన శిష్యులకు ధారపోస్తారు. తమ రక్త సంబంధీకులైన కుటుంబ సభ్యులపై కన్న తమ విజ్ఞానానికి వారసులైన శిష్యులపైననే అమితంగా, అధికంగా ఆదరాభిమానాలను కలిగి ఉంటారు. తమ శిష్యులు తమను మించిన విజ్ఞానవంతులు కావాలని శిష్యుల చేతుల్లో తాము ఓటమిని పొందేంతగా శిష్యుల అభివృద్ధిని (శిష్యాదిచ్ఛేత్ పరాజయమ్) ఆకాంక్షిస్తారు.

గురుశిష్యులు ప్రతిరోజూ పాఠ ప్రవచనానికి ముందుగా తమ విద్యా వ్యాసంగం తేజోవంతమై, శక్తిమంతమై విరాజిల్లాలని; తమలో (గురుశిష్యులలో) ఎటువంటి ద్వేషభావనలూ ఏర్పడకుండా చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడేటట్లుగా, శాశ్వతంగా నిలిచిపోయేటట్లుగా ఉండాలని శాంతి పాఠం ప్రార్థించే విధానం మన ప్రాచీన విద్యా విధానంలో గురుకుల పద్ధతిలో ఉండేది. తల్లి తండ్రులిచ్చిన జన్మకు సార్థక్యాన్ని కలిగిస్తూ విలువైన జ్ఞాన జన్మను ప్రసాదించే గురువుకు, వారు చేసిన మహోపకారానికి జిజ్ఞాసువులైన, శ్రద్ధావంతులైన శిష్యులు ప్రత్యుపకారాన్ని చేయలేరు. అవతార పురుషులైన శ్రీరామ చంద్రమూర్తి, శ్రీకృష్ణుడు వంటివారు కూడా వశిష్ఠ, విశ్వామిత్ర, సాందీపని మహర్షి వంటి గురువుల నుండి విద్యా రహస్యాలను పొందినవారే. విద్యా రంగంలోనే కాక ఇతర రంగాలలోనూ నైపుణ్యం, అనుభవం కలవారి చేతికి చిక్కి, వారిచే చెక్కబడిన శిల్పాల్లా రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కీర్తి ప్రతిష్ఠలను పొందే ప్రతి ఒక్కరూ... తమను ఆ స్థాయికి తీసుకువచ్చిన గురువులకు ఋణపడే ఉంటారనేది ముమ్మాటికీ వాస్తవమే. జ్ఞానధనులు, త్యాగమూర్తులైన గురువుల ఆశీస్సులతో మన ఆశయాలను నెరవేర్చుకుందాం.

– సముద్రాల శఠగోపాచార్యులు

(నేడు గురుపౌర్ణమి)

క్లుప్తంగా...

నిమ్స్‌లో ప్రజా గాయకుడు జయరాజుకు వైద్యం



లక్డీకాపూల్ (హైదరాబాద్): ప్రముఖ కవి, పాటల రచయిత, గాయకుడు గొడిశాల జయరాజు గుండెపోటుకు గురయ్యారు. దీంతో శనివారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులు నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం జయరాజు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప పర్యవేక్షణలో వైద్యసేవలను పొందుతున్నారు. ఆయనకు మెట్టు రంగారెడ్డి బ్లాక్‌లోని ప్రత్యేక రూమ్‌ను కేటాయించారు. ప్రజల్లో తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ భావజాలాన్ని రగిలింపచేసిన ప్రజాకవి జయరాజు త్వరగా కోలుకుని తిరిగి రావాలని ప్రకృతి దేవతలను వేడుకుంటున్నామని గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు, అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి యాదగిరి తెలిపారు.

సమ్మక్క పూజారి ముత్తయ్య మృతి

- సంతాపం తెలిపిన మంత్రి సీతక్క



ముత్తయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి చెందిన సమ్మక్క పూజారి (వడ్డె) మల్లెల ముత్తయ్య (50) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొద్దిరోజులు గా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరి స్థితి విషమించడంతో చనిపోయారు. సమ్మక్క జాతరలో చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చే సమయంలో జలకం వడ్డెగా ముత్తయ్య ప్రధానపాత్ర పోషించేవారు. ఈయన సుమారుగా 1994 నుంచి జలకం వడ్డెగా కొనసాగుతున్నారు. ఆయన మృతిపట్ల పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సమ్మక్క సారలమ్మ పూజారులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య నాగమణి, కుమారుడు సాయిచరణ్, కుమార్తె సాయిప్రసన్న ఉన్నారు. కాగా, ముత్తయ్య మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు రాష్ట్ర మంత్రి సీతక్క ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మరణం సమ్మక్క భక్తులకు తీరని లోటన్నారు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపారు.

కస్టడీలోకి యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు

- ఆరు గంటలకుపైగా ప్రశ్నించిన టీజీ సైబర్ సెక్యూరిటీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: తండ్రీ, కూతురు వీడియోపై ఆన్‌లైన్ చర్చలో అసభ్యకరమైన కామెంట్లు చేయడంతోపాటు గంజాయి తీసుకున్న కేసులో అరెస్టయిన యూట్యూబర్ ప్రణీత్ హన్మంతుని టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు శనివారం కస్టడీకి తీసుకున్నారు. నాంపల్లి కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. తొలి రోజైన శనివారం ఉదయం 10 గంటలకు చంచల్‌గూడ జైలు నుంచి ప్రణీత్ హన్మంత్‌ని తమ కస్టడీకి తీసుకున్న అధికారులు సాయంత్రం 4.30 గంటల వరకు ప్రశ్నించినట్టు తెలిసింది. యూట్యూబ్‌లో అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేయడంతోపాటు గతంలో చేసిన వీడియోలు, ఇతర వృత్తిపరమైన అంశాలపై హన్మంతును ప్రశ్నించినట్టు తెలిసింది. తండ్రీ కూతురు వీడియోపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన అసభ్యకర చర్చలో పాల్గొన్న మిగిలిన వారి గురించి సైతం టీజీసీఎస్‌బీ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. మిగిలిన వారితో పరిచయం, వారి సోషల్ మీడియా ఖాతాలు తదితర అంశాలపై హన్మంతును అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది.

పెనంపై నుంచి పొయ్యిలోకి..!

- కాంగ్రెస్ పాలనలోనూ మారని ప్రజల బతుకులు
- నిరుద్యోగులకు ఎన్నో హామీలిచ్చి మోసం చేశారు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం
- బీజేవైఎం ఆధ్వర్యంలో నిరుద్యోగ మహాధర్నా



ధర్నాలో కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో ప్రజల బతుకులు పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లుగా మారాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మార్పు కోసం కాంగ్రెస్ అన్నారు కానీ, వీరి పాలనలో తెలంగాణ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. 'గులాబీ జెండా పోయి.. చేయిగుర్తు జెండా వచ్చింది. కేసీఆర్ దోపిడీ పోయి.. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి దోపిడీ వచ్చింది..'అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. అధికార దుర్వినియోగం, పార్టీ ఫిరాయింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో...గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని, నిరుద్యోగులకు రూ.4 వేల చొప్పున భృతి ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఇందిరా పార్క్ సమీపంలోని ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ యువత న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కేంద్రమంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగులకు అనేక రకాల హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని మండిపడ్డారు. ఓయూ విద్యార్థులు, నిరుద్యోగులను అవమానపర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న, మోసపోయిన విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలకు బీజేపీ అండగా ఉంటుందని చెప్పారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

గ్యారంటీలే గుదిబండలు

సెక్రటేరియట్‌లోకి కాంగ్రెస్ నాయకులు, పైరవీకారులకు ఎంట్రీ ఉంది కాని, నిరుద్యోగ యువకులను వెళ్లనివ్వడం లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. కర్ణాటకలోని సిద్దరామయ్య, తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు అతి తక్కువ కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నాయని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ ఏమైందని నిలదీశారు. గత ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వలేదని, రేవంత్ ప్రభుత్వం కూడా దానిని అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ఇచ్చిన గ్యారంటీలే కాంగ్రెస్‌కు గుదిబండలుగా మారతాయని, కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

యువతను దూరం చేసుకుంటే అధోగతే: ఈటల

కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క మాటనూ నిలబెట్టుకోలేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. అధికారం ఉందని పోలీసులను నమ్ముకుని యువతను దూరం చేసుకుంటే అధోగతి పాలవుతారని హెచ్చరించారు. రాష్ట్ర మంత్రులు ఎక్కడికక్కడ కౌంటర్లు ఏర్పాటు చేసుకుని పాలన నడిపిస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మరింత అన్యాయం జరుగుతోందని అన్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా యువమోర్చా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ధర్నాకు తరలివచ్చారు.

ఒక 'క్లౌడ్'ను నమ్ముకుంటే ఇంతే..

▶ మొదటి పేజీ తరువాయి

సెక్యూరిటీలో ఒక అప్‌డేట్ సందర్భంగా తలెత్తిన సమస్యతో ప్రపంచవ్యాప్తంగా విమాన, బ్యాంకింగ్, స్టాక్ ఎక్స్ఛేంజ్, వైద్యం వంటి పలు రంగాల్లో సేవలకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు ఐటీ కంపెనీలు దీనిపైనే దృష్టి పెట్టాయి. డేటా బ్యాకప్ కోసం క్లౌడ్ సర్వీసులపై ఆధారపడితే వాటిల్లో అజూర్ లాగా సమస్య తలెత్తితే సాధారణ సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారిస్తున్నాయి.

ఒక క్లౌడ్‌పైనే ఆధారపడొద్దు

ఐటీ కంపెనీలు డేటా బ్యాకప్ కోసం కేవలం ఒక క్లౌడ్ సర్వీసుపైనే ఆధారపడకుండా అత్యవసర సమయాల కోసం మరో క్లౌడ్ సర్వీసు కూడా ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ అజూర్ కాకుండా పదికి పైగా ప్రముఖ క్లౌడ్ సర్వీసు సంస్థలు అందుబాటులో ఉన్నాయి. అమెజాన్ ప్రైమ్ వెబ్ సర్వీసెస్, గ్లూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫాంలతో పాటు ఐబీఎం, ఒరాకిల్, ఆలీబాబా, డిజిటల్ ఓషన్, వీఎంవేర్, రెడ్‌హాట్ వంటి అనేక క్లౌడ్ సర్వీసులు ఉన్నాయి. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అత్యంత చౌకగా క్లౌడ్ సర్వీసులు అందించే కోర్‌వేవ్ వంటి సంస్థలు కూడా మార్కెట్లోకి వస్తున్నాయి. ఇదే సమయంలో ఐటీ సంస్థలు కేవలం మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ వంటి ఒక ఐటీ వెండర్‌పైనే ఆధారపడకుండా ఇతర ఆపరేటింగ్ సిస్టమ్స్‌పైనా సేవలంగించడానికి సిద్ధంగా ఉండాలని ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ప్రొఫెసర్ ఓకు ఇస్క్ చెబుతున్నారు. మైక్రోసాఫ్ట్‌తో పాటు మ్యాక్, లీనక్స్ వంటి ఐటీ వెండర్స్‌నూ వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సంక్షోభానికి ప్రధాన కారణమైన మైక్రోసాఫ్ట్‌కు సైబర్ సెక్యూరిటీ అందిస్తున్న క్రౌడ్‌స్ట్రైక్ చేసిన ప్రకటన దీనికి ఊతమిస్తోంది. సైబర్ సెక్యూరిటీలో అప్‌గ్రేడేషన్ సందర్భంగా తలెత్తిన సంక్షోభం కేవలం విండోస్‌కే పరిమితమైందని ఆ ప్రకటన తెలిపింది. మ్యాక్, లీనక్స్ వంటి వాటిపై ఈ ప్రభావం లేదని క్రౌడ్‌స్ట్రైక్ పేర్కొంది. అందువల్ల ఐటీ, ఇతర సంస్థలు ప్రత్యామ్నాయాలనూ అందుబాటులో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది.

తప్పించుకున్న రష్యా

మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడేషన్‌లో తలెత్తిన సమస్యలతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పలు సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రష్యాలో మాత్రం ఆ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. దీనికి ప్రధాన కారణం ఇతర దేశాలపై రష్యా దాడులు. ఈ యుద్ధం కారణంగా అమెరికాకు చెందిన పలు సంస్థలు రష్యాకు తమ ఉత్పత్తుల విక్రయాలపై నిషేధం విధించాయి. అందుకే మైక్రోసాఫ్ట్ సంస్థ కొన్ని సంవత్సరాలు రష్యాకు ఎటువంటి సహకారం అందించలేదు. ఈ సంక్షోభానికి ప్రధాన కారణమైన అమెరికాకు చెందిన క్రౌడ్ స్ట్రైక్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఇంత వరకు రష్యాలో అడుగే పెట్టలేదు. దీంతో రష్యా సొంత సాఫ్ట్‌వేర్ పైనే ఆధారపడుతోంది. కాస్పర్‌స్కై వంటి స్వదేశానికి చెందిన సైబర్ సెక్యూరిటీ సేవలనే వినియోగించుకుంటోంది. మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడేషన్‌తో తలెత్తిన సంక్షోభం తమ దేశంలో ఎక్కడా కనిపించలేదని రష్యా ప్రకటించింది.

24 విమానాలు రద్దు

శంషాబాద్ (హైదరాబాద్): మైక్రోసాఫ్ట్ విండోస్ సమస్య కారణంగా శనివారం కూడా దేశీయంగా పలు విమానాలు రద్దయ్యాయి. శంషాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, గోవా, కొచ్చిన్, ముంబయి, ఢిల్లీ, కోల్‌కతాతో పాటు వివిధ నగరాలకు చెందిన మొత్తం 24 విమానాలు రద్దయినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సరైన సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల చెక్‌ఇన్, బోర్డింగ్ పాస్‌ల జారీ పునరుద్ధరణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఈ ప్రక్రియలు నెమ్మదిగా సాగుతున్నాయి. పలు విమానాలు నిర్దిష్ట సమయం కన్నా ఆలస్యంగా రాకపోకలు సాగించాయి.

ప్రాణాలకు తెగించి వైద్యం



వాగు దాటుతున్న ఏఎన్ఎం విజయసుందరి

ఇంద్రవెల్లి: ఉప్పొంగుతున్న వాగును ప్రాణాలకు తెగించి మరీ దాటి వైద్యసిబ్బంది సేవలందించారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం వడగామ్ పంచాయతీ పరిధిలోని జైత్రంతండా గ్రామానికి వెళ్లేందుకు వైద్య సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. వాల్గొండ ఆరోగ్య ఉప కేంద్రం సెకండ్ ఏఎన్ఎం విజయసుందరి, ఆశవర్కర్ ఆత్రం అనసూయ శనివారం గ్రామానికి బయల్దేరారు. అదే సమయంలో కురుస్తున్న వర్షానికి మార్గమధ్యలో ఉన్న వాగు ఉప్పొంగింది. కాగా, వారు ప్రాణాలకు తెగించి వాగు దాటి గ్రామానికి చేరుకున్నారు. చిన్నారులకు ఇమ్యునైజేషన్ టీకాలు అందించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అన్నారం బరాజ్ పరిశీలన

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతీ) బరాజ్‌ను సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు చెందిన ఏడీసీపీ(అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్ మెథడ్)సర్వే టీమ్ శనివారం పరిశీలించింది. బరాజ్‌లోని నీటి ప్రవాహాల వేగం, దిశ, ధ్వని తరంగాలు, నీటి భౌతిక, రసాయనిక లక్షణాలపై సర్వే చేసినట్లు తెలిసింది. ఈ బృందంలో ఈఈ యాదగిరి, డీఈఈ రవిచంద్ర, సూర్యప్రకాశ్, కిరణ్ తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో సివిల్స్ ర్యాంకర్లు. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, పొంగులేటి, కోమటిరెడ్డి, తుమ్మల, సీతక్క, సీఎస్ శాంతికుమారి తదితరులు

యాదాద్రిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



జస్టిస్ మౌషుమి భట్టాచార్యకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్య తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయ అర్చకులు ఆమెకు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభును దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజలు నిర్వహించారు. జస్టిస్ మౌషుమి భట్టాచార్యకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమలలో ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ సుధ

తిరుమల: తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ సుధ శనివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సత్వర న్యాయసేవలు అందేలా కృషి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి



అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి

గద్వాల క్రైం: న్యాయసేవల కోసం నిరీక్షిస్తున్న కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి చెప్పారు. శనివారం నారాయణపేట జిల్లాకేంద్రంలో న్యాయ సమీక్ష చేపట్టిన అనంతరం న్యాయమూర్తి గద్వాలలోని కేఎల్ఐ క్యాంపు ఆవరణలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థపై ప్రజలకు, కక్షిదారులకు నమ్మకం కలిగేలా కోర్టులను ఏర్పాటు చేశామన్నారు. కేసులు సులువుగా పరిష్కారమయ్యేందుకు రాజ్యాంగం కోర్టు వ్యవస్థను అమలు చేసిందన్నారు. విపత్కర కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు నిరుత్సాహం, ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. అనంతరం గద్వాల జిల్లా కోర్టును సందర్శించి జడ్జీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాగా, జస్టిస్ శ్రీదేవికి జిల్లా జడ్జి కె.కుష, గద్వాల కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సభ్యుడు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

గొంతులోంచి తలలోకి దూసుకెళ్లి..

- ప్రమాదవశాత్తు తుపాకీ పేలి సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి
- మృతుడిది ఏపీ రాష్ట్రం నంద్యాల జిల్లా



వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు తుపాకి పేలి సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటనను సంగారెడ్డి జిల్లా బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని నంద్యాల జిల్లాలో అరుకు మండలం జునుతల గ్రామానికి చెందిన పెట్నికోట వెంకటేశ్వర్లు (32) 2012 లో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా చేరాడు. ఏడాదిన్నర క్రితం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్ టౌన్ షిప్‌కు బదిలీపై వచ్చాడు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు సాయి (9), కుమార్తె సాయిపల్లవి(8) ఉన్నారు. శుక్రవారం రాత్రి వెంకటేశ్వర్లు నైట్ డ్యూటీకి వెళ్లాడు. తిరిగి శనివారం తెల్లవారు జామున 5:45 గంటలకు బీడీఎల్ పరిశ్రమ సమీపంలోని వాచ్‌టవర్ నంబర్ 4 వద్ద డ్యూటీ ముగించుకుని, సీఐఎస్ఎఫ్ యూనిట్ లైన్ బ్యారెజీ సమీపంలో బస్సు దిగే క్రమంలో అతని వద్ద ఉన్న తుపాకీ ప్రమాదవశాత్తు పేలిపోయింది. వెంకటేశ్వర్లు గొంతు భాగం నుంచి తలపైకి బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే చికిత్స కోసం బీడీఎల్ టౌన్ షిప్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

రాజ్యాంగ ఉల్లంఘనపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో సుమారు అరగంటసేపు భేటీ అయ్యారు. నిరుద్యోగుల సమస్యలు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు, ప్రొటోకాల్ ఉల్లంఘనపై గవర్నర్‌కు వినతిపత్రాలు సమర్పించి, అందులోని అంశాలను కేటీఆర్, హరీశ్‌రావు గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్‌తో భేటీ వివరాలను కేటీఆర్ మీడియాకు వెల్లడించారు.

'రాష్ట్రంలో రాజ్యాంగ హననం జరుగుతున్న తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నట్లు గవర్నర్‌కు వివరించాం. పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఓ వైపు న్యాయ పోరాటం చేస్తున్నాం. మరోవైపు స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశామనే విషయాన్ని గవర్నర్‌కు వివరించాం. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్సీలు, పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోచేరినా వారిపై చర్యలు లేవనే విషయాన్ని ప్రస్తావించాం. ప్రొటోకాల్ ఉల్లంఘనతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి చెప్పాం. ఎమ్మెల్యేల హక్కులకు భంగం వాటిల్లడం సరికాదనే అభిప్రాయం గవర్నర్ వ్యక్తంచేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వివరణ కోరుతూ లేఖ రాస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. విపక్ష పార్టీగా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తనను కలవాలని గవర్నర్ చెప్పారు. తన పరిధిలో ఉన్న అంశాల్లో తప్పనిసరిగా న్యాయం చేస్తానన్నారు. నిరుద్యోగుల విషయంలో గవర్నర్ సీరియస్‌గా స్పందించిన తీరుకు అభినందనలు'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

గవర్నర్ సీరియస్‌గా స్పందించారు

'రాష్ట్రంలో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీల ఉల్లంఘనను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ఇస్తామనే హామీని నిలబెట్టుకోలేదు. సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఉస్మానియా వర్సిటీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి, కేసులతో భయానక వాతావరణం నెలకొంది. ఈ అంశంపై హోం శాఖ కార్యదర్శిని పిలిచి మాట్లాడతానని గవర్నర్ హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరేంత వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది'అని కేటీఆర్ చెప్పారు. 'మేడిగడ్డ ప్రాజెక్టు కొట్టుకుపోయి కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు గంగపాలైందని భూతద్దంలో చూపుతూ చిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవాలి. కొద్దిరోజుల్లోనే మరమ్మతులు పూర్తయి ప్రస్తుతం మేడిగడ్డ నిండుకుండను తలపిస్తోంది. త్వరలో మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి ప్రజలకు వాస్తవాలు వివరిస్తాం'అని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యోగ పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు వందల కోట్ల రూపాయల లాభం వస్తుందని సీఎం రేవంత్ చెప్పారని, ఇప్పుడు నాలుగు నెలలపాటు వాయిదా వేసిన నేపథ్యంలో ఆయనకు అందులో వాటా ఎంత వస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు.

చేసింది చెప్పుకోవడంలోనే ఉంది: గవర్నర్

ప్రస్తుత రాజకీయాల్లో చేసింది చెప్పుకోలేక పోవడంతో ప్రతికూల ఫలితాలు వస్తున్నాయని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బీఆర్ఎస్ బృందంతో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. గతంలో తమిళనాడులో కామరాజ్ నాడార్ ప్రభుత్వం అనేక మంచి పనులు చేసినా.. చేసింది చెప్పుకోలేక ఓటమి పాలైన విషయాన్ని గవర్నర్ ప్రస్తావించినట్లు తెలిసింది. రాజకీయాలన్నీ దీని పైనే ఆధారపడి ఉన్నాయని, పార్టీ ఫిరాయింపులు సహా ప్రజలు అన్ని అంశాలను గమనిస్తారని చెప్పినట్లు సమాచారం. యాదాద్రి ఆలయాన్ని కేసీఆర్ అద్భుతంగా నిర్మించారని కితాబునిచ్చినట్లు తెలిసింది. గవర్నర్‌తో భేటీలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో జాబ్ కేలండర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రక్రియ పూర్తి చేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. శనివారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రం నుంచి ఏటా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు ఎంపికయ్యే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల్లో అర్హులకు సింగరేణి సంస్థ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తుంది. అభ్యర్థులు సింగరేణి సంస్థ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రారంభ కార్యక్రమంలో 2023 సివిల్స్ విజేతలు, 2024లో మెయిన్స్ రాసే అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

నిరుద్యోగుల బాధ నా కళ్లతో చూశా..

'రాష్ట్రంలో నిరుద్యోగ యువకుల సమస్యలను పరిష్కరించడమే మా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత. మా ప్రభుత్వం బాధ్యతలను స్వీకరించిన తర్వాత 90 రోజుల్లోగా 30 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసింది. దీనిని బట్టి మా ప్రభుత్వ ప్రాధాన్యతను నిరుద్యోగ యువత అర్థం చేసుకోవాలి. తెలంగాణ ఏర్పడిన పదేళ్లలో ఏ నోటిఫికేషన్ పరీక్షలు కూడా నిర్దేశిత సమయానికి జరగలేదు. ఉజ్వల భవిష్యత్తు ఆలోచనలతో యువత అమీర్‌పేట్, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లలోని కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటుంటే సంవత్సరాల తరబడి పరీక్షలు వాయిదా పడ్డాయి. తీరా పరీక్షలు జరిగి ఫలితాలు వచ్చేసరికి ప్రశ్నపత్రాల లీకు వ్యవహారంతో నిరుద్యోగులు పడిన బాధ, భావోద్వేగాన్ని నా కళ్లతో చూశా. దీంతో యూపీఎస్సీ చైర్మన్‌ను కలిసి దాని తరహాలో టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాం. యూపీఎస్సీ తరహాలో వెనువెంటనే నోటిఫికేషన్లు ఇచ్చాం. గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను విజయవంతంగా నిర్వహించాం. గ్రూప్–2 పరీక్షలు గ్రూప్–3తో కలిపి నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేసి సామాజిక న్యాయాన్ని పాటిస్తాం. మా ప్రభుత్వ హయాంలో పరీక్షలు నిర్వహించిన ఏ సంస్థపైనా ఎలాంటి ఆరోపణలూ రాలేదు. నిరుద్యోగ అభ్యర్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధిస్తే ప్రభుత్వం వారిని వ్యక్తిగతంగా కలుస్తుందని, వెన్నుతట్టి ప్రోత్సహిస్తుందనే సందేశం ఇవ్వడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించాం. నిరుద్యోగ యువతలో నమ్మకం, విశ్వాసం కల్పించడం మా బాధ్యత..'అని సీఎం పేర్కొన్నారు.


కేంద్ర కొలువులపైనా దృష్టి పెట్టాలి

'నిరుద్యోగ అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగాలు, సివిల్స్, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ వంటి వాటిపై సైతం దృష్టి సారించాలి. సివిల్స్‌లో టాప్ ర్యాంక్ సాధించి తెలంగాణ కేడర్‌ను తీసుకుని రాష్ట్ర ప్రజలకు సేవలు చేయాలి. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అఖిల భారత సర్వీసు పోస్టుల్లో తెలంగాణ యువత ఎక్కువగా అవకాశాలను అందిపుచ్చుకోవాలి. రాష్ట్రానికి నిధులు, ఇతర ప్రయోజనాల కోసం కేంద్రంతో సంప్రదింపులు జరిపేటప్పుడు అక్కడ తెలంగాణ అధికారులు ఉంటే చాలా ఉపయోగకరంగా ఉంటుంది..' అని రేవంత్ చెప్పారు.

అభ్యర్థులకు ఆర్థిక తోడ్పాటే లక్ష్యం: భట్టి

సివిల్స్ తరహా పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడం వ్యయ ప్రయాసలతో కూడిన అంశమని, సీఎం రేవంత్ చొరవతో.. అలాంటి పరీక్షలు రాసే అభ్యర్థులకు ఆర్థిక తోడ్పాటును అందించడం కోసమే ఈ పథకాన్ని ప్రారంభించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సింగరేణి తరఫున దీనిని చేపట్టడం అభినందనీయమన్నారు. 2023లో రాష్ట్రం నుండి సివిల్స్‌కు ఎంపికైన 35 మంది అభ్యర్థులను, ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన ఆరుగురిని ఈ సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్ రావు, సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జెండా రెపరెపల వెనుక...



అది 1969. జూలై 20. అంతరిక్ష రేసులో యూఎస్ఎస్ఆర్‌పై అమెరికా తిరుగులేని ఆధిక్యం సాధించిన రోజు. అంతేకాదు. అందరాని చందమామను మానవాళి సగర్వంగా అందుకున్న రోజు కూడా. టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న లక్షలాది మంది సాక్షిగా నాసా అపోలో 11 మిషన్ విజయవంతంగా చంద్రునిపై దిగింది. కాసేపటికి వ్యోమగామి నీల్‌ఆర్మ్ స్ట్రాంగ్ చంద్రుని ఉపరితలంపై కాలుపెట్టాడు. ఆ ఘనత సాధించిన తొలి మానవునిగా చరిత్ర పుటల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. ఎడ్విన్ ఆల్డ్రిన్‌తో కలిసి చంద్రుని నమూనాలు సేకరిస్తూ ఉపరితలంపై కొద్ది గంటలు గడిపాడు. మానవాళి ప్రస్థానంలో చిరస్థాయిగా మిగిలిపోనున్న ఆ మైలురాయికి గుర్తుగా అమెరికా జెండాను సగర్వంగా చంద్రునిపై పాతాడు. అయితే ఈ చర్య పెద్ద గందరగోళానికే దారి తీసింది. నాసా విడుదల చేసిన ఫొటోల్లో ఆ జెండా రెపరెపలాడుతూ కన్పించడం నానా అనుమానాలకు తావిచ్చింది. అసలు భూమిపై మాదిరిగా వాతావరణం, గాలి ఆనవాలు కూడా లేని చంద్రుని ఉపరితలంపై జెండా ఎలా ఎగిరిందంటూ సర్వత్రా ప్రశ్నలు తలెత్తాయి. చివరికి పరిస్థితి అపోలో 11 మిషన్ చంద్రునిపై దిగడం శుద్ధ అబద్ధమనేదాకా వెళ్లింది! అంతరిక్ష రంగంలో దూకుడు ప్రదర్శిస్తున్న యూఎస్ఎస్ఆర్ మీద ఎలాగైనా పైచేయి సాధించేందుకు నాసా ఇలా కట్టుకథ అల్లి ఉంటుందంటూ చాలామంది పెదవి విరిచారు కూడా...

కానీ, ఆ జెండా రెపరెపల వెనక నాసా కృషి, అంతకుమించి సైన్స్ దాగున్నాయి. చూసేందుకు అచ్చం గాలికి రెపరెపలాడుతున్నట్టు కన్పించే అమెరికా జాతీయ జెండాను ఎలాగైనా చంద్రునిపై పాతాలన్నది నాసా పట్టుదల. నాసా సాంకేతిక సేవల విభాగం చీఫ్ జాక్ కింజ్లర్ ఈ సవాలును స్వీకరించారు. ఆయన ఆధ్వర్యంలో సైంటిస్టులు ఎంతగానో శ్రమించి మరీ ఆ జెండాను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. జెండా పై భాగం పొడవునా ఒక క్రాస్‌బార్ అమర్చారు. దానికి జెండాను అక్కడక్కడా ప్రెస్ చేశారు. తద్వారా జెండా పలుచోట్ల వంపు తిరిగినట్టు కన్పించేలా చేశారు. ఫలితంగా చూసేందుకది అచ్చం గాలికి రెపరెపలాడుతున్నట్టుగా కన్పించింది. నాసా ఉద్దేశమూ నెరవేరింది. అదే క్రమంలో వివాదాలకూ తావిచ్చింది. జెండా తయారీలో పలు అంశాలను దృష్టిలో పెట్టుకున్నారు. జెండా కర్రను కూడా అతి తేలికగా, అదే సమయంలో అత్యంత తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో కూడా అత్యంత మన్నికగా ఉండే అనోడైజ్డ్ అల్యుమినియంతో తయారు చేశారు. చంద్రుని నేలపై తేలిగ్గా దిగేందుకు, కిందకు వాలకుండా నిటారుగా ఉండేందుకు వీలుగా దాని మొదట్లో చిన్న స్ప్రింగ్‌ను అమర్చారు. ఇక జెండాను కూడా చంద్రునిపై తీవ్రమైన ఉష్ణోగ్రత తదితరాలను తట్టుకునేందుకు వీలుగా నైలాన్ బట్టతో తయారు చేశారు. అనంతరం పలు అపోలో మిషన్లలో కూడా ఇదే తరహా జెండాలను చంద్రునిపైకి పంపారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



మృత్యుంజయుడు!

బాంబు దాడులకు నిండు గర్భిణి బలి
- కడుపులోని చిన్నారి మాత్రం సజీవంగానే
- సిజేరియన్ చేసి కాపాడిన వైద్యులు
- అద్భుతానికి వేదికైన గాజా

డెయిర్ అల్ బలా: మాటలకందని గాజా విషాదం కొన్ని అవాంఛిత అద్భుతాలకూ వేదికగా మారుతోంది. సెంట్రల్ గాజాలోని నజరేత్ సమీపంలో హమాస్ అధీనంలో ఉన్న ప్రాంతాలపై శనివారం రాత్రి ఇజ్రాయెల్ భారీగా దాడుల్లో 24 మంది దుర్మరణం పాలయ్యారు. వారిలో ఓలా అద్నాన్ హర్బ్ అల్‌కుర్ద్ అనే 9 నెలల నిండు గర్భిణి కుటుంబమూ ఉంది. ఆ ఇంట్లో ఆరుగురు దాడికి బలవగా ఆమె తీవ్రంగా గాయపడింది. దాంతో హుటాహుటిన అల్ అవ్దా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినా గాయాల తీవ్రతకు తాళలేక అద్నాన్ కన్నుమూసింది. కానీ కడుపులోని బిడ్డ మాత్రం బతికే ఉన్నట్టు వైద్యులకు అనుమానం వచ్చింది. అల్ట్రా సౌండ్ చేసి చూడగా చిన్నారి గుండె కొట్టుకుంటున్నట్టు తేలింది. దాంతో హుటాహుటిన సిజేరియన్ చేశారు. పండంటి మగ బిడ్డను విజయవంతంగా కాపాడారు. మృత్యుంజయునిగా నిలిచిన అతనికి మలేక్ యాసిన్ అని పేరు పెట్టినట్టు సర్జన్ అక్రం హుసేన్ తెలిపారు. చిన్నారి శ్వాస తీసుకోవడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతుండటంతో ఆక్సిజన్ అందించారు. పరిస్థితి కాస్త మెరుగు పడగానే ఇంక్యుబేటర్‌లో ఉంచి హుటాహుటిన డెయిర్ అల్ బలాలోని అల్ అక్సా ఆస్పత్రికి తరలించారు.

2020లో భారత్‌లో కరోనాతో...
11లక్షల అధిక మరణాలు
- అంతర్జాతీయ అధ్యయనం వెల్లడి
- తీవ్రంగా ఖండించిన కేంద్రం

న్యూఢిల్లీ: కరోనా వల్ల 2020లో భారత్‌లో కేంద్రం చెప్పిన వాటికంటే ఏకంగా 11.9 లక్షల అధిక మరణాలు సంభవించినట్టు అంతర్జాతీయ అధ్యయనం ఒకటి పేర్కొంది. ఇది భారత్ అధికారిక గణాంకాల కంటే 8 రెట్లు, డబ్ల్యూహెచ్‌ఓ అంచనాల కంటే ఒకటిన్నర రెట్లు అధికం! 2019తో పోలిస్తే ఈ మరణాలు 17 శాతం అధికమని అధ్యయనం పేర్కొంది. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్, మరికొన్ని విశ్వవిద్యాలయాల పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. ఇందుకు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 గణాంకాలను పరిగణనలోకి తీసుకున్నారు. 2019 నుంచి 2020 దాకా దేశవ్యాప్తంగా లక్షలాది మంది కరోనా బాధితుల డేటాను సైతం పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా సంభవించిన కోవిడ్–19 సంబంధిత మరణాల్లో మూడింట ఒక వంతు మరణాలు ఇండియాలోనే చోటుచేసుకున్నాయని వెల్లడించారు. కోవిడ్–19 ప్రభావం వల్ల ప్రజల సగటు ఆయుర్దాయం 2.6 ఏళ్లు తగ్గినట్లు తెలిపారు. మహిళల ఆయుర్దాయం 3.1 ఏళ్లు, పురుషుల ఆయుర్దాయం 2.1 ఏళ్లు తగ్గినట్లు గుర్తించారు. అధ్యయనం వివరాలను 'సైన్స్ అడ్వాన్సెస్' పత్రికలో ప్రచురించారు.

అవన్నీ కరోనా మరణాలు కాదు

అధ్యయనం గణాంకాలపై కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అధ్యయనం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని ఆక్షేపించింది. ఈ గణాంకాల్లో వాస్తవం లేదని, అవన్నీ కరోనా మరణాలు కావని పేర్కొంది.

యూపీఎస్సీ ఛైర్మన్
మనోజ్ సోనీ రాజీనామా

15 రోజుల క్రితమే రాజీనామా చేసినా ఇంకా ఆమోదించని రాష్ట్రపతి



సాక్షి, న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఛైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మరో ఐదేళ్ల పదవీ కాలం ఉండగానే అనూహ్యంగా రాజీనామా చేయడం గమనార్హం. ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేడ్కర్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో ఆయన రాజీనామా చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పూజా ఖేడ్కర్ వ్యవహారానికి, మనోజ్ సోనీ రాజీనామాకు సంబంధం లేదంటూ అధికారిక వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత కారణాల వల్లే ఆయన పదవి నుంచి తప్పుకున్నారని తెలియజేశాయి. మనోజ్ సోనీ పదిహేను రోజుల క్రితమే తన రాజీనామా లేఖను రాష్ట్రపతి కార్యాలయానికి పంపినట్లు సమాచారం. అయితే శనివారం సాయంత్రం వరకు కూడా ఈ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించలేదు. 2029 మే 15 వరకు మనోజ్ సోనీ పదవీకాలం ఉంది. ఆయన గతంలో బరోడా మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయం వీసీగా పనిచేశారు. గుజరాత్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రెండు పర్యాయాలు వరుసగా వీసీగా సేవలందించారు. 2017 జూన్ 28న యూపీఎస్సీ సభ్యుడిగా నియమితులయ్యారు. గత ఏడాది మే 16న యూపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

రహస్యం ఎందుకు?: ఖర్గే

మనోజ్ సోనీ 15 రోజుల క్రితమే రాజీనామా చేస్తే ఇప్పటిదాకా ఎందుకు రహస్యంగా ఉంచారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. యూపీఎస్సీలో జరిగిన కుంభకోణాలకు, ఈ రాజీనామాకు మధ్య సంబంధం ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ నుంచి మనోజ్ సోనీని తీసుకొచ్చి యూపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించారని చెప్పారు. ఈ మేరకు ఖర్గే శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. యూపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన నియామకాల్లో ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయని, వీటిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

ఎన్టీఏ చీఫ్ పరిస్థితి ఏంటి?: జైరాం రమేశ్

మనోజ్ సోనీ రాజీనామాపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. పూజా ఖేడ్కర్ వివాదం నేపథ్యంలో ఆయనను పక్కనపెట్టాల్సిన పరిస్థితి వచ్చినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. మరి నీట్–యూజీ పరీక్ష నిర్వహించిన ఎన్టీఏ ఛైర్మన్ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

బగ్‌తో పరిహాసమా?!

బ్రస్సెల్స్: మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో బగ్ వల్ల బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ సమస్య తలెత్తడంతో శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత సేవలు నిలిచిపోయాయి. కోట్ల డాలర్ల నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. సైబర్‌సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ అందించిన అప్‌డేట్‌లో బగ్ వల్లే ఈ సంక్షోభం ఏర్పడింది. ఇది చాలా తీవ్రమైన విషయం కాగా, బెల్జియం వ్యంగ్య రచయిత విన్సెంట్ ఫ్లిబస్టీర్ పరిహాసానికి దిగాడు. నెటిజన్లతో చీవాట్లు తింటున్నాడు. తాను క్రౌడ్‌స్ట్రైక్ సంస్థలో కొత్తగా ఉద్యోగంలో చేరానని, మొదటి రోజు సాఫ్ట్‌వేర్‌లో చిన్న అప్‌డేట్ చేశానని చెప్పుకొచ్చాడు. ఈ మేరకు 'ఎక్స్'లో పలు పోస్టులు పెట్టాడు. కోడ్‌లో కేవలం ఒక లైన్ మార్చడం వల్ల బగ్ ఏర్పడిందని తెలిపాడు. క్రౌడ్‌స్ట్రైక్ ఆఫీసులో దిగిన ఫొటోను కూడా షేర్ చేశాడు. నిజానికి అతడు ఈ సంస్థలో ఉద్యోగి కాదు. కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో ఈ ఫొటో సృష్టించాడు. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ మారింది. 3.8 లక్షల లైక్‌లు వచ్చాయి. 37,000 మంది షేర్ చేశారు. కొన్ని గంటల తర్వాత విన్సెంట్ మరో పోస్టు చేశాడు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో బగ్ కారణంగా తనను ఉద్యోగం నుంచి తొలగించారని బాధపడ్డాడు. ఇది చాలా అన్యాయం అంటూ ఆక్రోశించాడు. తనకు ఎవరైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని దీనంగా వేడుకున్నాడు. 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్‌ను సైతం కోరాడు. తాను బాధపడుతున్న వీడియోను పంచుకున్నాడు. నెటిజన్లు చాలామంది ఇదంతా నిజమేనని నమ్మేశారు. కానీ, నిజం దాగదు కదా! వాస్తవం ఏమిటో తెలిసిపోయింది. పిచ్చి వేషాలు మానుకోవాలంటూ విన్సెంట్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. విన్సెంట్ నార్డ్‌ప్రెస్ అనే బెల్జియన్ పేరడీ న్యూస్ సైట్‌కు వార్తలు రాస్తుంటాడు.

క్రౌడ్‌స్ట్రైక్ అతలాకుతలం

పడిపోయిన షేర్ విలువ

వాషింగ్టన్: ప్రపంచమంతటినీ అతలాకుతలం చేసిన విండోస్ ఆపరేటింగ్ సిస్టం సాంకేతిక సమస్య ఆర్థికంగా కూడా అంతర్జాతీయంగా గట్టి ప్రభావమే చూపింది. పలు దిగ్గజ సంస్థల షేర్ల విలువ తగ్గుముఖం పట్టింది. ముఖ్యంగా తప్పుడు అప్‌డేట్‌తో సమస్యకు కారణమైన సైబర్ సెక్యూరిటీ దిగ్గజం క్రౌడ్‌స్ట్రైక్‌కు ఆర్థికంగా గట్టి దెబ్బే తగిలింది. శుక్రవారం ఆ సంస్థ షేర్ వాల్యూ ఒక్కసారిగా 11 శాతానికి పైగా పడిపోయింది. 42.22 డాలర్లున్న ఒక్కో వాటా విలువ 30 డాలర్లకు తగ్గింది. సంస్థ మొత్తం విలువ 83 బిలియన్ డాలర్ల పై చిలుకని అంచనా. ఆ లెక్కన 900 కోట్ల డాలర్లకు పైగా హరించుకుపోయినట్టే. అయితే ఆర్థిక నష్టం కంటే కూడా ప్రపంచంలోనే అగ్రశ్రేణి సైబర్ సెక్యూరిటీ సంస్థగా క్రౌడ్‌స్ట్రైక్‌కు ఉన్న ఇమేజీకి జరిగిన నష్టమే చాలా ఎక్కువ. ఎందుకంటే దాని కస్టమర్లుగా ఉన్న కంపెనీలు, పెద్ద సంస్థల్లో చాలావరకు తమ సైబర్ సెక్యూరిటీ బాధ్యతల కోసం ఇతర సైబర్ సెక్యూరిటీ సంస్థలవైపు చూస్తున్నట్టు సమాచారం. ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్ ఎక్స్ వంటి దిగ్గజ కంపెనీల సీఈఓ ఎలాన్ మస్క్ ఇప్పటికే ఈ జాబితాలో చేరారు. ''మా వ్యవస్థల నుంచి క్రౌడ్‌స్ట్రాక్‌ను తొలగించేశాం'' అంటూ ఆయన సోషల్ మీడియాలో తాజాగా పోస్ట్ చేశారు. సెంటినెల్ వన్, పాలో ఆల్టో నెట్‌వర్క్ వంటి క్రౌడ్‌స్ట్రాక్ ప్రత్యర్థి కంపెనీలు ఈ పరిస్థితిని రెండు చేతులా సొమ్ము చేసుకుంటున్నాయి.

భారీ పరిహారాలు!

మరోవైపు క్రౌడ్‌స్ట్రైక్ కస్టమర్లంతా తమకు జరిగిన నష్టానికి ఆ సంస్థ నుంచి భారీగా నష్టపరిహారం డిమాండ్ చేసేలా ఉన్నాయి. మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజాలు ఆ సంస్థ క్లయింట్ల జాబితాలో ఉండటం తెలిసిందే. షట్‌డౌన్ దెబ్బకు వాటి షేర్ల విలువ సగటున ఒక శాతం దాకా పడిపోయినట్టు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది.

యూసీసీ కింద నమోదైతే పోలీసు రక్షణ
ఉత్తరాఖండ్ హైకోర్టు సూచన!

నైనిటాల్: సహజీవనం చేస్తున్న ఓ జంట తమకు రక్షణ కల్పించాలంటూ వేసిన పిటిషన్‌పై ఉత్తరాఖండ్ హైకోర్టు వెలువరించిన తీర్పు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) ఇంకా అమల్లో రాలేదు. అయినప్పటికీ ఈ చట్టం కింద 48 గంటల్లోగా రిజిస్టర్ చేసుకున్న పక్షంలో పిటిషన్‌దారుగా ఉన్న జంటకు ఆరు వారాలపాటు రక్షణ కల్పించాలంటూ పోలీసు శాఖను ఆదేశిస్తూ జస్టిస్ మనోజ్ కుమార్ తివారీ, జస్టిస్ పంకజ్ పురోహిత్‌ల డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. ఈ పరిణామంపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ వివరణ ఇచ్చారు. 'పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున జూనియర్ న్యాయవాది హాజరయ్యారు. రాష్ట్రంలో యూసీసీ అమలుపై ప్రభుత్వం నోటిఫికేషన్ ఇంకా వెలువడలేదనే విషయం ఆయనకు తెలియదు. అవగాహనా లోపం వల్ల ఇలా జరిగింది. దీనిపై హైకోర్టులో రీ కాల్ పిటిషన్ వేస్తాం. హైకోర్టు ఈ తీర్పును సవరించి, మళ్లీ ఉత్తర్వులు జారీ చేస్తుంది'అని చెప్పారు. అదే సమయంలో, ఆ జంటకు పోలీసులు రక్షణ కల్పిస్తారని కూడా ప్రభుత్వ న్యాయవాది స్పష్టం చేశారు. వేర్వేరు మతాలకు చెందిన తమ కుటుంబాల నుంచి ముప్పుందంటూ సహజీవనం చేస్తున్న 26 ఏళ్ల హిందూ మహిళ, 21 ఏళ్ల ముస్లిం యువకుడు వేసిన పిటిషన్ ఈ మొత్తం వ్యవహారానికి కారణమైంది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రతిపాదించిన యూసీసీ ప్రకారం యువ జంటలు తాము సహజీవనం చేస్తున్న రోజు నుంచి నెల రోజుల్లోగా అధికారుల వద్ద నమోదు చేసుకోకుంటే జరిమానా విధించొచ్చు.

ఒకే సెంటర్‌లో 85 శాతం మందికి అర్హత

పరీక్షా కేంద్రాలు, నగరాల వారీగా నీట్–యూజీ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నీట్–యూజీ ఫలితాలను పరీక్షా కేంద్రాలు, నగరాల వారీగా శనివారం విడుదల చేసింది. ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో తీసుకొచ్చింది. ఈ ఫలితాలను పరిశీలిస్తే విస్మయకరమైన అంశాలు బయటపడుతున్నాయి. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఒకే పరీక్షా కేంద్రంలో నీట్ రాసిన అభ్యర్థుల్లో ఏకంగా 85 శాతం మంది అర్హత సాధించినట్లు తెలుస్తోంది. రాజ్‌కోట్‌లోని యూనిట్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎగ్జామ్ సెంటర్‌లో 22,701 మంది నీట్ రాశారు. వీరిలో 85 శాతం అర్హత సాధించారు. ఈ సెంటర్లో 12 మంది 700కు పైగా, 115 మంది 650కిపైగా, 259 మంది 600కు పైగా, 403 మంది 550కిపైగా స్కోర్ సాధించారు. అలాగే రాజస్తాన్‌లోని విద్యాభారతి శిఖర్ సెంటర్‌లో పరీక్ష రాసినవారిలో కూడా చాలామందికి మెరుగైన స్కోర్ లభించింది. అక్కడ 8 మంది 700కు పైగా, 69 మంది 650కిపైగా, 155 మంది 600కుపైగా, 241 మంది 500కు పైగా స్కోర్ సాధించారు.

హరియాణాలోని రోహతక్‌లో మోడల్ స్కూల్ సెంటర్‌లో పరీక్ష రాసిన వారిలో 45 మంది అభ్యర్థులకు 600కుపైగా స్కోర్ లభించింది. హరియాణాలోని ఝజ్జర్‌లో హర్‌దయాల్ పబ్లిక్ స్కూల్ సెంటర్‌లో ఇంతకుముందు ఆరుగురు అభ్యర్థులకు 720కి 720 స్కోర్ దక్కింది. గ్రేసు మార్కులను తొలగించి, ఫలితాలను సవరించిన తర్వాత ఈ సెంటర్‌లో 13 మంది అభ్యర్థులు 600కుపైగా స్కోర్ సాధించారు. 682 స్కోర్ ఎవరికీ దాటలేదు.

నీట్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

నీట్ పేపర్ లీక్ కేసులో సూత్రధారుల్లో ఒకరిగా భావిస్తున్న వ్యక్తిని సీబీఐ అధికారులు శనివారం అరెస్టు చేశారు. అతడిని ఎన్‌ఐటీ–జంషెడ్‌పూర్ బీటెక్ గ్రాడ్యుయేట్ శశికాంత్ పాశ్వాన్ అలియాస్ శశిగా గుర్తించారు. అలాగే ఇదే కేసులో ఇద్దరు ఎంబీబీఎస్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇప్పటిదాకా అరెస్టయిన వారి సంఖ్య 21కి చేరుకుంది.

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు తీవ్రతరం...
కనిపిస్తే కాల్చివేత!

- సైన్యం, పోలీసుల గుప్పెట్లో దేశం
- 'రిజర్వేషన్ల' ఘర్షణలు తీవ్రతరం
- ఇప్పటికే 115 దాటిన మరణాలు

ఢాకా/సాక్షి, న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ అట్టుడుకుతోంది. రిజర్వేషన్లపై వారం క్రితం మొదలైన దేశవ్యాప్త హింసాకాండ నానాటికీ పెరిగిపోతోంది. భద్రతా సిబ్బందికి, విద్యార్థులకు మధ్య జరుగుతున్న ఘర్షణల్లో మృతి చెందిన వారి సంఖ్య శనివారంతో 115 దాటింది! రాజధాని ఢాకాతో పాటు ప్రధాన నగరాలు, పట్టణాల్లో కర్ఫ్యూ విధించినా, సైనికులు, పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. అయినా లాభం లేకపోగా పరిస్థితి విషమించడమే గాక పూర్తిగా అదుపు తప్పుతోంది. దాంతో తాజాగా కనిపిస్తే దేశవ్యాప్తంగా కాల్చివేత (షూట్ ఎట్ సైట్) ఉత్తర్వులు జారీ అయ్యాయి!

978 మంది భారతీయులు వెనక్కు

బంగ్లాదేశ్ నుంచి 978 మంది భారతీయ విద్యార్థులను కేంద్రం సురక్షితంగా వెనక్కు తీసుకొచ్చింది. 778 మంది నౌకల్లో, 200 మంది విమానాల్లో వచ్చారు. బంగ్లాదేశ్‌లో పలు వర్సిటీల్లో ఇంకా 4 వేలకు పైగా భారతీయ విద్యార్థులున్నారు. వారందరినీ సురక్షితంగా తీసుకొచ్చేందుకు ఢాకాలోని భారత హైకమిషన్ కృషి చేస్తోంది.

ఇదీ సమస్య...

1971 బంగ్లాదేశ్ వార్ వెటరన్ల కుటుంబీకులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 2018లో షేక్ హసీనా వీటిని రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని ఢాకా హైకోర్టు తాజాగా తప్పుబట్టింది. ఆ రిజర్వేషన్లను పునరుద్ధరించాలంటూ జూన్ 5న ఆదేశాలిచ్చింది. దీనిపై విద్యార్థులు, ఉద్యోగార్థులు భగ్గుమన్నారు. దేశవ్యాప్తంగా వీటిని వ్యతిరేకిస్తూ భారీగా నిరసనలు, ఆందోళనలకు దిగారు. కోటా పునరుద్ధరణ వద్దే వద్దంటూ రోడ్డెక్కారు. దాంతో కోర్టు ఉత్తర్వులను హసీనా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు తాత్కాలికంగా పక్కన పెట్టింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఆదివారం తుది విచారణకు అంగీకరించింది.

తక్కువ కేలరీల ఆహారం తీసుకుంటున్నారు

- తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌పై ఢిల్లీ ఎల్జీ వ్యాఖ్యలు
- తమ నేతను చంపేందుకు బీజేపీ కుట్ర అంటూ మండిపడ్డ ఆప్

న్యూఢిల్లీ: తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే తక్కువ కేలరీలున్న ఆహారం తీసుకుంటున్నారని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆరోపించారు. వైద్యులు సూచించిన మందులను కూడా ఆయన వాడకపోవచ్చని పేర్కొన్నారు. తీహార్ జైలు సూపరింటెండెంట్ నివేదికను ప్రస్తావిస్తూ ఎల్జీ ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్‌కు లేఖ రాసినట్లు రాజ్‌భవన్ వర్గాలు శనివారం తెలిపాయి. కేజ్రీవాల్‌కు ఇంటి వద్ద నుంచి వచ్చిన ఆహారాన్ని సరిపోను అందజేస్తున్నా కూడా ఆయన కావాలనే తక్కువ కేలరీలున్న ఆహారం తింటున్నట్లుగా ఆధారాలున్నాయన్నారు. గ్లూకోమీటర్ టెస్ట్ రీడింగ్‌కు, కంటిన్యువస్ గ్లూకోజ్ మానిటరింగ్ సిస్టం రీడింగ్‌కు మధ్య కనిపిస్తున్న భారీ వ్యత్యాసంపై అధికారులు పరిశీలన జరపాలని సూచించారు.

ఎల్జీ వైద్యుడనే విషయం తెలియదు

ఎల్జీ వీకే సక్సేనా రాసిన లేఖపై ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందిస్తూ.. నాకు తెలిసినంత మటుకు ఆయన గతంలో సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే వారు. వీకే సక్సేనా డాక్టర్ అని, ఆరోగ్య అంశాల్లో మంచి నిపుణుడనే విషయం నాకు తెలియదు. ఎప్పుడైనా ఆయన ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే, ఈసీకి సమర్పించిన అఫిడవిట్‌ను చదివి ఉండేవాళ్లం' అంటూ ఎద్దేవా చేశారు. తమ నేతను చంపేందుకు బీజేపీ దుర్మార్గపు పథకం పన్నిందని ఆరోపించారు.

అక్రమ మైనింగ్ కేసు..
హరియాణా కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్



న్యూఢిల్లీ: అక్రమ మైనింగ్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై హరియాణాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్ట్ చేసింది. శనివారం ఉదయం గురుగ్రామ్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. అంబాలాలోని ప్రత్యేక కోర్టుల్లో ఆయన్ను హాజరుపర్చనున్నారు. హరియాణాలోని యమునానగర్ ప్రాంతంలో భారీ ఎత్తున అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఈ ఏడాది జనవరిలో ఈడీ అధికారులు ఆయన నివాసాలపై దాడులు జరిపారు. ఇదే కేసులో ఇండియన్ లోక్ దళ్ ఐఎన్ఎల్‌డీకి చెందిన యమునానగర్ ఎమ్మెల్యే దిల్బాగ్ సింగ్, ఆయన సన్నిహితుడు కుల్వీందర్ సింగ్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు.

ఉక్రెయిన్ మాజీ ఎంపీ దారుణ హత్య



కీవ్: ఉక్రెయిన్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు ఇరినా ఫరియోన్(60)శనివారం లీవ్ నగరంలో హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో ఆమె తీవ్ర గాయాలతో చనిపోయారు. ఉక్రెయిన్ భాష వ్యాప్తికి ఎనలేని కృషి చేస్తున్న ఇరినా మృతి పట్ల అధ్యక్షుడు జెలెన్‌స్కీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుండగుడిని పట్టుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు మొదలయ్యాయని ఆయన అన్నారు. ఘటన వెనుక రష్యా ఉండి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ ప్రజలు రష్యన్ బదులు మాతృ భాషలోనే మాట్లాడేలా ఇరినా తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే, రష్యాతో జరుగుతున్న యుద్ధంలో కీలకమైన మరియుపోల్ రక్షణ కోసం సర్వశక్తులూ ఒడ్డిన అజోవ్ రెజిమెంట్ సైనికులు రష్యన్ భాష మాట్లాడటంపై ఇరినా చేసిన వ్యాఖ్యలు గతంలో వివాదాస్పదమయ్యాయి. పలు సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనే ఇరినాకు వ్యక్తిగతంగా కూడా విరోధులున్నారని పోలీసులు చెబుతున్నారు.

చైనాలో ఆకస్మిక వరదలు.. కూలిన వంతెన
12 మంది మృతి, మరో 60 మంది గల్లంతు




బీజింగ్: చైనాలోని షాంగ్జి, సిచువాన్ ప్రావిన్స్‌ల్లో సంభవించిన ఆకస్మిక వరదలు, వంతెన కూలిన ఘటనల్లో 12 మంది చనిపోగా మరో 60 మందికిపైగా గల్లంతయ్యారు. షాంగ్జి ప్రావిన్స్‌లోని షంగ్లువో నగరంలో ఎడతెరిపి లేని వానలు, ఆకస్మిక వరదలతో శుక్రవారం రాత్రి వంతెన కూలింది. దీంతో, 17 కార్లు, 8 ట్రక్కులు దిగువనున్న జిన్‌క్వియాన్ నదిలో పడిపోయాయి. ఘటనలో 12 మంది మృతి చెందగా, మరో 31 మంది జాడ తెలియడం లేదని అధికారులు చెప్పారు. ఏడు వాహనాల్ని వెలికి తీశామని, కొట్టుకుపోయిన వారి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అదేవిధంగా, సిచువాన్ ప్రావిన్స్‌లో శనివారం వేకువజామున సంభవించిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల్లో జిన్హువా గ్రామంలోని 40కి పైగా నివాసాలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 30 మందికి పైగా గల్లంతయ్యారు. వరదల కారణంగా పలు ప్రావిన్స్‌ల్లో రోడ్లు, వంతెనలు, సమాచార వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

లాయర్లూ.. ఆధిపత్య ధోరణి వద్దు: సీజేఐ



సాక్షి, చెన్నై: వృత్తిలోకి కొత్తగా వస్తున్న జూనియర్ లాయర్ల పట్ల చిన్న చూపు తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. జూనియర్ న్యాయవాదులు అనుభవం గడించేందుకు, పైకెదిగేందుకు సహకరిస్తూ వారికి మార్గదర్శకులుగా వ్యవహరించాలని సీనియర్ లాయర్లకు ఉద్బోధించారు. జూనియర్ల పట్ల ఆధిపత్య ధోరణిని విడనాడాలన్నారు. మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ 20వ వార్షికోత్సవాలను శనివారం సీజేఐ ప్రారంభించారు. ''జూనియర్ లాయర్ల నుంచి కూడా నేర్చుకోవాల్సింది చాలా ఉంది. నెలంతా పని చేయించుకుని కేవలం రూ.5 వేలు ఇవ్వడమంటే వారిని గేట్ కీపర్లుగా మార్చడమే'' అన్నారు. ఢిల్లీ హైకోర్టు డేటా నిల్వ, సాఫ్ట్‌వేర్ బ్యాకప్ కోసం మదురై బెంచ్‌లో 'డిజాస్టర్ రికవరీ సెంటర్'ను ఏర్పాటు చేసుకోవడాన్ని సీజేఐ ప్రస్తావించారు. 'ఇకపై ఢిల్లీకి సమస్య వస్తే పరిష్కారానికి తమిళనాడు వైపు చూస్తుందన్నమాట' అంటూ చమత్కరించారు.

పోటీలో నేనే.. త్వరలో ప్రచారం: బైడెన్



వాషింగ్టన్: ఎవరెన్ని చెప్పినా ఎన్నికల బరినుంచి తప్పుకునేదే లేదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) కుండబద్దలు కొట్టారు. కరోనా నుంచి కోలుకోగానే త్వరలో మళ్లీ ప్రచార బరిలో దిగుతానని ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను దీటుగా ఢీకొంటానని శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం డెలావెర్‌లోని సొంతింట్లో ఐసోలేషన్‌లో గడుపుతున్న బైడెన్ వారం పాటు అక్కడే విశ్రాంతి తీసుకోనున్నారు.

జార్ఖండ్ జనాభాపై శ్వేతపత్రం: అమిత్ షా



రాంచీ: గిరిజనుల జనాభా అధికంగా ఉన్న జార్ఖండ్‌లోకి అక్రమ వలసలు, చొరబాట్లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఈ అక్రమ వలసలు, చొరబాట్ల వల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే జనాభా స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, గిరిజనుల భూములు, హక్కులు, రిజర్వేషన్లు కాపాడుతామని ప్రకటించారు. శనివారం రాంచీలో బీజేపీ కార్యనిర్వాహక కమిటీ భేటీలో అమిత్ షా మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో ఎవరెంత మంది ఉన్నారో తేల్చాల్సిందేనని అన్నారు. చొరబాటుదారులు జార్ఖండ్‌లోకి ప్రవేశించి, స్థానిక మహిళలను పెళ్లి చేసుకొని, ధ్రువపత్రాలు పొందుతున్నారని, గిరిజనుల భూములు కాజేస్తున్నారని విమర్శించారు. స్థానికులకు దక్కాల్సిన ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. సీఎం హేమంత్ సోరెన్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌ను ప్రోత్సహిస్తున్నారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల కోసం ఓ వర్గం ప్రజలను బుజ్జగిస్తున్నారని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీలో అహంకారం తగ్గలేదని విమర్శించారు.

మంత్రి జితిన్ ప్రసాదకు తప్పిన ప్రమాదం



పిలిభిత్(యూపీ): కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాదకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఆయన ప్రయాణిస్తున్న కారు కాన్వాయ్‌లోని మరో రెండు కార్లను ఢీకొట్టింది. ఘటనలో మూడు కార్లు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని మంత్రి సహాయకుడొకరు చెప్పారు. సొంత నియోజకవర్గం పిలిభిత్‌లో వరదలతో దెబ్బతిన్న గ్రామాలను పరిశీలించేందుకు వెళ్లగా మఝోలా–బిర్ఖానీ మధ్య ప్రమాదం చోటుచేసుకుంది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం : 21 : జూలై : 2024



జీరోవేస్ట్ దిశగా హైదరాబాద్

జీరో వేస్ట్ దిశగా హైదరాబాద్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు విశ్వ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని సంస్థ ఫౌండర్ ఎం.శ్రీవాణి పేర్కొన్నారు. -8లో



స్నేహితురాలికి దేశం చూపించాలని..

స్నేహితురాలికి దేశం చూపించాలని ఇద్దరు యువకులు ఓ కారు దొంగిలించారు. యువతిని తీసుకుని రాజస్థాన్ వరకు వెళ్లారు. అక్కడ వినోదాల్లో మునిగితేలుతుండగా ఫిలింనగర్ పోలీసులు పట్టుకున్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.0/23.0

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి వర్షం కురవొచ్చు. గరిష్టంగా 27, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చు.



ప్రత్యేకం.. ఈ బోనం

అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ తలపై బోనంతో వచ్చి సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సమర్పించిన దృశ్యం ప్రత్యేకతను సంతరించుకుంది. శనివారం మహంకాళి అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్, అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ తదితరులు దర్శించుకున్నారు. -రాంగోపాల్‌పేట్



మొక్కజొన్న పొత్తు.. టేస్టు మస్తు!

అసలే ముసురు వాన నగరవాసుల్ని వణికిస్తోంది. బయటికి రావాలంటే జంకే పరిస్థితి. మరి.. వేడివేడి మొక్కజొన్న పొత్తులు లాగిస్తే ఆ టేస్టే వేరు. శనివారం చిరుజల్లుల మధ్య ఇందిరా పార్కు సమీపంలో పలువురు సందర్శకులు మొక్కజొన్న పొత్తులను ఇలా హాట్‌హాట్‌గా తింటున్న దృశ్యం కనిపించింది.

మూసీని చూసి మురిసేలా..

లండన్‌లోని థేమ్స్ నది తరహాలో సుందరీకరణ

- ప్రపంచ పర్యాటకులు సందర్శించేలా అభివృద్ధి
- రూ.1.5 లక్షల కోట్లతో మూసీ రివర్ డెవలప్‌మెంట్‌కు ప్రణాళిక
- హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- గోపన్‌పల్లి ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

గచ్చిబౌలి: ప్రపంచం నలుమూల నుంచి పర్యాటకులు సందర్శించేలా.. ఐటీ కంపెనీలు కొలువుదీరేలా.. వ్యాపారాలు చేసే విధంగా మూసీ సుందరీకరణ చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలో రూ.28.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగం ఇలా సాగింది.. లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మూసీ సుందరీకరణ కోసం ప్రణాళిక రూపొందించాం. రూ.1.5 లక్షల కోట్లతో మూసీ రివర్ డెవలప్‌మెంట్ పనులను త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మూసీ అంటే ముక్కు మూసుకునే పరిస్థితి ఉంది. రాబోయే కాలంలో పర్యాటకులు సందర్శించేలా, మూసీ వెంట ఐటీ కంపెనీలు కొలువుదీరేలా అభివృద్ధి చేస్తాం. హైటెక్ సిటీని చూస్తే ఓ సీఎం పేరు, ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్టును చూడగానే మరో సీఎం, ప్రభుత్వం పేరు గుర్తుకు వస్తుంటాయి. మూసీ నదిని చూస్తే ప్రజా ప్రభుత్వం పేరు గుర్తొచ్చేలా తీర్చిదిద్దుతాం.

రాష్ట్రానికి 65 శాతం ఆదాయం జంట నగరాల నుంచే..



ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు

పదేళ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలి. నగరంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడ ఫ్లై ఓవర్లు, రోడ్లను విస్తరిస్తాం. చెరువుల కబ్జాను అడ్డుకొంటాం. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం చేసే రేడియల్ రోడ్ల అభివృద్ధి చేస్తాం. తెలంగాణ రాష్ట్రానికి 65 శాతం ఆదాయం జంట నగరాల నుంచే సమకూరుతోంది. శాంతి భద్రతలు కాపాడేందుకు, ట్రాఫిక్ సమస్యలు, రోడ్లపై నీళ్లొస్తే పరిష్కరించేందుకు హైడ్రా



గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌పై జెండా ఊపి వాహనాల రాకపోకలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి తదితరులు

అనే నూతన వ్యవస్థకు ఐజీ స్థాయి అధికారిని నియమించాం. శాంతి భద్రతలు కాపాడినప్పుడే, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే మన నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుంది.

వైఎస్ హయాంలోనే ..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలను, ఔటర్ రింగ్‌రోడ్డును తీసుకొచ్చారు. ఐటీ కంపెనీలు, ఐఎస్‌బీ లాంటి విద్య సంస్థలు రావడంతో గోపన్‌పల్లి చుట్టు పక్కల గ్రామాల్లోనూ ఎకరం వంద కోట్ల ధర పలుకుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల కోర్ హైదరాబాద్‌గా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు సెమీ అర్బన్‌గా నిర్ణయించాం. ఫార్మా క్లస్టర్ శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి నగరాన్ని విస్తరిస్తాం.

3 నెలల్లో ఆర్ఆర్ఆర్ పనులు..

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రూ.30 వేల కోట్లతో రీజినల్‌రింగ్ రోడ్డు పనులను మరో మూడు నెలల్లో ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి అంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డిలా.. ప్రజల మధ్యలో ఉంటూ.. చిన్న పిల్లవాడు వెళ్లినా సీఎం రేవంత్ అందుబాటులో ఉంటున్నారని.. సమర్థంగా పని చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, జెర్రిపాటి జైపాల్, రఘునాథ్ యాదవ్ పాల్గొన్నారు.

మీ ఇంటికే వస్తారు!

- భవనాల అసెస్‌మెంట్ కోసం..
- త్వరలో మొదలవనున్న ఇంటింటి సర్వే
- ఇప్పటికే కొనసాగుతున్న డ్రోన్ సర్వే



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలోని భవనాల జీఐఎస్ మ్యాపింగ్ కోసం డోర్ టు డోర్ సర్వే త్వరలో ప్రారంభం కానుంది. ఇందుకుగాను జీహెచ్ఎంసీతోపాటు సర్వే చేసేందుకు ఎంపికైన కాంట్రాక్టు ఏజెన్సీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఓవైపు డ్రోన్ సర్వే ప్రారంభం కాగా.. మరోవైపు త్వరలోనే ఇంటింటి సర్వే ప్రారంభం కానుంది. ఇంటింటి సర్వే వల్ల జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను ఆదాయం రూ.వెయ్యి కోట్లకు పైగా పెరగవచ్చనే అంచనాలున్నాయి. జీహెచ్ఎంసీలో 20 లక్షలకు పైగా ఆస్తులు (భవనాలు) ఉన్నప్పటికీ, ఆస్తిపన్ను చెల్లింపు జాబితాలో మాత్రం దాదాపు 19 లక్షలున్నాయి. ఇంటింటి సర్వే ద్వారా సరైన లెక్కలతో పాటు భవనాల వాస్తవ విస్తీర్ణాలకనుగుణంగా ఆస్తిపన్ను విధించనున్నారు. ప్రస్తుతం చాలా భవనాల వాస్తవ విస్తీర్ణం కంటే తక్కువ విస్తీర్ణం నమోదై ఉండటంతో జీహెచ్ఎంసీకి రావాల్సినంత ఆస్తిపన్ను ఆదాయం రావడం లేదు. మరోవైపు అదనంగా పెరిగిన అంతస్తుల నుంచి కూడా ఆస్తిపన్ను రావడం లేదు. శాటిలైట్, డ్రోన్, డోర్ టు డోర్ సర్వేల ద్వారా మ్యాపింగ్‌తో కచ్చితమైన వివరాలతో పాటు ప్రతి ఇంటికీ యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్ కేటాయించనున్నందున ఓవైపు జీహెచ్ఎంసీ ఆదాయం పెరగడంతో పాటు వివిధ అవసరాలకు ఉపయోగపడనుంది. ఏవైనా ప్రమాదాలు జరిగితే సంబంధిత యంత్రాంగం త్వరితంగా చేరుకునేందుకు కూడా ఉపకరిస్తుంది.

రెండు సర్కిళ్లలో పూర్తయిన డ్రోన్ సర్వే

ఇప్పటికే డ్రోన్ సర్వే ప్రారంభమైంది. పటాన్‌చెరు, కూకట్‌పల్లి సర్కిళ్లలో పూర్తయిందని జీహెచ్ఎంసీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం శేరిలింగంపల్లిలో సర్వే జరుగుతోంది. త్వరలోనే ఇంటింటి సర్వే కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రజలు సర్వేకు సహకరించేందుకు వీలుగా ముందస్తు ప్రచారం నిర్వహించనున్నారు. వివిధ ప్రచార, ప్రసార మాధ్యమాలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటారు. సోషల్‌మీడియా ద్వారానూ ప్రచారం నిర్వహించాలనే యోచనలో అధికారులున్నట్లు సమాచారం.

యాప్‌లో నమోదు

- ఇంటింటి సర్వేలో భాగంగా ఇళ్లకు సంబంధించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఇళ్ల యజమానుల ఫోన్ నెంబర్లను కూడా నమోదు చేయనున్నారు. ఇళ్ల నమోదులో భాగంగా నివాస భవనమా.. వాణిజ్య భవనమా.. అపార్ట్‌మెంటా.. ఇండిపెండెంట్ భవనమా? వంటి వివరాలతో పాటు భవనం విస్తీర్ణం, చిరునామా, పోస్టల్ కోడ్ తదితర వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న భవనాల వివరాలను సైతం సర్వే చేస్తారు. భవనం ఎత్తు, అక్కడున్న రోడ్ మెయిన్ రోడ్డా? సబ్ రోడ్డా? వంటి వివరాలు సైతం నమోదు చేస్తారు.
- భవనం ఫొటోలు తీస్తారు. భవనాల్లో ఇంకుడుగుంతలు, సివరేజి లైన్లు, సోలార్ ప్యానెల్ వంటివి ఉన్నదీ లేనిదీ నమోదు చేస్తారు. జియో ఫెన్సింగ్ వల్ల భవనం ఏ వార్డు పరిధిలో ఉన్నది ఆటోమేటిక్‌గా నమోదవుతుంది. ఎన్ని అంతస్తులు, భవన వినియోగం, వాటర్, విద్యుత్ కనెక్షన్ల వివరాలు తదితరాలను సైతం నమోదు చేస్తారు. వాణిజ్య భవనాలైతే జరుగుతున్న వ్యాపారం, ట్రేడ్‌లైసెన్స్ వంటి వివరాలు కూడా నమోదు చేస్తారు. వీటితో పాటు ఇంకా పలు వివరాలు యాప్‌లో నమోదు చేయనున్నారు. యాప్ పనితీరు పరిశీలన కోసం దాదాపు 15 ఇళ్ల వివరాలు యాప్‌లో నమోదు చేసినట్లు సమాచారం.



మూసాపేట్‌లో ట్రాఫిక్‌జాం



అసెంబ్లీ బస్టాప్ వద్ద..



ముసుగేసే.. ముసురేసే..

సాక్షి, సిటీబ్యూరో: నగరం కారుమబ్బులతో ముసుగేసింది. ముసురు వానలతో విసురుకుంది. ఎడతెరిపిలేకుండా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. రెండ్రోజులుగా పడుతున్న వానతో సగటున 2 నుంచి 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లిన వారు తడిసి ముద్దవుతున్నారు. ముసురు వర్షంతో ప్రధాన రహదారులు చిత్తడిగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరుతోంది. రోడ్లపై పెద్దగా ట్రాఫిక్ లేనప్పటికీ నీరు చేరి బురదగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- జలాశయాలకు వరద నగరంలోని హుస్సేన్ సాగర్‌తో పాటు శివారులోని జంట జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. హుస్సేన్ సాగర్ నీటిమట్టం 513.41 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి 1517 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, గేట్లు ఎత్తి దిగువకు 998 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్ నీటిమట్టం 1779.20 అడుగులు. హిమాయత్ సాగర్ నీటిమట్టం 1755.55 అడుగులకు చేరింది.

టెంపుల్.. కలర్‌ఫుల్!

నగరంలో ఆషాఢ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. శనివారం రాత్రి విద్యుద్దీపాల కాంతుల్లో తళుకులీనుతూ ఇలా కనిపించింది.



సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

- ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో చాటింగ్
- సీపీని ఆశ్రయించి ఆధారాలు సమర్పించిన బాధితురాలు
- తక్షణం చర్యలు తీసుకున్న సైబరాబాద్ సీపీ



పురేందర్‌రెడ్డి

సనత్‌నగర్: సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఓ కేసు విషయమై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో చాటింగ్ చేస్తూ అసభ్యకర మెసేజ్‌లు పంపించడంపై ఇన్‌స్పెక్టర్‌పై సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తక్షణ చర్యలు తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మూడు నెలల క్రితం సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పురేందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఇటీవల ఓ మహిళ ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో పురేందర్‌రెడ్డి ఆమెతో ఫోన్‌లో చాటింగ్ చేయడం మొదలుపెట్టారు. 'నువ్వు అందంగా ఉన్నావు.. నేను చెప్పిన చోటికి రావాలి' అంటూ అసభ్య పదజాలంతో మెసేజ్‌లు పంపించారు. దీంతో బాధితురాలు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతిని నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ అభ్యంతరకరంగా చేసిన చాటింగ్ సందేశాలను ఆధారాలతో కమిషనర్‌కు ఆమె చూపించారు. దీంతో ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలో దుష్ప్రవర్తనను సహించేది లేదన్న బలమైన సందేశాన్ని సీపీ పంపించారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించే పౌరులకు, ముఖ్యంగా మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని అందించేలా ఒక భరోసా కలిగించేలా సీపీ చర్యలు తీసుకున్నారని పలువురు అభిప్రాయపడ్డారు.

నూతన ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు..



సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసులును నియమిస్తూ సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులు.. ఉత్తర్వులు వెలువడిన వెంటనే శనివారం సాయంత్రం సనత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు.

నూతన చట్టాలతో సత్వర న్యాయం

హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ



బంజారాహిల్స్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ కొత్త చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని తెలంగాణ హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహ శర్మ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూం లా కాలేజీలో అన్‌లాకింగ్ 'కొత్త దిశలు-భారత దేశం క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు చాలా బాగున్నాయన్నారు. ఇవి సామాన్యులకు సత్వర న్యాయం జరిగే విధంగా రూపొందించడం అభినందనీయమన్నారు. గత చట్టాల్లో లేని ఎన్నో అంశాలను ప్రస్తుత చట్టాల్లో ఏర్పాటు చేశారని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు ప్రస్తుతం చట్టాల్లో ఎంతో ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు. టెర్రరిస్టు యాక్టివిటీలు, ఆర్గనైజ్డ్ క్రైం చేసే వారికి కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రస్తుతం సెక్షన్లలో ప్రమాదానికి కారణమై బాధితులను ఆస్పత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన వారికి శిక్ష తగ్గుతుందని.. అలా కాకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోయే వారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాపిడో యాప్‌తో మెట్రో టికెట్ బుకింగ్



సాక్షి, సిటీబ్యూరో: రాపిడో యాప్ ద్వారా మెట్రో టికెట్లను బుక్ చేసుకొనే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. రాపిడో బైక్, క్యాబ్, ఆటో వంటి సర్వీసుల బుకింగ్‌తో పాటు ప్రయాణికులు మెట్రో టికెట్లను సైతం పొందవచ్చు. ఇంటి నుంచి గమ్యం చేరేవరకు ఏకీకృత రవాణా సదుపాయాన్ని అందజేసే లక్ష్యంతో ఎల్ అండ్‌టీ హైదరాబాద్ మెట్రో, రాపిడో సంస్థలు ఈ మేరకు శనివారం ఒప్పందం ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ప్రయాణికులకు సంపూర్ణ రవాణా సదుపాయం లభించనుందని ఎల్‌అండ్‌టీ మెట్రో అధికారులు తెలిపారు. రాపిడో యాప్‌లో మెట్రో టికెట్ బుకింగ్‌లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వేలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి రోజు సగటున 4.80 లక్షల మంది ప్రయాణికులు మెట్రోల్లో ప్రయాణిస్తుండగా, రాపిడో యాప్ ద్వారా మెట్రో టిక్కెట్ బుకింగ్ సదుపాయంతో మరో 15 శాతం ప్రయాణికులు పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా రాపిడో సహ-వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ.. రాపిడో యాప్‌లో మెట్రో టికెట్ బుకింగ్ సదుపాయంతో రాపిడో వినియోగదారులు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రయాణికులకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం లభిస్తుందని చెప్పారు. ప్రయాణికులు రాపిడో సేవలను వినియోగించుకోవడం వల్ల మెట్రో నుంచి చివరి గమ్యం వరకు ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రాపిడోతో ఒప్పందంపై ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ అండ్ సీఈఓ కేవీబీ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్ చిప్లుంకర్ పాల్గొన్నారు.

నిర్మాణ ప్రాంతాల్లో క్రెచ్‌లు తప్పనిసరి

- కుక్కల బారి నుంచి పిల్లల సంరక్షణకు..

సాక్షి, సిటీబ్యూరో: వీధికుక్కల దాడుల నివారణ చర్యల్లో భాగంగా మరికొన్ని చర్యలకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ముఖ్యంగా భవన నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో క్రెచ్‌లు (పిల్లల సంరక్షణ కేంద్రాలు) తప్పనిసరి చేయనుంది. నిర్మాణ ప్రాంతాల్లో కూలీ పనులు చేసే వారు పనులకు వెళ్లిన సమయాల్లో కుక్కలు వారి పిల్లలపై దాడులు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున నిర్మాణ ప్రాంతాల్లో క్రెచ్‌లు తప్పనిసరి చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. మెటర్నిటీ బెనిఫిట్ (అమెండ్‌మెంట్) యాక్ట్-2017 మేరకు క్రెచ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున టౌన్‌ప్లానింగ్ సీసీపీ ద్వారా బిల్డర్లకు ఈమేరకు లేఖలు రాయనున్నట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. క్రూరంగా, దూకుడుగా వ్యవహరించే వీధికుక్కల కోసం రిహాబిలిటేషన్ కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. వీధికుక్కలు కరిచినట్లు సమాచారమందిన వెంటనే తగిన చర్యల కోసం సంబంధిత వెటర్నరీ అధికారి నేతృత్వంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ప్రొటోకాల్ మేరకు నగరంలోని వీధికుక్కలను సర్వే చేయాలని, అన్నింటికీ నూరు శాతం సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయాలని నిర్ణయించింది. అన్ని వీధికుక్కలకు వందశాతం యాంటీ రేబిస్ టీకాలు వేయాలని నిర్ణయం తీసుకుంది. వీధికుక్కల నియంత్రణకు వీటితోపాటు ఇంకా పలు చర్యలు జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో చేపట్టనున్నారు.

బోనాల ఏర్పాట్లను పరిశీలించిన ఆమ్రపాలి



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు ఆదివారం జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పరిశీలించారు. ఉజ్జయిని మహంకాళి ఆలయంతో పాటు పలు దేవాలయాలకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. శానిటేషన్, మొబైల్ టాయిలెట్స్ తదితర అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ రవి కిరణ్ తదితరులున్నారు.

‘జీరో వేస్ట్’ దిశగా హైదరాబాద్

విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న జయేశ్ రంజన్

సాక్షి, సిటీబ్యూరో: జీరో వేస్ట్ దిశగా హైదరాబాద్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు విశ్వ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని సంస్థ ఫౌండర్ ఎం.శ్రీవాణి పేర్కొన్నారు. ఇందులో భాగంగా తమ సంస్థ విశ్వ టాక్స్, విశ్వ యువ వికాస్, విశ్వ అన్నదానం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. సమాజాన్ని జాగృతం చేసేందుకు చేపట్టిన ‘విశ్వ టాక్’ కార్యక్రమం ..150వ ఎడిషన్ సందర్భంగా సంస్థ సెలబ్రేట్ చేసుకుంది. దీన్ని పురస్కరించుకొని శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతిని కాపాడేందుకు మన జీవన విధానంలో మార్పులు అవసరమని వాసన్ డైరెక్టర్ ఎన్వీ రామచంద్రుడు పిలుపునిచ్చారు. ఈ నిర్వహణలో సమాజంలోని ప్రతి ఒక్కరి పాత్ర చాలా కీలకమని ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా..సరైన చోట వేయాలని అన్నారు. హుస్సేన్ సాగర్‌లో ఎలా పడితే అలా పడేయడం వల్ల..తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని ఇదే విషయాన్ని ఓ నివేదిక కూడా పేర్కొందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీమా కుమార్, ఐడీఈవో డైరెక్టర్ కనిక కుమార్, రామ్‌కీ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ తోట, గండిపేట వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి శీతల్ పార్మర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు వరంగా మారిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం రైతుబంధు, రైతు రుణమాఫీ అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే, రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అనడానికే ఇదే నిదర్శనమని అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా దూసుకుపోతుందన్నారు. ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. కష్టించి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. అనంతరం ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి విశేష కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు, ఎంపీలు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ మల్లురవి, కాంగ్రెస్ నాయకులు శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మెట్టు సాయికుమార్‌ను సత్కరించిన మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు

రూ.8 లక్షల విలువైన చీరల చోరీ

బంజారాహిల్స్: చీరల కొనుగోలు కోసం వచ్చినట్లు నమ్మించి ఖరీదైన చీరలతో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో వ్యాపార దిగ్గజం ముఖేష్ అంబానీకి చెందిన స్వదేశీ షోరూం ఉంది. ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం ముగ్గురు మహిళలతో పాటు ఒక ట్రాన్స్‌జెండర్ స్వదేశ్ షోరూంలోకి వచ్చి చీరలు కావాలంటూ అడిగారు. డిపార్ట్‌మెంట్ మేనేజర్ ప్రవీణ్ అక్కడి సేల్స్ గర్ల్స్‌తో కలిసి వీరికి చీరలు చూపించసాగాడు. సేల్స్‌గర్ల్స్ కళ్లు గప్పి నాలుగు ఖరీదైన చీరలతో మహిళలు అక్కడి నుంచి ఉడాయించారు. కొద్దిసేపటి తర్వాత చీరలు లెక్కబెట్టగా అందులో నాలుగు చీరలు కనిపించలేదు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా.. చీరల కోసం వచ్చిన నలుగురు వాటిని చాకచక్యంగా దొంగిలించినట్లుగా గుర్తించారు. చోరీకి గురైన చీరల్లో ఒక్కొక్కటి రూ.1.62 లక్షలు, రూ.1.72 లక్షలు, రూ.2.92 లక్షలు, రూ.1.72 లక్షల విలువైనవి ఉన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం..ఆరాంఘర్ చౌరస్తా క్లాసిక్ గార్డెన్ వద్ద గుర్తు తెలియని 35 సంవత్సరాల వ్యక్తి శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాన్ని ఆపకుండా అలాగే వాహనదారుడు సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఒంటిపై నలుపు రంగు టీ షర్ట్, గ్రే కలర్ ప్యాంట్ ఉందని.. ఇతర ఆధారాలు ఏమీ లభించలేదన్నారు. కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులను గానీ..ఉస్మానియా మార్చురీ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా పోలీసులు పనిచేయాలి

రాచకొండ సీపీ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కోర్టు మానిటరింగ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, సమన్లు, వారెంట్ల జారీ సిబ్బందితో సీపీ సుధీర్ బాబు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కమిషనరేట్ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ నేరస్తులు తప్పించుకోవడానికి వీలులేని విధంగా అందరూ సమర్థవంతంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. త్వరితగతిన కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని, నేరస్తులకు గరిష్ఠ శిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై కఠిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పహాడీ షరీఫ్ వివాహిత హత్య కేసుతో పాటు ఘట్ కేసర్ చిన్నారి అపహరణ కేసులో సమర్థవంతంగా విధులు నిర్వర్తించి నిందితులకు కఠిన శిక్ష పడేలా పనిచేసిన అప్పటి స్టేషన్ విచారణాధికారి ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, అప్పటి ఘట్ కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కమిషనర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి దేశం చూపించాలని..

- కారును దొంగిలించిన యువకులు
- సరిహద్దులు దాటుతుండగా రాజస్థాన్‌లో పట్టుకున్న పోలీసులు



రోహిత్



చాకలి హేమంత్

ఫిలింనగర్: ప్రేమికురాలు లేదా స్నేహితురాలు అన్నాక కార్లలో తిప్పాలి. జల్సాలు అన్నాక దేశమంతా చుట్టేస్తూ విందు వినోదాలతో గడపాలి. మరి వీటన్నింటికి డబ్బులు కావాలి కదా.. ఏం చేయాలో పాలుపోక..కష్టపడి సంపాదించలేక..దొంగ దారి పట్టారు ఇద్దరు యువకులు. పక్కా పథకం వేసి ఓ కారు దొంగిలించి స్నేహితురాలైన యువతిని ఎక్కించుకొని రాష్ట్రాల సరిహద్దులు దాటుతూ రాజస్థాన్ వరకు వెళ్లారు. అక్కడ స్నేహితురాలితో చెట్టాపట్టాలు వేసుకొని విందు వినోదాల్లో మునిగితేలుతుండగా ఫిలింనగర్ పోలీసులు కారుదగ్గరికి వెళ్లి ‘యూ ఆర్ అండర్ అరెస్ట్’ అనేసరికి షాక్‌కు గురయ్యారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 16వ తేదీన అంగ్రీజ్ రోహిత్ (23), చాకలి హేమంత్ (23) ఇద్దరూ కలిసి ఓయూ కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న వెర్నా కారుకు సంబంధించిన కారు తాళం చెవులను ఆ ఇంటి యజమానికి తెలియకుండా చోరీ చేశారు. అవకాశం రాగానే కారు తీసుకొని తమ స్నేహితురాలిని ఎక్కించుకొని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు రంగంలోకి దిగి కారుకోసం గాలింపు చేపట్టారు. ఈ ఇద్దరు యువకులు కారును దొంగిలించి భోపాల్‌దాటి రాజస్థాన్‌లోకి ప్రవేశిస్తుండగా పక్కా సమాచారం అందుకున్న క్రైం ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్ జనార్దన్‌నాయక్ తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భోపాల్ క్రైం పోలీసులను అప్రమత్తం చేశారు. అక్కడి పోలీసులు కారును గమనించి అదుపులోకి తీసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫిలింనగర్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి కారు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిని విచారించగా దొంగిలించిన కారులో దేశంలోని వివిధ నగరాలను చుట్టేసి చివరగా రాజస్థాన్‌లోని జైపూర్‌లో విక్రయించి ఆ డబ్బుతో జల్సా చేయాలని పథకం వేసుకున్నామని వెల్లడించారు. ఈ కారు విలువ రూ.16 లక్షలు ఉంటుంది. కారుతో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతికత సాయంతో పక్కా ప్రణాళికతో రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్న కారును గుర్తించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఇతర సిబ్బందిని ఈ సందర్భంగా డీఐ జయరాం అభినందించారు. కారును పట్టుకోవడంలో వీరు చూపిన ప్రతిభను కొనియాడారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న విజయారెడ్డి

ఫిలింనగర్: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీయేటా వందలాది మంది విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని పీజేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పి. విజయారెడ్డి అన్నారు. శనివారం విజయారెడ్డి జూబ్లీహిల్స్‌డివిజన్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు మోహన్ యాదవ్, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో వజ్రాభరణాల ప్రదర్శన



నూతన కలెక్షన్స్‌ను ఆవిష్కరిస్తున్న మోడల్స్

పంజగుట్ట: సోమాజిగూడలోని మలబార్ డైమండ్స్ అండ్ జ్యువెల్లర్స్ స్టోర్‌లో శనివారం మైన్ డైమండ్స్ షోను పలువురు మోడల్స్ ప్రారంభించారు. ఈ డైమండ్ షో ఎగ్జిబిషన్ ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగుతుందని జోనల్ హెడ్ మహ్మద్ షరీఫ్, షోరూం హెడ్ రజయ్ తెలిపారు. ఈ డైమండ్ వజ్రాభరణాల ఎగ్జిబిషన్‌లో వివాహ వేడుకల ప్రత్యేక వజ్రాభరణాలతో పాటు లైట్ వెయిట్, ప్లాటినం ఆభరణాలను సైతం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

భారీ వర్షానికి నేలకూలిన చెట్టు



ఫిలింనగర్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ఫిలింనగర్‌లోని అపోలో మెడికల్ కాలేజీ ఆస్పత్రి గేటు ముందు శనివారం తెల్లవారుజామున ఓ చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో వాహనాల రాకపోకలతో పాటు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్ళి నేలకూలిన చెట్టును కట్ చేసి రెండు గంటల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: పబ్‌లో విందు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఓ కారు ప్రమాదానికి గురైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మాసబ్‌ట్యాంక్‌కు చెందిన ఎస్‌కె. హుస్సేన్ (30) ఫిట్‌నెస్ ట్రైనర్ ఎస్.కె హీనాతో కలసి శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని గ్రీస్ మంకీ నైట్ పబ్‌కు వెళ్ళాడు. అర్ధరాత్రి 1.15 గంటల సమయంలో తన మహీంద్ర థార్ కారు (టీఎస్ 09 ఎఫ్‌టి 5995)లో బంజారాహిల్స్ రోడ్ నెం. 12 నుంచి వెళ్తుండగా కమాండ్ కంట్రోల్ ముందు అదుపు తప్పి వేగంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా స్పీడ్‌కు డివైడర్ దిమ్మెలు కూడా దెబ్బతిన్నాయి. కానిస్టేబుల్ నజీర్ అహ్మద్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోజంతా ముసురే..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు కూడా ఎడతెరపి లేకుండా వాన కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద నీరు ఎక్కువ సేపు రోడ్లపై తిష్ట వేయకుండా జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ బృందాలతో పాటు డీఆర్‌ఎఫ్, ట్రాఫిక్ పోలీసులు కృషి చేశారు. నిమ్స్ ఆస్పత్రి ముందు భారీగా నీళ్ళు నిలిచిపోవడంతో ఆస్పత్రి రోగులతో పాటు సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – బంజారాహిల్స్





ఆక్రమణలను ఉపేక్షించం

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా కాపాడతామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్ సారథినగర్ సొసైటీలో వివాదంగా మారిన ప్లాట్ నెం30, 31 మధ్య ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాపై రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించి పలు అంశాలపై ఆరా తీశారు. ప్లాట్ నెం 30కు చెందిన వ్యక్తులు ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయలోపం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఇక్కడ ఒకప్పుడి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏమైందని, ఎందుకు కాలయాపన చేస్తున్నారని అడిగారు. ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండాలని, కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలని లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి



రహమత్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ సూచించారు. డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను శనివారం అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు నెలలపాటు నగరంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రధానంగా తమ పరిసరాలను అపరిశుభ్రంగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్, ఎంటమాలజీ , ఇంజినీరింగ్, జలమండలి శాఖలకు చెందిన సిబ్బంది సమన్వయంతో సేవలందించాలని పేర్కొన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని కోరారు. పలు బస్తీల్లోని ప్రజా సమస్యలను అక్కడి నుంచే వాకిటాకీలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు వివరించారు. జలమండలి మేనేజర్ శ్రీనివాస్, ఏఈ భరత్, ఎస్ఎఫ్‌లతో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించడం లేదని యువతిపై దాడి

వెంగళరావునగర్: ప్రేమను అంగీకరించలేదని యువతిపై దాడి చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే యువతికి అదే ప్రాంతానికి చెందిన సిద్ధార్థ అనే యువకుడికి 2022లో పరిచయం అయింది. ఇరువురూ కొంత కాలం ప్రేమించుకున్నారు. విషయం ఇరుపెద్దలకు తెలియడంతో వారు వ్యతిరేకించారు. దీంతో సిద్ధార్థ నుంచి యువతి దూరంగా ఉంటుంది. తనను ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరించడంతో యువతి మే నెలలో పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు అయింది. పీఎస్‌కు వెళ్ళి వచ్చిన తర్వాత సిద్ధార్థ జూన్‌లో ఇరువురి ఫొటోలను ఇన్‌స్టాగాంలో పెట్టి వేధించడం ప్రారంభించాడు. ఫొటోలు తొలగించాలని ఆమె పలు మార్లు ఫోన్‌లో అతనిని వేడుకుంది. ఇటీవల ఆ యువతి ఇంటికి వెళుతుండగా సిద్ధార్థ అడ్డగించి మీ అన్నకు ఎందుకు చెప్పావంటూ ఆమెపై దాడి చేశారు. దీంతో ఆమె శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రహమత్‌నగర్:వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే అభివృద్ధి సాధిస్తారని కార్పొరేటర్లు సూచించారు. రహమత్‌నగర్‌లో శుక్రవారం రాత్రి అమర్ పాయింట్ హోటల్‌ను కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, వనం సంగీతలు పునః ప్రారంభించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్, డైమండ్ హోటల్ నిర్వాహకుడు సయ్యద్ అన్వర్ పహిల్వాన్, సయ్యద్ వాజీద్ పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లను నిరోధించాలని వినతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల ముందు అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్బీటీనగర్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గత కొన్ని నెలలుగా ఇక్కడ కొంత మంది వ్యక్తులు అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నారని దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగడంతోపాటు, వాహనాల కింద బురద, చెత్తా చెదారం పేరుకుపోయి స్థానికంగా అపరిశుభ్ర వాతావరణంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని తెలిపారు. పార్కింగ్ చేయవద్దని చెబితే స్థానికులపై వాహనదారులు తిరగబడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఏసీపీ ఎన్బీటీనగర్‌కు తాను వచ్చి పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



ట్రాఫిక్ ఏసీపీ హరి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున అసోసియేషన్ ప్రతినిధులు

కస్టమ్స్ అధికారుల పేరుతో మోసం

డ్రగ్స్ పార్సిల్ చేస్తున్నారంటూ రూ.29 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: కస్టమ్స్ అధికారుల పేరుతో కాల్ చేసి విదేశాలకు డ్రగ్స్ పార్సిల్ చేస్తున్నారంటూ ఓ ప్రభుత్వ మహిళ ఉద్యోగినిని సైబర్ నేరగాళ్ల మోసం చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహిళ ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంది. ఆమెకు కస్టమ్స్ శాఖ నుంచి కాల్ వచ్చింది. ఢిల్లీ నుంచి మలేషియాకు ఆమె ఆధార్ నంబర్‌తో 140గ్రాముల డ్రగ్స్‌తో పాటు 16 నకిలీ పాస్‌పోర్టులు, 58 ఏటిఎం కార్డులు తమ తనిఖీలలో గుర్తించామన్నారు. ఆమెను తదుపరి విచారణ కోసం కస్టమ్స్ అధికారుల ముందు హాజరు కావడానికి వెంటనే ఢిల్లీ రావాలని సైబర్ నేరగాళ్ల అధికారుల పేరుతో చెప్పారు. అనంతరం బాధితురాలికి వసంత్ కుంజ్ పోలీస్‌స్టేషన్ నుంచి కాల్ వచ్చింది. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా రిమోట్ విచారణ చేస్తామని చెప్పారు. సీబీఐ స్పెషల్ అధికారిగా చెబుతూ నాలుగు రోజులు ఆమెను విచారించినట్లు నమ్మించాడు. తన బ్యాంక్ ఖాతా ద్వారా మనీలాండరింగ్ కేసు నమోదయిందని భయపెట్టారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం తన బ్యాంక్ ఖాతాలోని డబ్బును వెరిఫై చేసి తిరిగి చెల్లిస్తామని నమ్మించి, ఆమె ఖాతాలోని మొత్తం రూ.29 లక్షలు బదిలీ చేయించుకుని మోసం చేశారు. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని బాధిత మహిళ ఉద్యోగిని నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

మధురానగర్ కానిస్టేబుల్ సస్పెండ్

వెంగళరావునగర్: మధురానగర్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే నవీన్‌కుమార్‌ను నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గత నెలరోజుల కిందట రహమత్‌నగర్ గాంధీబొమ్మ సమీపంలో ఒక వ్యక్తి తన స్నేహితునితో కలసి కారులో కూర్చుని మద్యం సేవిస్తూ ఉన్నాడు. దీనిని గమనించిన కానిస్టేబుల్ నవీన్‌కుమార్ కారు వద్దకు వెళ్ళి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించకూడదని చెప్పడంతో కారులో ఉన్న వ్యక్తి మద్యం మత్తులో కానిస్టేబుల్‌ను దూషించడంతోపాటు ఇద్దరి మధ్య తోపులాట జరగటంతో కారులోని వ్యక్తి కిందపడగా అతని చెయ్యి విరిగింది. ఆ తరువాత కేసు నమోదు చేయకుండా అతని వద్ద వెయ్యి రూపాయలు తీసుకుని వదిలేశాడు. విషయాన్ని బాధితుడు నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం సదరు కానిస్టేబుల్‌ను మూడు రోజుల కిందట సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'నిమ్స్‌మే'లో ఉచిత శిక్షణ

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణా సంస్థలో యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అసోసియేట్ ఫ్యాకల్టీ మెంబర్ వి. స్వప్న తెలియజేశారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు నిమ్స్‌మే ఈ ట్రైనింగ్ ఏర్పాటు చేసిందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఏదైనా చదివి వయసు 18 నుంచి 35 ఏళ్ళలోపు ఉన్న యువతీ యువకులు ట్రైనింగ్‌కు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు తమ ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఐడీ ప్రూఫ్, ధృవీకరణ పత్రాలను నిమ్స్‌మే క్యాంపస్‌లో ఇవ్వాలని సూచించారు. పూర్తి వివరాలకు 040–2363 3244/ 217/218 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

యువతి అదృశ్యం

బంజారాహిల్స్: తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువతి అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలో నివసించే మాలన్‌బీ (18) ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. ఇంటర్ ఎక్కడ, ఏ కళాశాలలో చేరుతావంటూ ప్రశ్నించగా ఆమె సమాధానం చెప్పలేదు. దీంతో తండ్రి సర్వర్ కోప్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన మాలన్‌బీ అదే రోజు అర్ధరాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో తన కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ సతీష్‌కుమార్ గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 8712661161 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

పాత నేరస్తుడి రిమాండ్



నిందితుడు మహ్మద్ ఆమెర్

ఫిలింనగర్: బంగారు ఆభరణాలతో పాటు బైక్‌లు దొంగిలిస్తున్న పాత నేరస్తుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెహిదీపట్నం జిర్రాకు చెందిన మహ్మద్ ఆమెర్ (19) జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడు. గత నెల 24వ తేదీన సమీపంలోని అక్షా మసీదు వద్ద ఓ బ్యాగు దొంగతనంకు గురైంది. అందులో బంగారు నెక్లెస్ తోపాటు ల్యాప్‌ట్యాప్ కూడా ఉండటంతో ఫిర్యాదు అందుకున్న ఫిలింనగర్ పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్‌తో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకోగా పాత నేరస్తుడు మహ్మద్ ఆమెర్‌గా తేలింది. గతంలో ఫిలింనగర్, చందానగర్, హుమాయిన్‌నగర్ ఎలలీస్ స్టేషన్ల పరిధిలో కూడా దొంగతనాలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడి నుంచి గోల్డ్ నెక్లెస్, బైక్, ల్యాప్‌టాప్, ట్యాబ్ స్వాదీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ డీఐ ఎం. జయరాం నేతృత్వంలో డీఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

వెంగళరావునగర్ : నిబంధనలకు వ్యతిరేకంగా గ్యాస్ సిలిండర్లు విక్రయిన్న వ్యక్తులను మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా సిలిండర్లు విక్రయిస్తున్నారని, గ్యాస్ రీఫిల్ చేస్తున్నారని మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పీఎస్ పరిధిలో నిఘా వేశారు. ఈ క్రమంలో శనివారం యూసుఫ్‌గూడ సమీపంలోని రహమత్‌నగర్ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు అనుమానంగా సంచరించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అనుమతి లేకుండా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నట్టుగా అంగీకరించారు. దీంతో సయ్యద్ షబ్బీర్, షేక్ అష్రాఫ్, షేక్ అల్తాఫ్‌ల వద్ద నుంచి 12 ఖాళీ. 8 ఫుల్ చిన్న సిలిండర్లు, ఒక హెచ్‌పీ గ్యాస్ సిలిండర్, రీఫిల్ కిట్, వేయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రసాభాసగా బీజేపీ ఎండోమెంట్ సెల్ సమావేశం

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణుల సమస్యలపై తెలంగాణ ఎండోమెంట్ బీజేపీ సెల్ నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ స్థితిగతులపై, అర్చక, పురోహిత, ధూపదీప నైవేద్య పథకం సమస్యలు, బ్రాహ్మణుల రాజకీయ భవిష్యత్తుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, మహిళా విభాగం నాయకురాలు గీతామూర్తి, మాధవిలత, పలువురు బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అన్ని బ్రాహ్మణుల సంఘాల నాయకులకు సమావేశంలో సముచితం కల్పించ లేదని అఖిల భారత బ్రాహ్మణ అర్చక సేవా సమాఖ్య అధ్యక్షుడు రాహుల్ దేశ్ పాండే తమ ప్రతినిధులతో కలసి సమావేశంలో ప్రశ్నించారు. దీంతో నిర్వాహకులు ఆయన్ను అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. దీంతో సమావేశంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం , తోపులాట జరగడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత జరిగింది. ఈ సమావేశంలో సెల్ నాయకులు నిరంజన్ దేశాయ్, నారాయణం చక్రవర్తుల, చింతపల్లి ఫణిభూషణ్,ఐవటూరి కైలాష్, వల్లీనాథ్, నగేష్, రాంబాబు, అర్పిత, కప్పర ప్రసాద్, రవీందర్, బ్రాహ్మణ సంఘాల నాయకులు మంగపతిరావు, వెల్లాల రామ్మోహన్, భీంసేన్ మూర్తి, దర్శనం శర్మ, నందిరాజు లక్ష్మీనారాయణ, కలగా రాఘవ, మంగు రాఘవరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

వెంగళరావునగర్: పర్యావరణంలో ఏర్పడుతున్న సమతుల్యం లోపం కారణంగా అనేక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీజీఎస్‌పి డీఐజీ సిద్ధిఖి చెప్పారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్‌పి ఫస్ట్ బెటాలియన్‌లో శనివారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధిఖీ మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరిలో దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. మన దేశాన్ని సంరక్షించుకోవడంతో పాటుగా అడవులను రక్షించాలన్నారు. అనంతరం ఫస్ట్ బెటాలియన్‌లోని పలు ప్రాంతాల్లో సిద్ధిఖీతో పాటుగా బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ, బ్యాంక్ ఆఫ్ బరోడా జీఎం రితేష్ కుమార్, డీజీఎంలు సుధాకర్, ఆదిత్య, ప్రసాద్, అడిషనల్ కమాండెంట్ నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ కెవివి ప్రసాద్, అప్పారావు, నరసింహారావు, ఆర్‌ఐలు ధర్మారావు, జాఫర్, సాంబయ్య, శంకర్, రాజేష్, రమేష్, వెంకన్న, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీల అవకతవకలపై నిరసన గళం

బంజారాహిల్స్: గురుకుల లెక్చరర్ల బదిలీల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అన్యాయం జరుగుతున్నదంటూ గురుకుల లెక్చరర్లు ఆందోళన చేశారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 10లోని బంజారాభవన్‌లో శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గురుకుల లెక్చరర్ల బదిలీల ప్రక్రియ జరిగింది. అయితే 317 జీవో డిస్ లొకేషన్ ముసుగులో సాధారణ ట్రాన్స్‌ఫర్లు నిర్వహిస్తున్నారని టీచర్లు అసహనం వ్యక్తం చేశారు. యూనియన్ లీడర్లు బదిలీల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని ప్రశ్నించిన మహిళలను కూడా బెదిరించారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డిస్ లొకేటెడ్ అభ్యర్థులు వెబ్ ఆప్షన్ పెట్టుకున్న తర్వాత కూడా వాటిని క్యాన్సిల్ చేసి వారిని వేరే జోన్‌లోకి మారుస్తున్నట్లు ఉదయం 8 గంటలకు సమాచారం ఇచ్చి సాయంత్రం వరకు బదిలీల నిర్వహణ చేపట్టారని ఆందోళన వ్యక్తం చేశారు.

సాక్షి ఆదివారం । 21 । జూలై । 2024

నేడు అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు



అమ్మవారి ఘటానికి పూలతో స్వాగతం పలుకుతూ..

చార్మినార్: పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు ఆదివారం కన్నుల పండువగా జరగనుంది. ఈ మేరకు భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆషాఢమాసం బోనాల జాతరలో భాగంగా ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో నిర్వహించే బోనాల సమర్పణ రోజే.. పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శాలిబండలోని కాశీవిశ్వనాథ ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపులో పాల్గొనే అమ్మవారి ఘటాలు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటాయి.

నేడు నీలం రాజశేఖర్‌రెడ్డి స్మారక ఉపన్యాసం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖరరెడ్డి పరిశోధనా కేంద్రంలోని ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో నీలం రాజశేఖర్‌రెడ్డి స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తారు. ఆర్థికవేత్త, రాజకీయ విశ్లేషకులు, వ్యాఖ్యాత డాక్టర్ పరకాల ప్రభాకర్, విశ్రాంత భారత రాయబారి, ఎస్ఆర్ఆర్‌సీ డైరెక్టర్ డాక్టర్ టి.సురేష్ బాబు హాజరుకానున్నారు. ఈ ఉపన్యాస కార్యక్రమం ఆర్థిక, రాజకీయ పార్శ్వాలపై జరగనుందని సీఆర్ ఫౌండేషన్ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో షేక్ సాజీదాకు రెండు పతకాలు



పతకాలతో షేక్ సాజీదా

అబిడ్స్: పాన్ అమెరికన్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ గేమ్స్–2024 అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో నగరానికి చెందిన షేక్ సాజీదా గోల్డ్, బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. అమెరికాలోని క్లీవ్ ల్యాండ్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో షేక్ సాజీదా 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ మహిళా విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. 100 మీటర్ల ఫ్రీస్టైల్ మహిళా విభాగంలో బ్రౌంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా షేక్ సాజీదా మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రెండు పతకాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.ఉమేష్, హెడ్ కోచ్ జాన్ సిద్ధిఖీ, నిర్వాహకులు డాక్టర్ సంతోష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు కళాశాలలు



సాంకేతిక విద్యా కమిషన్ దేవసేనకు ఫిర్యాదు చేస్తూ..

ఉస్మానియా యూనివర్సిటీ: అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలపై విద్యార్థి నాయకులు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేనకు శనివారం ఫిర్యాదు చేశారు. రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు అధిక ఫీజులు, ఇతర బ్రాంచ్‌లను విస్మరించి కేవలం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సీఎస్ఈ) కోర్సు సెక్షన్లను పెంచడం, అటానమస్ పేరుతో ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ ఫీజులు, హాస్టల్ వసతికి విద్యార్థుల నుంచి రూ.2 లక్షలు దండుకుంటున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆజాద్, చిరంజీవి యాదవ్, రవినాయక్, యాదగిరి పాల్గొన్నారు.

హైదరాబాద్ డీఈఓగా వాణి నియామకం



బాధ్యతలు చేపట్టిన ఎ.వాణి

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్(డీఈఓ)గా అమర్లపురి వాణి నియమితులయ్యారు. సంగారెడ్డి ఉపాధి కల్పన కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న నందిగామ మైత్రిప్రియ మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆమె మాట్లాడుతూ.. టెన్త్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలన్నారు. తరచూ జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగాలు, ఉపాధి బాట చూపించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలు కావాలి

నాంపల్లి: ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎంపీ మల్లు రవి పిలుపునిచ్చారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో జరిగిన సమావేశానికి హాజరైన ఆయన ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీల రుణాలు సకాలంలో అందడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ఆగిన సబ్సిడీలను కూడా అందేలా చూస్తానని చెప్పారు. పారిశ్రామిక, వ్యాపార సేవా రంగాల్లో ఉన్న వారిని సమీకరించి వారి వారి వ్యాపార అభివృద్ధికి కొత్త అవకాశాలపై అవగాహన కల్పించడం సంతోషించే విషయం అన్నారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లబాబు మాట్లాడుతూ.. కొత్త అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు కె.సహదేవులు, పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



ఈవీ.. హవా!

గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల దూకుడు

రోడ్డెక్కుతున్న కార్లు, క్యాబ్‌లు, ఆటోలు • చార్జింగ్ కేంద్రాలు పెరిగితే ఈవీ విప్లవమే

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) దూకుడు పెరిగింది. ఏడాదిలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య రెట్టింపైంది. నాణ్యమైన బ్యాటరీతో కూడిన వాహనాలు అందుబాటులోకి రావడంతో కొత్తగా వాహనాలు కొనుగోలు చేసే వినియోగదారులంతా ఈవీల వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది కాలంలో ద్విచక్ర వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. రవాణాశాఖ లెక్కల ప్రకారం గతేడాది వరకు సుమారు 50 వేల బైక్‌లు నమోదు కాగా, ఇప్పుడు వీటి సంఖ్య లక్ష దాటింది. నియంత్రణ లేని ఇంధన ధరలు, తప్పనిసరిగా మారిన సొంత వాహనాల వినియోగం వంటి కారణాల దృష్ట్యా మధ్యతరగతి, వేతన జీవులు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలనే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వివిధ రకాల బ్రాండెడ్ వాహనాలు 80 నుంచి 100 కిలోమీటర్ల వరకూ చార్జింగ్ సదుపాయాన్ని కలిగి ఉంటున్నాయి. ఒకప్పటి కంటే ఇప్పుడు బ్యాటరీల సామర్థ్యం గణనీయంగా పెరిగింది. దీంతో చాలా మంది ఈవీలనే కొనుగోలు చేస్తున్నారు. పెట్రోల్ బండ్ల కంటే ధర కొంచెం ఎక్కువే అయినా రోజువారీ పెట్రోల్ వినియోగానికయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకొని ఈవీలను ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో గత రెండేళ్లుగా నగరంలో ఈ వాహనాల వినియోగం పెరిగింది. ఇప్పుడు రవాణా రంగంలో కూడా ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ఆర్టీసీ కొంతకాలంగా ఎలక్ట్రిక్ బస్సులనే అందుబాటులోకి తెస్తోంది. ఆటోలు, క్యాబ్‌లు, సరుకు రవాణా వాహనాలు కూడా రోడ్లపైకి రావడం గమనార్హం.

కలిసొచ్చిన పన్ను రాయితీ..

పర్యావరణహిత ఈవీలను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వ హయాంలోనే బైక్‌లు, కార్లకు జీవితకాలం పన్ను నుంచి మినహాయింపునిచ్చారు. దీంతో చాలామంది వీటి కొనుగోలుకు ముందుకొచ్చారు. గతేడాది వరకు ఈ వాహనాలపై దాదాపు రూ.250 కోట్లకు పైగా పన్ను రాయితీ కల్పించినట్లు అంచనా. ప్రస్తుతం కార్లను రాయితీ నుంచి మినహాయించినా ద్విచక్ర వాహనాలకు మాత్రం వర్తించనుంది. మరో ఏడాది వరకు కొనుగోలుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈవీల వినియోగం మరింత పెరిగితే ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు ప్రస్తుతం డిమాండ్ మేరకు చార్జింగ్ కేంద్రాలు లేకపోవడంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. ఇంటి వద్ద చార్జింగ్ చేసుకొని బయలుదేరితే తిరిగి ఇల్లు చేరే వరకు పొదుపు చేయాల్సి వస్తోంది. దీంతో విస్తృతంగా తిరగాల్సిన వాళ్లు వెనుకంజ వేస్తున్నారు.

నెల రోజులు వెయిటింగ్..

ప్రస్తుతం డిమాండ్ మేరకు ద్విచక్ర వాహనాలు లభించడం లేదు. కొన్ని రకాల బ్రాండ్‌లకు చెందిన వాహనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని నెల నుంచి 2 నెలల పాటు ఎదురు చూడాల్సివస్తోంది. పెట్రోల్ వాహనాల కంటే ధర కొద్దిగా ఎక్కువే అయినా ఇంధన భారాన్ని దృష్టిలో ఉంచుకొని చాలా మంది ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఎదురు చూస్తున్నారు.

గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు	
కేటగిరీ	సంఖ్య
ద్విచక్ర వాహనాలు	1,16,922
కార్లు	8,000
క్యాబ్‌లు	2,000
ఆటో రిక్షాలు	2,532
గూడ్స్ వాహనాలు	4,146
మొత్తం వాహనాలు :	1,33,600

టాప్‌ప్లేస్‌లో.. బైక్‌లే..

మొదట్లో చాలా మంది ఎలక్ట్రిక్ వాహనాల పట్ల విముఖత చూపారు. అప్పట్లో వీటిలో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నాణ్యత లేని బ్యాటరీలతో ప్రమాదాలు జరిగాయి. దీంతో వాహనతయారీ సంస్థలు బ్యాటరీల నాణ్యతపై ప్రధానంగా దృష్టి సారించాయి. 2022 నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల వాహనాలు కలిపి 1.33 లక్షల వాహనాలు నమోదయ్యాయి. ఈ ఏడాది కాలంలోనే ఎక్కువ సంఖ్యలో రోడ్డెక్కినట్లు ఆర్టీఏ అధికారుల అంచనా. వీటిలో ప్రస్తుతం 1,16,922 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. 'మొదట్లో నాణ్యత లేని బ్యాటరీలు త్వరగా వేడెక్కేవి. కానీ గతేడాది నుంచి ఆటోమోటివ్ ఇండియన్ స్టాండర్డ్స్(ఏఐఎస్) ధ్రువీకరించిన ప్రమాణాల మేరకు బ్యాటరీలు వస్తున్నాయి. నాణ్యత బాగా పెరిగింది. బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (బీఎంఎస్)బాగుంది. దీంతో ఈ వాహనాల వినియోగం పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగింది' అని ఆర్టీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

నగరంలో నేడు..

- కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డు–2024 ప్రదానోత్సవ సభ ఉదయం 10.30గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది. కార్టూన్ రంగంలో తనదైన శైలి, ముద్ర వేసిన పి.నర్సిం ఈ అవార్డు అందుకోనున్నారు.
- ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి రచించిన ది పబ్లిక్ ఇన్ పబ్లిక్ హెల్త్ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉదయం 11 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లామకాన్‌లో జరుగుతుంది.
- తెలంగాణ విశ్వ బ్రాహ్మణుల సమస్యలపై ఇందిరాపార్క్‌లోని ధర్నాచౌక్ వద్ద నిర్వహించే ధర్నాలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పాల్గొంటారు.
- శ్రీవైష్ణవి సేవా సంఘం 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవాలను ఉదయం 10.30 గంటలకు మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతాయి. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచార్యులు పర్యవేక్షణలో జరిగే ఈ వేడుకల్లో చినజీయర్‌స్వామి పాల్గొనున్నారు.
- తెలంగాణలో ప్రసిద్ధి చెందిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో భాగంగా ఉదయం 3.30గంటలకు తొలిపూజ జరుగుతుంది. ఉదయం 10.30గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకోనున్నారు.
- సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా అమ్మవారిని ఉదయం 8.30 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకుంటారు.

టాప్ అనే ట్రాప్‌లో పడొద్దు

• వెబ్‌స్టర్ యూనివర్సిటీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్యామ్

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో విద్యాభ్యాసం కోసం వెళ్తున్న విద్యార్థులు టాప్ యూనివర్సిటీలు అనే ట్రాప్‌లో పడొద్దని వెబ్‌స్టర్ యూనివర్సిటీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ అన్నారు. ఎడ్యుకేషన్ యూఎస్ఏ, వెబ్‌స్టర్, ఇన్‌యూనీ మూడు యూనివర్సిటీలు కలిసి శనివారం ఓ హోటల్‌లో విద్యార్థుల ప్రీ డిపార్చర్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు విద్యార్థులు ఉన్నత చదువుల కోసం యూఎస్‌ను ఎంపిక చేసుకుంటున్నారన్నారు. విద్యార్థికి వీసా వచ్చిన నాటి నుంచి పోర్ట్ ఆఫ్ ఎంట్రీ వరకు అన్ని రకాలుగా వెబ్‌స్టర్ యూనివర్సిటీ ప్రతినిధులు గైడ్ చేస్తారన్నారు. డాక్యుమెంట్స్ ఎంట్రీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారన్నారు. ఈ మధ్య వీసా తిరస్కరణ సమస్య తరచూ వింటున్నాం. దీని వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెబ్‌స్టర్ వర్సిటీ మూడు క్యాంపస్‌లలో ఇంటర్నేషనల్ విద్యార్థులను తీసుకుంటున్నారు. 140 దేశాలకు చెందిన 3,500 మంది విద్యార్థులు తమ యూనివర్సిటీలో చదువుతున్నారు. అందులో తెలుగు రాష్ట్రాల వారు సుమారు 1,100 నుంచి 1,200 మంది ఉంటారని తెలిపారు. ప్రస్తుతం ఒక్క హైదరాబాద్‌లోనే 300 మంది విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇక్కడి నుంచి వచ్చిన 60 శాతం మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ వస్తాయన్నారు. విద్యార్థి అకాడమిక్స్, క్యాలిబర్ ఆధారంగా స్కాలర్‌షిప్ ఉంటుందని తెలిపారు. స్పోర్ట్స్ కోటా ఉన్న వారికి వంద శాతం స్కాలర్ షిప్ వస్తుందన్నారు.

మడులను తలపించే రోడ్లు.. నాట్లేసి నిరసనలు..



రోడ్డుపై గుంతల్లో వరినాట్లు వేసి నిరసన తెలుపుతూ..

దుండిగల్: ఓ వైపు జోరుగా వర్షాలు కురుస్తున్నాయి.. మడులలో నీళ్లు నిండాయి.. మహిళలు పాటలు పాడుతూ సంతోషంగా వరి నాట్లేస్తున్నారు.. అనుకుంటే బురదలో కాలేసినట్లే.. అక్కడ కనిపిస్తున్నవి వరి మడులు కాదు.. సాక్షాత్తు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో స్థానికులకు ఆగ్రహం వచ్చింది. వెంటనే ఆ బురద నీటిలో వరినాట్లు వేసి వినూత్న నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామంలో రోడ్డు పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. భ్రమరాంబ మల్లికార్జున దేవాలయం నుంచి శంభీపూర్ వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. అదేవిధంగా గ్రామంలోని బొడ్రాయి వద్ద రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడటంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు దుండిగల్ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. గుంతలు పడిన రోడ్లలో వరినాట్లు వేసి శనివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. బీజేపీ జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, బీజేపీ కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నర్సింహచారి, నాయకులు గోనె మల్లారెడ్డి, డి.ప్రభాకర్ రెడ్డి, ఎన్.రామచంద్రరెడ్డి, సత్తిరెడ్డి, సీతారాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యువ నాయకులు కొమ్ము ప్రశాంత్, వీరేష్ కుమార్, దుగురి మహేష్, ప్రవీణ్‌రెడ్డి మహిళలు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల చూపు.. భారత్ వైపు..

జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న జస్టిస్ నర్సింహారెడ్డి

హిమాయత్‌నగర్: భారతదేశం హిందూ సంస్కృతితో సగర్వంగా దేశాభివృద్ధి దిశగా పయనిస్తోందని, ఈ తరుణంలో ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాంగణంలోని సర్దార్ పటేల్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 84వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు, పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థలు కేవలం సిలబస్‌కే పరిమితం కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఎన్‌సీసీ, క్రీడలు తదితర రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు మాట్లాడుతూ ఆశావహ దృక్పథంతో, సమయ స్ఫూర్తితో, సకాల నిర్ణయాలతో విజయాలు సాధించి అత్యున్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి అన్నదానం సుబ్రహ్మణ్యం వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం అనుబంధ విద్యాసంస్థల్లోని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యా బోధనలో ఆదర్శంగా నిలిచిన పలువురు ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల నాట్యకళా ప్రదర్శన అలరించింది.

విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఆ కమిటీ కన్వీనర్ ఎన్.శివాజీ, కో చైర్మన్ పి.అంజయ్య నేతృత్వంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో సమావేశమయ్యారు. విద్యుత్ సంస్థల్లో ఏడేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో సీనియార్టీ ఉన్న ఉద్యోగులు జూనియర్లుగానే రిటైర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సీనియార్టీ ప్రతిపాదికన పదోన్నతులు కల్పించాలని కోరగా, దీనికి సీఎండీ సానుకూలత వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. సీఎండీతో సమావేశమైన వారిలో రామేశ్వర్‌శెట్టి, నాజర్ షరీఫ్, కరెంట్‌రావు, పీఎంరాజు, రామకృష్ణారెడ్డి, కె.వెంకటేశ్వర్లు, రాజేష్, పూర్ణ, లక్ష్మయ్య, అక్బర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా సిబ్బంది అలర్ట్

వాటర్ లాగింగ్ పాయింట్లు క్లియర్



చాంద్రాయణ గుట్ట ప్రాంతంలో వర్షపు నీటిని మళ్లిస్తున్న సిబ్బంది

లక్డీకాపూల్: నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా బల్దియా అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తమయ్యారు. పౌరులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, స్టాటిక్ బృందాలు రంగంలోకి దిగి నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. ఆయా అధికారుల పర్యవేక్షణ నిరంతరంగా కొనసాగుతోంది. టాపిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. వర్షాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని ఎప్పటి కప్పుడు తొలగించేందుకు 238 స్టాటిక్, 154 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. వీటికి తోడు హైడ్రా ద్వారా 30, సీఆర్ఎంపీ ద్వారా 29 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం క్షేత్ర స్థాయిలో వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నాయి.

ప్రతి కంపెనీకి ప్రధాన మూలం హెచ్ఆర్ వ్యవస్థ

తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్



ఐ లవ్ హెచ్ఆర్ అవార్డ్స్ కాన్‌క్లేవ్‌లో జయేష్‌రంజన్

మాదాపూర్: ప్రతి కంపెనీకి ప్రధాన మూలం హెచ్ఆర్ వ్యవస్థ అని తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ తెలిపారు. మాదాపూర్‌లోని ఇస్తా కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన ఐ లవ్ హెచ్ఆర్ అవార్డ్స్ కాన్‌క్లేవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పనిఒత్తిడిలో బిజీ జీవితం గడుపుతారని తెలిపారు. ఇలాంటి అవార్డుల కార్యక్రమాలు మరింత ఉత్సాహం నింపుతాయన్నారు. ఉన్నతికి సహకరించినప్పుడే ఏ కంపెనీ అయినా ముందుకు సాగుతుందన్నారు. ఐకాన్ వ్యవస్థాపకుడు క్రిష్ చితలూరి మాట్లాడుతూ ప్రతిభ అభివృద్ధి, హెచ్ఆర్ పరిశ్రమలోని సవాళ్లు, ఆరోగ్యం, వైవిధ్యం, హెచ్ఆర్ నాయకత్వం, హెచ్ఆర్ టెక్నాలజీ పరిమాణంతో సహ ప్యానల్ చర్చలను, ప్రదర్శనలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె.ఎ.చౌదరి, బీజేపీ జాతీయ నాయకుడు కరుణగోపాల్, నలంద విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ సునైనాసింగ్, అసోచామ్ కర్ణాటక చైర్మన్ డాక్టర్ మీరా వెంకట్, యుఈటీ సీఈఓ ప్రసాద్ మావుడూరి, గ్లోబల్ హెడ్ పీపుల్ ఆపరేషన్స్ అరవింద్ మాథూర్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కె.సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఆర్డర్‌తో ఇబ్బందులు

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల్లో 25 ఏళ్లుగా (టర్నీకీ పద్ధతిలో) పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టర్లకు వెండర్ రిజిస్ట్రేషన్ విధానం కొత్త సమస్యలు సృష్టిస్తోందని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సీఎండీ ముషారఫ్ ఫారూఖీని కలిసి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. మొన్నటి వరకు ఎల్సీల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోగా, ప్రస్తుతం ఈ వెండర్ రిజిస్ట్రేషన్ విధానంతో కొత్త తలనొప్పులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎండీని కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి ఎస్.నాగయ్య, సలహాదారు మహారాజు, సంయుక్త కార్యదర్శి జి.సత్యనారాయణ ఉన్నారు.

సాధన స్రవంతి గ్రంథావిష్కరణ



సాధన స్రవంతి గ్రంథావిష్కరణలో రామలింగేశ్వరరావు

చిక్కడపల్లి: ఎస్ఎస్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో గరికపాటి వెంకట ప్రభాకర్ రచించిన సాధన స్రవంతి గ్రంథావిష్కరణ త్యాగరాయ గానసభలో శనివారం రాత్రి జరిగింది. ప్రముఖ సినీగీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభాకర్ రచించిన గ్రంథం నేటి సంగీత ప్రియులను ఆకట్టుకునేలా ఉందన్నారు. శాస్త్రీయ సంగీత ప్రచారానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖులు రామచంద్రశర్మ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం,
21, జూలై, 2024



ఆర్ట్ గ్యాలరీలో ఆరంభ్ చిత్రప్రదర్శన

మాదాపూర్: స్థానిక చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆరంభ్ పేరిట చిత్రప్రదర్శనను శనివారం ఏర్పాటు చేశారు. కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. చారూస్ ఇన్‌స్టిట్యూట్‌లో నేర్చుకున్న 28 మంది కళాకారులు వేసిన 36 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనను మెరీడియన్ పాఠశాల ప్రిన్సిపల్ అక్ష శబెల్లాని ప్రారంభించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె కోరారు. విద్యార్థులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



ఐ-కేర్ మాన్‌సూన్ క్యాంప్




సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకుని కార్ల వినియోగదారుల కోసం ఆదివారం నుంచి ఇసుజు మోటార్స్ సర్వీస్ శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇసుజు ఐ-కేర్ మాన్సూన్ క్యాంప్ పేరిట ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాల్లో తమ డి మ్యాక్స్ పికప్స్, ఎస్‌యూవిలకు అవసరమైన సర్వీసులన్నీ అందిస్తామని, ఈ క్యాంప్స్ నగరంలోని తమ అధికారిక డీలర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ క్యాంపులు ఆదివారం ప్రారంభమై, ఈ నెల 28 వరకూ కొనసాగుతాయన్నారు.



అద్భుతం.. ఫ్లో స్టైల్‌తత్వ..

మాదాపూర్: స్థానిక హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్లో స్టైల్‌తత్వ ఎక్స్‌పోను బుల్లితెర నటి సుమ కనకాల, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ వత్సల మిశ్రా, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ ప్రియగజదార్‌లతో కలసి శనివారం ప్రారంభించారు. ప్రదర్శనలోని ఉత్పత్తులు అద్భుతంగా ఉన్నాయని, దీని ద్వారా వచ్చే ఆదాయంలో కొంతభాగం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా 100 మంది మహిళా రైతులకు కూరగాయల సాగులో ఆధునిక శిక్షణ ఇవ్వడం, సిద్దిపేట క్లస్టర్‌లో నైపుణ్యం పెంచే మహిళా నేత కార్మికులకు శిక్షణ వంటి సామాజిక ప్రాజెక్టులకు కేటాయించడంతో సుమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 15 రాష్ట్రాల నుంచి 200లకు పైగా ఎంఎస్‌ఎంఈలను ఒకే వేదికపైకి తీసుకురావడం సులభం కాదని తెలిపారు. మహిళల సృజనాత్మకతను బయటకు తీసుకొచ్చేందుకు ఫిక్కీ ఎంతో కృషి చేస్తుందని ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ వత్సల మిశ్ర అన్నారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ రంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, దీనిపై విధానాన్ని రాష్ట్రప్రభుత్వం నెలరోజుల్లో ప్రకటించనున్నట్టు తెలిపారు. రెండు రోజుల్లో 8వేల నుంచి 10వేల మంది సందర్శకులు సందర్శించనున్నట్టు ఫిక్కీ చైర్‌పర్సన్ ప్రియగజదార్ తెలిపారు. ఫ్లో సహాయక పారిశ్రామికవేత్తల పెవిలియన్, ఉద్యమం రిజిస్ట్రేషన్ డెస్క్, తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్, సకల ది హ్యాండ్‌లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్ ఇనిషియేటివ్ స్టాల్స్ ప్రత్యేకంగా ఉన్నాయని తెలిపారు.





నగరంలోని గేటెడ్ కమ్యూనిటీలు చిన్నపాటి అందమైన ఊళ్లను తలపిస్తున్నాయి. వీటి నిర్వహణా వ్యవస్థల మధ్య ఏర్పడుతున్న ఆరోగ్యకరమైన పోటీ సిటీలో వేళ్లూనుకున్న గేటెడ్ కల్చర్‌కు కొత్త రంగులు అద్దుతోంది. అయామ్ ఫ్రమ్ హైదరాబాద్ అని చెప్పుకున్నంత గర్వంగా ఐయామ్ బిలాంగ్స్ టు ఫలానా కమ్యూనిటీ అని చెప్పుకునేలా నిర్వహణ కాంతులీనుతోంది.
- సాక్షి, సిటీబ్యూరో

సెక్యూరిటీ నుంచి సెలబ్రేషన్స్ వరకూ పోటా పోటీ

డ్రోన్ కెమెరాలు, బయోమెట్రిక్‌తో భద్రతా ఏర్పాట్లు

ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏర్పాటు

గేటెడ్ ట్రెండ్స్

కొత్త పుంతలు తొక్కుతున్న సిటీ కల్చర్

బండ్లగూడలోని కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో గణేశుడి లడ్డూ వేలంలో రూ.1.26 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. కరోనా టైమ్‌లో కోకాపేట్‌లోని రాజపుష్పా అట్రియా రికార్డ్ స్థాయిలో వ్యాక్సినేషన్ డ్రైవ్స్ అద్భుతంగా నిర్వహించి తమ కమ్యూనిటీని కరోనా కేసుల్లో జీరోకి చేర్చారు. వందల సంఖ్యలో కుటుంబాలు నివసించే గేటెడ్ కమ్యూనిటీల్లో ఉట్టిపడుతున్న ఐక్యతకే కాదు నిర్వహణా సామర్థ్యానికి కూడా ఇవి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

సెక్యూరిటీలో హై‘టెక్’..

సీసీ టీవీలు, కెమెరాలు అనేవి ప్రతి కమ్యూనిటీలో ఇప్పుడు సర్వసాధారణం. కాగా బయోమెట్రిక్ ఫేస్ రికగ్నైజేషన్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నివాసితుల భద్రతకు భరోసా ఇస్తున్నారు. ఇక అత్యంత సుశిక్షితులైన సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకుంటున్నారు. టోల్ గేట్ తరహాలో ప్రతి వాహనానికీ ఒక ఆర్‌ఎఫ్ఐడీ ఇస్తున్నారు. ఆ ఐడీ ఉన్న వాహనం వస్తేనే గేట్ ఓపెన్ అవుతుంది. ప్రతి గంటకూ ఒకసారి డ్రోన్స్‌తో తనిఖీలు చేసేందుకు త్వరలోనే ఏర్పాట్లు చేయనున్నామని ఓ గేటెడ్ కమ్యూనిటీ ప్రతినిధి చెప్పడం ప్రస్తావనార్హం.



వినాయకచవితి మొదలుకుని దాదాపు అన్ని కుల మతాలకు చెందిన పండుగలనూ ఘనంగా నిర్వహిస్తూనే, వరల్డ్ కప్ విజయం లాంటి అపురూప సందర్భాలకూ అప్పటికప్పుడు స్పందిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి నుంచి సంవత్సరారంభం దాకా కాదేదీ సెలబ్రేషన్‌కి అనర్హం అన్నట్టు గేటెట్ కమ్యూనిటీలు సందడి చేస్తున్నాయి. నల్లగండ్లలోని అపర్ణ సైబర్ కమ్యూన్‌లో అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా 5వేల లాంతర్లతో సంబరాలు చేశారు. నానక్‌రామ్‌గూడలోని మై హోమ్ విహంగలో అన్నదానాలు నిర్వహించారు. ఇక డ్రగ్స్, సైబర్ నేరాలు తదితర అంశాల మీద అవగాహన, యోగ, ధ్యానంపై శిక్షణా కార్యక్రమాలు రోజువారీగా జరుగుతున్నాయి.

అభివృద్ధి కోసం సమావేశాలు



నిర్వహణలో నీట్‌గా..

వసతులు కల్పించడంలో మాత్రమే కాదు మెయిన్‌టెనెన్స్ వసూళ్లలో సైతం కమ్యూనిటీలు పోటీపడుతున్నాయి. గత నాలుగేళ్లలో సిబ్బందికి ఏటా పది శాతం జీతాలు పెంచుతూనే, నివాసితులకు మాత్రం నిర్వహణా వ్యయం రూపాయి కూడా పెంచకుండా మియాపూర్‌లోని ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీ గేటెడ్ కమ్యూనిటీల నిర్వహణ చరిత్రలో కొత్త రికార్డ్ సృష్టించింది. మరోవైపు కమ్యూనిటీ పరిధిలో నాలుగేళ్లలో 70కి పైగా సీసీటీవీలు ఏర్పాటు చేయడం ద్వారా నివాసితుల భద్రత పటిష్టంగా మార్చారు. నివాసితుల సమస్యల పరిష్కారానికి బ్లాక్స్ వారీగా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. బిల్డర్ నిర్ణయించిన మెయిన్‌టెనెన్స్ ఛార్జీలను కమ్యూనిటీ, ఇతరత్రా ఆదాయ మార్గాలు ద్వారా తగ్గించుకుంటున్నాయి.

ఆరోగ్యంపై శ్రద్ధ పెంచిన కరోనా...

ఆధునిక వసతుల్లో పోటీపడుతున్న గేటెడ్ కమిటీలన్నీ సంపూర్ణంగా ఆరోగ్యసేవలపై శ్రద్ధ పెట్టేలా చేసిన ఘనత కరోనాదే. మహమ్మారి విజృంభణ సమయంలో ఈ కమిటీలన్నీ బలోపేతం అవడమే కాకుండా వ్యాక్సినేషన్, శానిటైజేషన్ వంటి అంశాల్లో పోటీ.. వంటివి గేటెడ్ కమ్యూనిటీలను శక్తివంతగా మార్చాయి. ఆక్సిజన్ ప్లాంట్లు, అంబులెన్స్‌లూ ఏర్పాటు చేసుకున్నారు. ఒంటరి వృద్ధుల కోసం 14 ఆస్పత్రులతో, డయాగ్నసిస్ సెంటర్లతో ఒప్పందం కుదుర్చుకున్నామని, అలాగే క్లినిక్, ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామని గ్రీన్ గ్రేస్ గేటెడ్ కమ్యూనిటీ ప్రతినిధి బద్రీనాథ్ చెప్పడం గమనార్హం.



పర్యావరణ హితం.. పురస్కార గ్రహీతలం



‘సాధారణంగా గేటెడ్ కమ్యూనిటీలో ఉండే దానికి మించి మా కమ్యూనిటీలో 45 నుంచి 50 శాతం ఎక్కువ పచ్చదనం ఉన్నట్టు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్స్ (ఐజీబీసీ) గుర్తింపుని ఇచ్చింది’ అని చెప్పారు ఖాజాగూడ నుంచి నానక్‌రామ్ గూడ వైపు వెళ్లే దారిలోని చౌరస్తాలో ఉన్న గ్రీన్ గ్రేస్ గేటెడ్ కమ్యూనిటీ కి చెందిన బద్రీనాథ్. సోలార్ స్ట్రీట్ లైట్స్, సోలార్ వాటర్ హీటర్స్, బాత్‌రూమ్ సింకులు తదితరాల నుంచి పోయే వేస్ట్ వాటర్‌ని రీసైకిల్ చేసి గార్డెనింగ్, కారిడార్స్, రోడ్ల శుభ్రతకు వినియోగిస్తున్నారు. పర్యావరణ హిత కార్యక్రమాల వల్ల ప్రభుత్వానికి గతంలో తాము కట్టిన రూ.10 లక్షలు నీటి బిల్లులకు డిపాజిట్‌గా మారి గత 45 నెలల నుంచి మాకు నీటి బిల్లు కట్టే అవసరం లేకుండా పోయిందని చెబుతున్నారు. అంతే కాక ఐజీబీసీ గుర్తింపు వల్ల ఆస్తి పన్నులో 20 శాతం రిబేటు కూడా సాధించగలిగామని చెప్పారు. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఉన్న తొలి గేటెడ్ కమ్యూనిటీ తమదేనని డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆటోమేటిక్ రెస్క్యూ డివైజెస్ వల్ల కరెంట్ పోయినా లిఫ్ట్ మధ్యలో ఆగకుండా మరో ఫ్లోర్ దాకా వెళ్లి ఆగి డోర్ తెరుచుకుంటుంది. ఇలాంటి ఎన్నో పకడ్బందీ ఏర్పాట్ల ద్వారా నివాసితులకు మేలు చేయడంతో పాటు పురస్కారాలెన్నో అందుకున్నాం.
– బద్రీనాథ్, గ్రీన్ గ్రేస్ కమ్యూనిటీ

ప్రోత్సహిస్తున్నాం.. అవార్డులు ఇస్తున్నాం..



మా పరిధిలో అనేక గేటెడ్ కమ్యూనిటీలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. నివాసితులకు అనేక రకాల సేవలు అందిస్తున్నాయి. నిర్వహణలో పోటీ తత్వాన్ని మరింత పెంచడానికి వారి సేవల్ని అభినందించడానికి మేం అవార్డులు ఇస్తున్నాం. తాజాగా పచ్చదనం విషయంలో మే ఫెయిర్ విల్లాస్‌కు ఇచ్చాం. ఇందులో ఎకరం స్థలంలో ఫారెస్ట్ పెంచారు. అంతేకాక 800, 900 ఏళ్ల నాటి చెట్లను రీలొకేట్ చేశారు. అదే విధంగా అత్యాధునిక మోషన్ కెమెరాలు వినియోగిస్తున్న ఇన్ఫినిటీ విల్లాస్‌కు బెస్ట్ సెక్యూరిటీ అవార్డు ఇచ్చాం. అలాగే వ్యర్థాల రీసైక్లింగ్‌లో అద్భుత పనితీరు కనబరుస్తున్న ముప్పా ఇంద్రప్రస్థకు బెస్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గుర్తింపుని అందించాం.
– రమణ, అధ్యక్షులు, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్స్


మే ఫెయిర్ విల్లాస్‌లో ఎకరంలో పరుచుకున్న పచ్చదనం

మనం.. మీనం

నగరంలో పెరుగుతున్న అక్వేరియం సంస్కృతి

మానసిక ప్రశాంతత చేకూరుస్తున్న చేపలు



జీబ్రా చేపలు


ఈ చేపల శరీరంపై నల్లటి, తెల్లటి చారికలు ఉంటాయి. అందుకే వీటికి జీబ్రా అని పేరు పెట్టారు. జీబ్రా డానియోస్ పూర్తి పేరు. ఇవి యాక్టివ్‌గా ఉంటాయి. భిన్న పరిసరాలకు అనుకూలంగా ఒదిగిపోయే లక్షణాల కారణంగా వీటిని శాస్త్రవేత్తలు రీసెర్చ్ కోసం వాడుతుంటారు. ఇవి ఆరేడు చేపలతో కలిసి గుంపుగా పెరుగుతాయి.

పెంపుడు జంతువులు అనగానే మనకు కుక్కలు, పిల్లులు గుర్తొస్తాయి. ఎందుకంటే అవి మనుషులను గుర్తుపెట్టుకోవడమే కాదు విశ్వాసంగానూ ఉంటాయి. మనం ఎక్కడికి వెళ్తే అక్కడికి వెంటే వస్తుంటాయి. చాలా ఫ్రెండ్లీగా ఇంట్లో కలియదిరుగుతాయి. అయితే కుక్కలు, పిల్లులే కాదు.. చేపలు కూడా చాలా విశ్వాసంగా ఉంటాయని మీకు తెలుసా..? అవి మనతో ఫ్రెండ్లీగా ఉంటాయని విన్నారా? అలాంటి చేపలను మన ఇంట్లోని అక్వేరియంలో పెంచుకుంటే? అలాంటి ఫ్రెండ్లీ చేపల గురించి తెలుసుకుందాం..
- సాక్షి, సిటీబ్యూరో

మనసుకు ప్రశాంతత, కాలక్షేపం కోసం ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది పెంపుడు జంతువులతో సమయం గడుపుతున్నారు. మరికొందరైతే పని ఒత్తిడితో అలిసిపోయి ఇంటికి వచ్చాక కాసేపు వాటితో దోస్తానా చేస్తుంటారు. బిజీ లైఫ్‌స్టైల్‌తో మానసిక ప్రశాంతత కోసం ఒక్కొక్కరూ ఒక్కో రకమైన జీవనశైలిని అలవాటు చేసుకుంటారు. తాజాగా హైదరాబాద్ వాసులు కాసేపు రిలాక్స్ అయ్యేందుకు చేపలను పెంచేస్తున్నారు.

నెమలి నాట్యంలా..

నెమలి ఫించం లాంటి మొప్పలు ఉన్న చేపలు కదులుతుంటే అచ్చం నెమలి నాట్యం చేస్తున్నట్లే అనిపిస్తుంది. అవి నీటిలో అలాఅలా కదులుతుంటే మనసు గాల్లో తేలిపోక మానదు. ఇవి యజమానులను గుర్తించడమే కాదు.. మనం నేర్పించే టాస్కులు కూడా నేర్చుకుంటాయి.



హచ్ డాగ్స్‌లా..



పేరుకు తగ్గట్టే ఏంజెల్‌లా ఉంటాయి ఈ చేపలు. అక్వేరియంలోని ఇతర చేపలతో ఫ్రెండ్‌షిప్ చేస్తాయి. యజమానులు ఎటు వెళ్తే అటు చూస్తాయి. ఇక ఫుడ్ పెట్టేటప్పుడు చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంటాయి.

ఇంటెలిజెంట్..

గోల్డ్ ఫిష్ అంటే చాలా మందికి తెలిసే ఉంటుంది. అక్వేరియం ఏర్పాటు చేసుకునే ప్రతి ఒక్కరూ గోల్డ్ ఫిష్ పెంచుకుంటారు. వీటికి జ్ఞాపక శక్తి, తెలివి చాలా ఎక్కువ. వీటికి కూడా మనకు నచ్చినట్టు ట్రైనింగ్ ఇచ్చుకోవచ్చు.



వెరీ.. క్యూరియస్ గయ్..



గౌరమి అనే రకం చేపలు క్యూరియస్‌గా ఉంటాయి. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తితో ఉంటాయి. ఒకే ప్రాంతంలో నివాసం ఉంటూనే.. చుట్టుపక్కల ఏం ఉన్నాయనే విషయాలు తెలుసుకుంటాయి. చుట్టుపక్కల చేపలతో ఫ్రెండ్లీగా ఉండటమే కాకుండా యజమానులను గుర్తుంచుకుంటాయి.

‘ఆస్కార్’ ఇచ్చేయొచ్చు..

ఆస్కార్ ఫిష్‌లు గోల్డెన్, బ్లాక్, బ్లూ కలర్‌లో ఉంటాయి. అందంగా, ఫ్రెండ్లీగా ఉండి పెంచుకునే వారిని ఇట్టే గుర్తుపట్టేస్తాయి. వీటికి ట్రైనింగ్ ఇస్తే ముద్దు ముద్దుగా చెప్పినట్టు వింటాయి.





సిచిల్డ్ చాలా భిన్నం..

సిచిల్డ్ చేపలు చాలా భిన్నమైనవి. వాటి ప్రవర్తన క్లిష్టంగా ఉండటమే కాకుండా, చుట్టూ ఉన్న వాతావరణంతో కలగలిసి పోతాయి. ఏదైనా సమస్యలు వస్తే చాకచక్యంగా పరిష్కరించడంలో దిట్ట.

జాగ్రత్తగా కాపాడుకోవాలి..



చేపలను పెంచాలని ఇష్టపడటమే కాదు. వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి. సరైన సమయంలో ఫుడ్‌పెట్టాలి. ఎప్పటికప్పుడు నీటిని మారుస్తుండాలి. మోటార్లతో ఆక్సిజన్ అందేలా జాగ్రత్తపడాలి. లేదంటే వైరస్ బారినపడి చేపలు చనిపోతుంటాయి. – షేక్ నసీరుద్దీన్

మన బాధ్యత..



ఎలాంటి చేపలను పెంచితే ఎక్కువ కాలం జీవించగలవో తెలుసుకుని పెంచాలి. పెద్ద అక్వేరియం ఏర్పాటు చేసి, నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు చెక్ చేయాలి. చేపలకు మన మీద నమ్మకం రావడానికి సమయం పడుతుంది. ఆ తర్వాత అవి మనతో ఫ్రెండ్లీగా ఉండి, మనల్ని గుర్తుపడతాయి. – ఇబ్రహీం అహ్మద్ దస్తగిర్

యావత్ దేశం దృష్టికి ఆటవిక పాలన

24న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిద్దాం : వైఎస్ జగన్

మనతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం చేద్దాం

ఏపీలో సాగుతున్న దారుణకాండను వారికి వివరిద్దాం

- ఢిల్లీ ధర్నా తర్వాత పార్లమెంటు ఉభయసభల్లోనూ గళమెత్తాలి.. రాష్ట్రంలోని ఘటనలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.. అందుకే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తున్నాం
- అదే విషయంపై పార్లమెంటులో నినదించాలి.. అలా చంద్రబాబుకు గట్టి హెచ్చరికలు పంపాలి
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిశానిర్దేశం



"ఢిల్లీలో ధర్నా కార్యక్రమానికి అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం. ఈ పోరాటంలో మనతో వచ్చే అన్ని పార్టీలను కలుపుకుని పోదాం. ధర్నాలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులంతా పాల్గొంటారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్దాం. రాష్ట్రంలో గత 45 రోజులుగా ఏం జరుగుతోందో వివరిద్దాం. ధర్నా అనంతరం పార్టీ ఎంపీలు పార్లమెంట్‌కు హాజరవ్వాలి. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసంపై ఉభయ సభల్లో గట్టిగా మాట్లాడాలి. ఇక్కడ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దురాగతాలను అందరి దృష్టికి తీసుకెళ్లాలి."

\- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతోందో వివరించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని ఎంపీలకు సూచించారు. ధర్నా అనంతరం పార్లమెంట్‌కు హాజరై రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలనపై గళమెత్తాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను తమ సభల్లోని సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్బోధించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. 'ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి అపాయింట్‌మెంట్లు కోరాం. అపాయింట్‌మెంట్లు రాగానే.. వారికీ ఇక్కడి పరిస్థితిని వివరిస్తాం. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీ ఒక్కో బాధ్యత తీసుకోవాలి. వెంటనే ఢిల్లీ వెళ్లి ఆ పనుల్లో నిమగ్నం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో మరింత ఆగ్రహానికి దారి తీస్తున్నాయి. అందుకే రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తున్నాం. అలా చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికలు పంపాలి. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన వ్యక్తం చేస్తాం. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో దారుణాలు, అరాచకాలు, ఇక్కడ జరుగుతున్న ఘటనలపై అందరూ గళమెత్తాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజాస్వామ్య మనుగడకే పెను ప్రమాదం

రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఘటనలు ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదు. అవి ప్రజాస్వామ్య మనుగడకు పెద్ద దెబ్బ. అందుకే అన్ని పార్టీలకూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయి. వినుకొండలో రషీద్ హత్యే ఇందుకు పరాకాష్ట. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డు మీద కత్తితో నరికి చంపిన తీరు అత్యంత అమానుషం. ఆ రాజకీయ హత్య ఘటనను వక్రీకరించడానికి ఎల్లో మీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, ఇప్పుడు జరిగిన దారుణ హత్యకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అసలు తమ కొడుకు ఏం తప్పు చేశాడని రషీద్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. 'సీఎంగా వైఎస్ జగన్ ఉంటే.. అంతా మంచి జరుగుతుందని నమ్మడం మా తప్పు అవుతుందా?' అని వారు ప్రశ్నిస్తున్నారు. హంతకుడైన జిలానీ.. లోకేశ్ పుట్టిన రోజున, స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలను రషీద్ తల్లిదండ్రులు చూపారు. స్థానిక ఎమ్మెల్యేతో కూడా కలిసి దిగిన హంతకుడి ఫొటోలను వారు చూపించారు.

హత్యలు.. హత్యాయత్నాలు.. విధ్వంసాలు

పల్నాడు జిల్లాకు కొత్త ఎస్పీ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే హత్యతో సహా పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. అంతకు ముందు మల్లికా గార్గ్ జిల్లా ఎస్పీగా ఉన్నారు. ఆమె సమర్థురాలు. అందుకే ఆమెను ఉద్దేశ పూర్వకంగా బదిలీ చేశారు. తమకు అనుకూలంగా ఉండే ఎస్పీని నియమించుకుని ఈ దారుణాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 45 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారు. 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ వారి వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. ఇవి కాక 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయి.

ఎంపీపైనా యథేచ్ఛగా దాడి

మరోవైపు తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారు. కావాలనే అక్కడ టీడీపీ మనుషులు ఉండేలా, పోలీసులతో ప్లాన్ చేసి మరీ దాడులు చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప ఒక న్యాయవాది. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో ఆయన ఇంటికి వెళ్తే, రాళ్లతో దాడి చేసి.. వాహనాలు కూడా ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్పకు చెందిన వాహనాన్ని దగ్ధం చేశారు. అన్ని తప్పులు చేసిన వారే, తిరిగి మన పార్టీ వాళ్ల మీద కేసులు పెడుతున్నారు.

ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందా?

రాష్ట్రంలో 15 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రస్థానం సాగుతోంది. చంద్రబాబు ఆశించినట్టుగా వైఎస్సార్‌సీపీని అణగదొక్కలేరు. ఎవరు అధికారంలో ఉన్నా ఇలాంటి దాడులు మంచివి కావు. అధికారంలో ఉన్న పార్టీ, అధికారంలో లేని పార్టీ మీద దాడులు చేయడం ధర్మమా? ఇలాగైతే ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుంది? గత ఎన్నికల్లో మనం 86 శాతం సీట్లను గెలిచాం. అయినా ఇలాంటి ఘటనలు జరగలేదు. దాడులను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ప్రజలందరినీ సమానంగా చూశాం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ఈ ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై ఎవరూ నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేయకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన. అందుకే దగ్గరుండి విధ్వంసకాండను ప్రోత్స హిస్తున్నారు. పార్టీకి కార్యకర్తలు చాలా ముఖ్యం. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడు కోవడం మన బాధ్యత. ఆయా కుటుంబాలకు తోడుగా నిలవాలి. కార్యకర్తలందరి తరఫున గట్టిగా నిలబడాలి.

హైస్కూళ్ల పనివేళల్లో మార్పు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాఠశాలల పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసింది. ఉన్నత పాఠశాలలు ప్రస్తుతం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కొనసాగుతుండగా.. ఈ సమయాన్ని అరగంట ముందుకు జరిపింది. ఇకపై ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.15 గంటలకు ముగుస్తాయి. కాగా, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రస్తుతం కొనసాగుతున్న సమయాలను యథావిధిగా ఉంచిన ప్రభుత్వం.. ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో హైదరాబాద్ జంటనగరాల్లో కూడా ప్రస్తుతం ఉన్నట్టుగానే ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులను, ప్రాంతీయ సంయుక్త సంచాలకులను ఆదేశించారు.

31 వరకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు

బదిలీల షెడ్యూల్ పొడిగింపు.. ఆర్థిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల షెడ్యూల్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3వ తేదీన ఇచ్చిన జీవో ప్రకారం శనివారంతో బదిలీల షెడ్యూల్ ముగియాల్సి ఉండగా.. ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తికాని నేపథ్యంలో.. గడువును పొడిగిస్తున్నట్టు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివా రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి సాధారణ బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చట్ట సవరణతో 'మైనింగ్'లో సంస్కరణలు

- వాటి ఫలితం నేడు కనిపిస్తోంది
- దేశంలో మరో 10 కొత్త మినరల్ బ్లాక్స్ ఎంపిక
- 'మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ హ్యాకథాన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ హ్యాకథాన్ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో 2015లో మైన్స్ అండ్ మినరల్స్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఎంఎండీఆర్) చట్టంలో తీసుకువచ్చిన సవరణలతోనే నేడు మైనింగ్ రంగంలో సంస్కరణలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు వాటి ఫలితం స్పష్టంగా కనిపిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. శనివారం ఆయన బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో జరిగిన మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు స్వయం సమృద్ధిని పెంచడమే లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతోందన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ రూపాంతరం చెందనున్నదని, ఈ సాధనలో మైనింగ్ రంగం ముఖ్యపాత్ర పోషించనుందన్నారు. దేశాభివృద్ధికోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖనిజ సంపదను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. గనుల అన్వేషణ వేగంగా జరగడానికి నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు.

2015కు ముందు అనేక సవాళ్లు..

2015కు ముందు మైనింగ్ రంగంలో అనేక సవాళ్లు ఉండేవని, బ్లాక్‌ల కేటాయింపుపై అనేక కోర్టు కేసులు నడిచేవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన భాగస్వామ్యం లభించేది కాదన్నారు. 2015లో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టంలో పలు సవరణలు తెచ్చిన తర్వాతనే మైనింగ్ రంగంలో సంస్కరణలు మొదలయ్యాయన్నారు. ఇప్పటివరకు 373కు పైగా మైనింగ్ బ్లాక్‌ల వేలం పూర్తయిందని తెలిపారు. క్రిటికల్ మినరల్స్‌కు సంబంధించి 2, 3వ ట్రాంచ్‌కు చెందిన బిడ్డర్స్‌ను శనివారం ప్రకటించారు. అరుణాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కర్ణాటక, రాజ స్తాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వేలం వేయడానికి 10 కొత్త క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్‌ను గనుల శాఖ ఎంపిక చేసిందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ పోర్టల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌కుమార్‌సిన్హా, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్, తెలంగాణ డీజీఎం సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఇంజనీర్ల సాధారణ బదిలీలకు బ్రేక్

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో అన్ని కేడర్లలోని ఇంజనీర్లను సాధారణ బదిలీల నుంచి మినహాయింపు కల్పిస్తూ ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శాఖలో ఇంజనీర్ల కొరత ఉందని, ప్రస్తుత వర్షాకాలంలో ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఇంజనీర్లను సాధారణ బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని ఆ శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ (అడ్మిన్) చేసిన సిఫారసుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత, ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ అవసరాలు తీరిన తర్వాత శాఖ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అన్ని కేడర్లలోని ఇంజనీర్ల బదిలీలను చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఇంజనీర్ల బదిలీలు, పదోన్నతుల విషయంలో నీటిపారుదల శాఖలోని వివిధ ఇంజనీర్ల సంఘాల మధ్య విభేదాలు తీవ్రం కావడంతో ప్రస్తుతానికి బదిలీలను పక్కనపెట్టినట్టు సమాచారం.

ఎన్‌ఎస్ఐఎల్‌తో టీ-శాట్ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: ఇస్రో అనుబంధ సంస్థ ఎన్‌ఎస్ఐఎల్‌తో టీ-శాట్ నెట్‌వర్క్ శాటిలైట్ ప్రసారాలకు సంబంధించి జీఎస్ఏటీ-8 నుంచి జీఎస్ఏటీ-16కు మారుతూ ఒప్పందం కదుర్చుకుంది. ఎన్ఎస్ఐఎల్ డైరెక్టర్ అరుణాచలం, టీ-శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి ఒప్పంద పత్రాలపై బెంగళూరు వేదికగా శుక్రవారం సంతకాలు చేశారు. ఈ మేరకు టీ-శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. టీ-శాట్ నెట్‌వర్క్ చానళ్లు జూలై 19, 2024 నుంచి కేయూ బ్యాండ్ జీఎస్ఏటీ-16లో ప్రసారాలకు మార్చుతూ ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. ఒప్పందం ప్రకారం ఆరు మెగా హెడ్జ్ కేయూ బ్యాండ్ విడ్త్ ద్వారా విద్య, నిపుణ ప్రసారాలు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు మరింత మెరుగ్గా అందనున్నాయని సీఈవో తెలిపారు. ఫలితంగా భారత దేశంలో టెలి ఎడ్యుకేషన్ ఛానల్ నిర్వహించే రాష్ట్రాల్లో జీశాట్-16కు మైగ్రేట్ అవుతూ ఎన్ఎస్ఐఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అని వివరించారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి

సాక్షి, హైదరాబాద్: సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు హైదరాబాద్‌లో ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నట్టు రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమి నిర్వాహకుడు డాక్టర్ జి.వివేకానంద ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు ఈ సదుపాయం ఉంటుందని తెలిపారు. ప్రతిభ ప్రాతిపదికన 90 మందికి అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వీరిలో బాలురు 45 మంది, బాలికలు 45 మంది ఉంటారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9866074047 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకుడు సూచించారు.

రాజకీయ పట్టు కోసమే రషీద్ హత్య!

- బలమైన ముస్లిం వర్గాన్ని దూరం చేసే కుట్ర
- జిలానీని పావుగా వాడిన ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజకీయంగా ఎదురు ఉండకూడదంటే వినుకొండలో వైఎస్సార్‌సీపీకి బలమైన వర్గంగా ఉన్న మైనారిటీలను భయపెట్టి దూరం చేసే కుట్రలో భాగంగానే రషీద్ హత్య జరిగినట్లుగా తెలుస్తోంది. లక్ష్యం ఒక్కరే కాదని, ఒకేసారి ముగ్గురు.. నలుగురిని చంపడం ద్వారా భయం కల్పించేందుకే ఈ కుట్రకు తెరలేపినట్లు సమాచారం. దీని కోసం ముందుగానే పథకం రూపొందించుకుని, ఆయుధాలు సమకూర్చుకున్నట్లు పక్కాగా రుజువులు బయట పడుతున్నాయి. హంతకుడు జిలానీ స్నేహితులు ఆ రోజు ఉదయం కత్తి తిప్పుతూ చేసిన వీడియో బయటకు వచ్చింది. ఇదే కత్తితో రషీద్‌ను హత మార్చడం గమనార్హం. ఆ రోజు హత్య జరిగిన సమయంలో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఈ హత్యాకాండలో పాల్గొనేందుకు వచ్చారని, అయితే జిలానీ ఒక్కడే పని పూర్తి చేశాడని చెబుతున్నారు. రషీద్‌తో పాటు ఇమ్రాన్ అనే వ్యక్తి కూడా మద్యం దుకాణంలో పని చేస్తున్నాడు. వీరితోపాటు వీరి కోసం వచ్చే స్నేహితులను చంపడమే లక్ష్యంగా మధ్యాహ్నం నుంచి రెక్కీ చేసినట్లు సమాచారం. ఇమ్రాన్‌ను చంపడం కోసం ప్రయత్నిస్తున్న సమయంలో అప్పుడే బయటి నుంచి రషీద్ రావడంతో.. అతని వెనక నుంచి వచ్చిన జిలానీ కత్తితో నరికాడు. దీంతో రషీద్ భయంతో పరుగెత్తగా వెంటాడి దారుణంగా నరికి.. నరికి చంపాడు. అదే సమయంలో షాపులో ఉన్న ఇమ్రాన్ షట్టర్ దించుకుని లోపల ఉండిపోవడంతో బతికిపోయాడు. రషీద్‌పై దాడి విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన అతని స్నేహితుడు జహంగీర్‌ను కూడా అక్కడే ఉన్న నిందితుడు జిలానీ బెదిరించాడు. ఘటన అనంతరం సీఐ వద్ద ఉన్న కత్తిని లాక్కుని దాడికి ప్రయత్నించినట్లు తెలిసింది. రషీద్‌పై దాడి జరుగుతున్న సమయంలో ఎవరూ అడ్డుకోకుండా జిలానీతో వచ్చిన బ్యాచ్ ప్రయత్నించింది. ఈ హత్యలు ఒక్కరితో ఆగవని, మరో ఐదుగురిని చంపి తీరుతామని పోలీసు కస్టడీలో ఉన్న జిలానీ చెబుతున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో వినుకొండలో అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్న ముస్లిం వర్గాన్ని దెబ్బ తీయడమే లక్ష్యంగా ఇప్పుడు అధికార పార్టీలోని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వీరిని రెచ్చగొట్టి ఈ హత్యాకాండకు రూపకల్పన చేసినట్లు సమాచారం.

దళితుడి లాకప్‌డెత్?

ముచ్చుమర్రి బాలిక హత్యాచారం కేసులో కీలక పరిణామం

- అనుమానితులు ఇచ్చిన సమాచారంతో పోలీసుల అదుపులో ఆరుగురు
- విచారణలో నలుగురి ప్రమేయం లేదని తేలడంతో విడుదల
- మిగిలిన వారిని చిత్రహింసలకు గురిచేసిన పోలీసులు
- దెబ్బలు తాళలేక దళిత వ్యక్తి మృత్యువాత
- ఉబ్బిపోయిన మృతుడి రెండు చేతులు, కాళ్లు.. డొక్క, వీపు భాగంలో గట్టిగా కొట్టిన ఆనవాళ్లు
- లాకప్‌డెత్ వెలుగుచూడకుండా పోలీసుల పాట్లు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నగదు రహిత సేవలు కొనసాగిస్తాం: టీఎస్‌హెచ్‌ఎస్

మంత్రి దామోదరతో సమావేశానంతరం ఆస్పత్రుల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ పథకం కింద నగదు రహిత సేవలను కొనసాగిస్తామని తెలంగాణ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (టీఎస్‌హెచ్‌ఎస్) స్పష్టంచేసింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో శనివారం నుంచి ఆరోగ్యశ్రీ, హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), ఆరోగ్య భద్రత కార్డులపై సేవలు నిలిపివేస్తామని అల్టిమేటం ఇచ్చాయి. దీనిపై వెంటనే స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అసోసియేషన్ ప్రతినిధులు భాస్కర్ రావు, గోవింద్‌హరి తదితరులతో శనివారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. మంత్రి చేసిన సూచనలతో సమావేశం అనంతరం వారు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారు. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా చెల్లించాల్సిన బకాయిలను సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. అలాగే, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా స్పెషాలిటీ హాస్పిటల్స్ అందిస్తున్న నగదు రహిత సేవలకు క్రమం తప్పకుండా నెలవారీగా చెల్లింపులు జరిగేలా కృషి చేస్తామని ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులకు తెలిపారు.

అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరిగేలా కార్యాచరణ

- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా ఉన్న ప్రకృతి వనరులను జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఐటీ ఉద్యోగులు ఆయా పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపేలా వాటిని అభివృద్ధి చేసే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. శనివారం ఆయన పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి బడ్జెట్ సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగురోడ్డు పరిసరాలు, జలాశయాలు, అడవుల వంటి ప్రాంతాలను పర్యాటకులకు స్వర్గధామంలా రూపొందించే అవకాశం ఉందని, ఆ దిశలో చర్యలు తీసుకోవాలని అధికారులను భట్టి ఆదేశించారు. సాంస్కృతిక సారథి కళాకారుల కార్యక్రమాలపై ఆరా తీశారు. సమాజాభివృద్ధికి వారి సేవలను సమగ్రంగా వినియోగించుకునే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని క్రీడా మైదానాలను మెరుగుపరిచి, సంవత్సరం పొడవునా వాటిలో యాక్టివిటీ ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి రిజ్వీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీధర్, హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాశరథి పురస్కారానికి జూకంటి జగన్నాథం



సాక్షి, హైదరాబాద్: కవి, కథకుడు జూకంటి జగన్నాథంకు రాష్ట్రప్రభుత్వం దాశరథి కృష్ణమాచార్య పుర స్కారం ప్రకటించింది. ఈమేరకు శనివారం రాత్రి ఉత్తర్వు జారీ చేసింది. పురస్కార కమిటీ రెండు రో జుల క్రితం భేటీ అయి జూకంటి జగన్నాథం పేరును సిఫారసు చేసింది. ఆయన పేరును ఖరారు చేస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. త్వరలో జూకంటికి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను రూ.లక్షా వేయి నూట పదహార్లు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నారు. కాగా, పురస్కారానికి ఎంపికైన జగన్నాథానికి సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పీసీబీ బదిలీల్లో అసంతృప్తి సెగ

- వర్క్ టు రూల్ ద్వారా నిరసనకు సిద్ధమంటున్న ఉద్యోగులు
- ఒకే చోట పాతుకుపోయిన వారిని బదిలీ చేయకపోవడంపై ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) బదిలీల్లో అసంతృప్తి సెగ రాజుకుంది. నిబంధనలను సాకుగా చూపి ఏకంగా 15 నుంచి 23 ఏళ్ల వరకు వివిధ పోస్టుల్లో పాతుకుపోయిన వారికి ఇంకా స్థానచలనం కాకపోవడం పట్ల కొందరు ఉద్యోగులు, అధికారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌లో సుదీర్ఘకాలం పాటు పనిచేస్తున్న వారిని ట్రాన్స్‌ఫర్ చేయకపోవడాన్ని నిరసిస్తూ వర్క్ టు రూల్ పద్ధతిలో పనిచేసేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. మరోవైపు ఇప్పటికే బదిలీలు జరిగిన తీరుపై సంబంధిత అటవీశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

ఆ ముగ్గురినీ కదిలించరా?

హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో సుదీర్ఘ కాలం సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్టులుగా పనిచేస్తున్న ముగ్గురిని 40 శాతం మించరాదనే నిబంధనతో ట్రాన్స్‌ఫర్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా సెంట్రల్ ల్యాబ్‌లో సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ (ఈఎస్) పోస్ట్‌లో పదేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని బదిలీలకు పరిగణనలోకి తీసుకోకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లను ఎందుకు బదిలీ చేయరు?

హెడ్ ఆఫీస్‌లో సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లుగా, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లుగా (ఏఈఈ) ఏడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న వారిని బదిలీ చేయకపోవడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్‌లుగా (ఏఈఎస్) ఒకే స్థానంలో దాదాపు 8 ఏళ్లపాటు పనిచేస్తున్న వారిని, అసిస్టెంట్ మేనేజర్ కేడర్‌లో 9 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో దాదాపు పదేళ్ల పాటు కొనసాగుతున్న సీనియర్ అసిస్టెంట్లు, ఇతర కేడర్‌ల వారిని సైతం మార్చకపోవడాన్ని తప్పుబడుతున్నారు.

కనీస కనికరం లేకుండా మహిళా అధికారులను..

మరోవైపు హెడ్‌ఆఫీస్‌లో, జీహెచ్ఎంసీ పరిధిలోని ఏఈఈలు, ఏఈఎస్‌లుగా పనిచేస్తున్న 9 మంది మహిళలను మాత్రం దూరప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారని దీంతో ఆయా కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు తలెత్తాయంటున్నారు. వారిలో ఒకరినైతే.. నిబంధనలకు విరుద్ధంగా వారి కుటుంబంలోని వారు కేన్సర్‌తో బాధపడుతున్నా ఆ మహిళా అధికారిని బదిలీ చేయడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

40 శాతం ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల ప్రాసెస్

'టీపీసీబీలో ఈసారైనా వారు కదులుతారా?' వార్తపై 'పీసీబీ' వివరణ

సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిని ఒకే స్టేషన్‌గా పరిగణించినందువల్ల ఇక్కడ బదిలీలు చేయరాదని నిర్ణయించినట్లు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ వింగ్ వివరణ ఇచ్చింది. శనివారం సాక్షి దినపత్రికలో 'టీపీసీబీలో ఈసారైనా వారు కదులుతారా?' శీర్షికతో వచ్చిన వార్తపై ఈ విభాగం సీనియర్ సోషల్ సైంటిస్ట్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ స్పందించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా 40 శాతం ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌లను పీసీబీ ప్రాసెస్ చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా పోస్టులకు ఉన్న ఖాళీలను బట్టి ఆయా కేడర్ల ఉద్యోగులను బదిలీ చేసినట్లు వెల్లడించారు. బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, ట్రాన్స్‌ఫర్ పాలసీకి అనుగుణంగా ఓ క్రమపద్ధతిలో పెట్టి మాస్టర్ లిస్ట్ కోసం చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ చైర్మన్‌గా జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ సభ్యులుగా, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ మెంబర్ కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. శుక్రవారం బోర్డు కార్యాలయంలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్ ఆఫీస్, హైదరాబాద్ జోనల్ ఆఫీసులు/జోనల్ ఆఫీస్ ఆర్సీపురం/జోనల్ లాబొరేటరీ ఆర్సీపురం, జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాంతీయ కార్యాలయాలను ఒక స్టేషన్‌గా పరిగణించినట్లు తెలిపారు. రామగుండం ప్రాంతీయ కార్యాలయం/వరంగల్ జోనల్ లాబొరేటరీ/కొత్తగూడెం ప్రాంతీయ కార్యాలయం/నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయం/సంగారెడ్డి-1 ప్రాంతీయ కార్యాలయాలను వేర్వేరు స్టేషన్లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఓయూ టెక్నాలజీ కాలేజీలో కొత్త కోర్సులు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో రెండు పార్ట్‌టైం కోర్సులను ప్రవేశపెట్టారు. ఈమేరకు శనివారం ప్రిన్సిపల్ సాయన్న కోర్సుల వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బీటెక్‌లో కెమికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్‌లో పార్ట్‌టైం డిప్లొమా కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సాయన్న అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా హాజరైన కశ్మీర్ సెంట్రల్ వర్సిటీ వీసీ రవీంద్రనాథ్ చేతుల మీదుగా 116 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమేశ్ కుమార్, హయవదన, వీవీ బస్వరావు, చంద్రశేఖర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

ఆమె బడ్జెట్ ఎంత?



ఆకాశంలో సగం అన్నారు స్త్రీలను. బిడ్డకు జన్మనిచ్చి పౌరుడిగా దేశానికి ఇస్తుంది స్త్రీ. కుటుంబ నిర్మాణంలో సమాజ ముందడుగులో ఆమె భాగస్వామ్యం సగం. జనాభాలో ఆమె సగం. కాని బడ్జెట్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆమె ప్రాధాన్యం వెనక్కు వెళ్లి ఇతర ప్రాధాన్యాలు ముందుకొస్తాయి. 'ఇది పేదవాడి బడ్జెట్', 'రైతు బడ్జెట్', 'మధ్యతరగతి బడ్జెట్' లాంటి మాటలు వినిపిస్తాయి తప్ప 'ఇది స్త్రీ సంక్షేమం కోరిన బడ్జెట్' అనే మాట వినపడదు. ఇప్పుడు రానున్నది బడ్జెట్ కాలం. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో ఆయా సభలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నాయి. ఈ సందర్భంగా స్త్రీలు ఏం కోరుతున్నారు? ఆర్థిక మంత్రులకు ఏం సందేశం ఇస్తున్నారు?

విద్య వైద్యం రవాణా ప్రభుత్వానిదే

ఇది గ్లోబలైజేషన్ కాలం. గ్లోబలైజేషన్‌కి హ్యూమన్‌ఫేస్ ఉండదని ఆర్థిక వేత్త అమర్త్య సేన్ అన్న మాటలు ఈ మూడు దశాబ్దాల్లో స్త్రీల పట్ల సాగుతున్న వివక్ష చూసినప్పుడు సత్యమని తేలాయి. కనీసం విద్య, వైద్యరంగాలనైనా ప్రభుత్వం స్వయంగా నిర్వహించినప్పుడు మాత్రమే ఆ సేవలకు మానవ ముఖం ఉంటుంది. విద్య, వైద్యంతోపాటు ప్రజా రవాణా, ఉపాధి... ఈ నాలుగూ ప్రభుత్వరంగంలో ఉన్నప్పుడే మహిళలకు రాజ్యాంగంలో సూచించిన విధంగా జీవనోపాధి పరస్పర గౌరవంతో కూడిన జీవితం సాధ్యమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప మిగిలిన ఏ రంగంలోనూ మగవాళ్లకు, మహిళలకు సమాన పనికి సమానవేతనం లభించడం లేదు. ప్రజల సంక్షేమమే ప్రధానంగా లేని బడ్జెట్‌లో మహిళల సంక్షేమం దుర్బిణీతో చూసినా దొరకదు. ఐక్యరాజ్య సమితి 2000 సంవత్సరంలో నిర్దేశించిన మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌లో సంపూర్ణ మహిళ అక్షరాస్యత, ప్రసవ మరణాలను తగ్గించడం ప్రధాన లక్ష్యాలు. ఆ లక్ష్యాలను చేరడానికి నామమాత్రపు చర్యలు తప్ప చిత్తశుద్ధితో ప్రణాళికలు చేపట్టలేదు. 'ఇలాగే కొనసాగితే భారతదేశం 2040 నాటికి కూడా మహిళల అక్షరాస్యత సంపూర్ణంగా సాధించలేదు' అని తదుపరి సమీక్షలో ఐక్యరాజ్యసమితి వ్యాఖ్యానించిన విషయాన్ని మర్చిపోకూడదు. నిర్భయ ఘటన నేపథ్యంలో జస్టిస్ వర్మ కమిటీ 'ప్రజారవాణా వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి' అన్నది. ఆర్‌టీసీ బస్సులో ఎప్పుడైనా నిర్భయ ఘటనలాంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయా? మహిళకు క్షేత్రస్థాయిలో అందాల్సిన కనీస అవసరాల్లో అందడం లేదు. మొక్కకు నీరు పోయకుండా చెట్టుకు అంటుకడతానంటే దానిని అభివృద్ధి అనలేం.



- తోట జ్యోతిరాణి, ఎకనమిక్స్ ప్రొఫెసర్ (రిటైర్డ్), కాకతీయ యూనివర్సిటీ, వరంగల్

ఆదాయం పెంచుకునేలా చూడాలి

దివ్యాంగులు, సీనియర్ మహిళలు, ఒంటరి మహిళల గురించి బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించాలి. వారు స్వయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలి. కుటీర పరిశ్రమలతోపాటు హోమ్‌మేడ్ ఇండస్ట్రీలలో ప్రోత్సహించాలి. విద్య, నైపుణ్యావృద్ధి, ఉపాధి సంబంధించి నోడల్ డిపార్ట్‌మెంట్‌లు కొత్త కొత్త ప్రయోగాల్లో మహిళలను భాగస్వాములు చేయాలి. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్య అందించాలి. సాఫ్ట్‌వేర్, మెడిసిన్, రేడియోగ్రఫీ తదితర అత్యంత నైపుణ్యం కలిగిన రంగాలలో స్త్రీల కోసం బడ్జెట్‌లో నిధులు వెచ్చించి ప్రోత్సహించాలి. వెల్‌బీయింగ్, కేర్ ఎకానమిలతో స్త్రీలు ఆదాయం పెంచుకునేలా చూడాలి.



- చిత్రామిశ్ర, ఐఏఎస్, పీఓ, ఐటీడీఏ, ఏటూరునాగారం

విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో బాలికలు రాణించేలా కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రాథమిక పాఠశాల సమయంలో డ్రాపౌట్స్‌ను నిరోధించాలి. వృత్తి విద్య శిక్షణ ఇవ్వాలి. పనిచేసే తల్లుల పిల్లలను చూసుకునేందుకు పని స్థలాల్లో కేర్ టేకర్లను ఏర్పాటు చేయాలి. పాఠశాల, కళాశాల రోజుల్లో వైద్యశిబిరాల ద్వారా వివిధ వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు పరీక్షలు చేయాలి.



- శేషాద్రిని రెడ్డి, ఏఎస్పీ, వేములవాడ

కుటీర పరిశ్రమల ఏర్పాటు

పురుషులతో సమానంగా మహిళలు విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదిగితేనే ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు గర్వపడేలా దేశాభివృద్ధిని సాధించగలం. మహిళల ఎదుగుదలకు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఆడపిల్ల పుట్టిందని తల్లిదండ్రులు ఆందోళనకు గురి కాకుండా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. యువతులు ఇంటర్, డిగ్రీతోనే చదువు మానేసి వివాహం చేసుకోవడం వల్ల పురుషులతో సమానంగా ఎదగలేకపోతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాలి. స్కూల్స్, జూనియర్, సాంకేతిక కళాశాలలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలి. బాలికలు, మహిళలకు ఉచిత వ్యాక్సిన్‌లు ఇచ్చేలా బడ్జెట్ నిధులు కేటాయించాలి.



- ఇంజారపు పూజ, ఎస్పీ (ఐపీఎస్ అధికారి), పీటీసీ, మామునూరు

రక్షణకు నిధులు పెంచాలి

పెరుగుతున్న మహిళా జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు పెంచాలి. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసే వివిధ శాఖలకు ఆ నిధులను ఖర్చు చేయాలి. వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు గ్రామాల్లో ప్రత్యేక కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాలి. ప్రత్యేకమైన పథకాలు రూపొందించాలి. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించడం ముఖ్యం. మహిళలపై రాక్షసంగా వ్యవహరించేవారికి కఠిన శిక్షలు వేసే విధంగా చట్టాల్లో మార్పు తీసుకురావాలి. రాజకీయపరంగా అన్ని విభాగాల్లో మహిళలు తన కలలను సాకారం చేసుకునే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.



- విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

వ్యాపార రంగంలో భాగస్వామ్యం

అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నారు. మన దేశంలోనూ అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం పెరిగింది. ఉన్నత చదువుల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు వ్యాపారరంగాల్లో మహిళల భాగస్వామ్యం పెంచాలి. వైద్యం, శారీరక దృఢత్వం కోసం అంగన్వాడీ కేంద్రాలను మరింత పటిష్ఠం చేయాలి. మహిళలు విభిన్న రంగాల్లో రాణించేలా రిజర్వేషన్లు కల్పించాలి. మొత్తంగా రాజకీయ, వ్యాపార, పారిశ్రామిక, విద్య, వైద్యం అన్నింటా మహిళలను ప్రోత్సహించాలి.



- లక్ష్మీకిరణ్, అదనపు కలెక్టర్, కరీంనగర్

– సాక్షి నెట్‌వర్క్

వైరల్

ఇలా కూడా నిద్రపోతారు!



'నిద్ర పోయే ముందు మీరు ఏం చేస్తారు?' అనే ప్రశ్నకు– 'చక్కని సంగీతం వింటాను. నచ్చిన పుస్తకం చదువుకుంటాను'... ఇలాంటి జవాబులు వినిపించడం సాధారణమే. అయితే ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ టియా విల్సన్ నోటి నుంచి వచ్చిన మాట విని నెట్ లోకులు షాకు అయ్యారు. 'సౌకర్యవంతంగా. సుఖంగా నిద్రపోవడానికి నా భుజాన్ని డిస్‌లొకేట్ చేస్తాను. నిద్ర నుంచి లేచిన తరువాత తిరిగి యథాస్థానంలో అమర్చుకుంటాను' అంటుంది విల్సన్. 'జోక్ చేస్తోందా?' అనుకోవద్దు. ఆమె చెప్పింది నిజమే. ఎహ్లార్స్ డాన్లోస్ సిండ్రోమ్ (ఈడీఎస్)తో బాధ పడుతోంది టియా విల్సన్. 'ఈడీఎస్' అనేది జన్యుపరమైన రుగ్మత. చర్మం సాగదీయబడినట్లుగా ఉంటుంది. కీళ్లు వదులవుతాయి. చర్మంపై మచ్చలు ఏర్పడతాయి. భుజాన్ని డిస్‌లొకేట్ చేసినప్పుడు అచేతనంగా మారి వేలాడబడుతున్నట్లుగా ఉంటుంది. కొద్దిరోజుల క్రితం 'హౌ ఐ స్లీప్' క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో టియా విల్సన్ పోస్ట్ చేసిన ఈ వీడియో రెండు మిలియన్‌ల వీక్షకుల గుండెలను చెమ్మగిల్లేలా చేసింది.

ఎలాంటి చి'కాకులు' లేకుండా హాయిగా..!



'బస్సు ఉండగా రెక్కలతో పనేమిటి!' అనుకున్నట్లున్నాయి ఈ కాకులు. ముంబైలోని ఒక బస్సు టాప్ మీద కాకులు వాలాయి. వాలిన కొద్దిసేపటికి ఆకాశంలోకి ఎగరడం కామన్. కాని ఈ కాకులు మాత్రం ఎక్కడికీ ఎగరకుండా బస్సుతోపాటు ముంబైలోని ఎన్నో వీధులలో హాయిగా విహరించాయి. 'వేర్ ఆర్ దే గోయింగ్' కాప్షన్‌తో 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ నాలుగు సెకన్‌ల వీడియో 1.4 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఈ కాకులు అంబానీల ఇంట పెళ్లికి వెళుతున్నట్లుగా ఉంది'.... 'ఎగిరి ఎగిరి అలిసిపోయాయి. పాపం వాటి గురించి మనం కూడా అర్థం చేసుకోవాలి'.. 'బస్సులపై కాకులకు ఉచిత ప్రయాణం స్కీమ్ ఏదైనా ప్రవేశ పెట్టారా!' 'కాకులు క్రాఫోర్డ్ మార్కెట్ (సౌత్ ముంబైలోని ప్రసిద్ధ మార్కెట్)కు వెళుతున్నట్లుగా ఉంది'... ఇలాంటి వ్యాఖ్యలతో కామెంట్ సెక్షన్ నిండిపోయింది.

హెల్త్



నేరుగా మనిషి చేయి చేయలేని ఎన్నో పనుల్ని ఇప్పుడు రోబో ఎంతో సమర్థంగా చేస్తోంది. వీటిల్లో శస్త్రచికిత్సలూ ఉన్నాయి. సర్జరీలో మనిషి చేయి సులభంగా చేరలేని చోట్లకు తన సన్నటి యాంత్రిక వేళ్లు చేరగలవు. నిజానికి రోబో చేస్తోందని అంటున్నా... మళ్లీ వాటిని నడిపించేది నిపుణులైన శస్త్రచికిత్సకులే. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సల్ని రోబోలతో అతి తేలిగ్గా చేయగలిగేవేమిటో, ప్రస్తుత వైద్యవిభాగాల్లోని ఏయే శాఖల్లో ఈ సర్జరీలు జరుగుతున్నాయో తెలుసుకుందాం.

రోబోలతో సంక్లిష్టమైన సర్జరీలు తేలిగ్గా..!



మానవ మణికట్టు ఒక పరిమితి వరకే తేలిగ్గా తిరుగుతుంది. కానీ ఓ రోబో మణికట్టు ఎటువైపైనా దాదాపు 270 డిగ్రీల వరకు తిరిగేలా రూపొందుతుంది. దాంతో అత్యంత నిశితంగా అనుకున్నంత మేరకే కోసేలా, కుట్లు వేసేలా చేసే శస్త్రచికిత్స ప్రక్రియల్ని రోబోకు ఆదేశాలిస్తూ డాక్టర్లు 'ఆపరేట్' చేస్తుంటారు. ఆ సర్జరీలో శస్త్రచికిత్స జరుగుతున్న అవయవాన్నీ, అందులోని భాగాల్నీ (ఫీల్డ్‌ను) 3–డీ ఇమేజ్ తెరపై చూస్తుంటారు.

మరింత సురక్షితమెందుకంటే...

కోత చాలా చిన్నగా ఉండటంవల్ల కోలుకునే సమయం తగ్గుతుంది. గాయమూ వేగంగా మానుతుంది. కోత, గాయం తక్కువ కావడం వల్ల ఇన్ఫెక్షన్‌కు అవకాశాలు బాగా తక్కువ. ఇవే కాదు... శస్త్రచికిత్సకు పట్టే సమయమూ, ఇవ్వాల్సిన మత్తుమందూ, రక్తస్రావమూ అన్నీ తక్కువే. ఇవన్నీ రోబోతో జరిగే శస్త్రచికిత్సను మరింత సురక్షితంగా మార్చేస్తాయి.

ఏయే శాఖల్లో ఈ శస్త్రచికిత్సలు?

మూత్ర వ్యవస్థకు సంబంధించి...

మూత్రపిండాల శస్త్రచికిత్సల్లో:

● కిడ్నీ నుంచి మూత్రాశయానికి (బ్లాడర్‌కు) మూత్రం తీసుకొచ్చే పైపులైన యురేటర్‌లలో ఏవైనా అడ్డంకులు ఉన్నప్పుడు (ఉదాహరణకు యురేటరో–పెల్విక్ జంక్షన్‌లో అడ్డంకి. దీన్నే యూపీజే అబ్‌స్ట్రక్షన్ అంటారు.) చేసే 'పైలోప్లాస్టీ ప్రొసీజర్' అనే శస్త్రచికిత్సలో ● కిడ్నీల్లో గడ్డల (రీనల్ ట్యూమర్స్) తొలగింపు ● కిడ్నీ పూర్తిగా తొలగించాల్సిన కేసుల్లో (నెఫ్రెక్టమీ).

ప్రోస్టెక్టమీ : ప్రోస్టేట్ గ్రంథి తొలగింపులో.

గైనకాలజీలో : ● గర్భసంచికీ అలాగే గర్భాశయ ముఖద్వారంలో క్యాన్సర్ (ప్రీ–మ్యాలిగ్నెంట్ సర్విక్స్ అండ్ యుటెరస్) వచ్చే అవకాశముందని తెలిసినప్పుడు ● ఫైబ్రాయిడ్, అడినోమయోసిస్ వంటి గడ్డల తొలగింపులో ● ఎండోమెట్రియాసిస్ కేసుల్లో సమస్యాత్మకమైన / వ్యాధికి గురైన భాగాలను తొలగించడానికి ● ఎండోమెట్రియమ్ శస్త్రచికిత్సలో అడ్హెషన్స్‌తో ఆ భాగం ఇతర శరీర భాగాలకు అతక్కుపోవడాన్ని విడదీయడానికి.

యూరో–గైనకాలజీ శస్త్రచికిత్సల్లో : ● పొత్తికడుపు కింది భాగంలోని అవయవాలు మరో అవయవంలోకి చొచ్చుకుపోయే హెర్నియా కేసుల్లో 'సాక్రోకాల్పోపెక్సీ' చేసేందుకు ● దగ్గినప్పుడూ, ఒత్తిడికి మూత్రం పడిపోయే కేసుల్లో చేసే కాల్పోసస్పెన్షన్ ప్రొసీజర్లలో, ● ఫిస్టులా రిపేర్ల వంటి కేసుల్లో సర్జరీ కాంప్లికేషన్లను తగ్గించడానికి.



డాక్టర్ వి. చంద్రమోహన్, సీనియర్ రోబోటిక్ యూరో సర్జన్

ఇతరత్రా విభాగాల్లోని శస్త్రచికిత్సలివి...

విపుల్ ప్రొసీజర్ : పాంక్రియాస్ (క్లోమం)లోని 'హెడ్' అనే భాగాన్నీ, అలాగే చిన్నపేగుల్లోని 'డియోడినమ్' అనే భాగాన్ని, గాల్‌బ్లాడర్‌నూ, బైల్‌డక్ట్‌ను తొలగించే 'పాంక్రియాటికో–డియోడనెక్టమీ' వంటి సంక్లిష్టమైన శస్త్రచికిత్సలో. ● పాంక్రియాస్, చిన్నపేగులు, గాల్‌బ్లాడర్‌లోని కొన్ని జబ్బులు (డిజార్డర్స్)లో (ఉదా: క్రానిక్ పాంక్రియాటైటిస్, డియోడనల్ ట్రామా వంటి చికిత్సల్లో)

థైరాయిడెక్టమీ : క్యాన్సర్‌కు గురైన థైరాయిడ్ గ్రంథిని తొలగించడానికి చేసే సంప్రదాయ శస్త్రచికిత్స తర్వాత మెడ చుట్టూ గీత కనిపిస్తుంది. కానీ రోబో చేసే శస్త్రచికిత్స తర్వాత ఎలాంటి గీతా పడకుండా శస్త్రచికిత్స చేసేందుకు. (అందంగా కనిపించాలని కోరుకునే యువతీ యువకులకూ / పెళ్లి కావాల్సిన యువతకు ఇదో వరం).


బ్రెయిన్ సర్జరీస్ : మెదడులోని సంక్లిష్టమైన భాగాల్లోకి ఏర్పడ్డ ట్యూమర్స్‌ను సంప్రదాయ శస్త్రచికిత్సతో తొలగింపు వీలుకాని సందర్భాల్లో.

భవిష్యత్తులో మరింత చవగ్గా...

ఇప్పుడు చాలా చోట్ల అమెరికన్ తయారీ రోబోలు ఉపయోగంలో ఉన్నాయి. ఇవి బాగా ఖరీదు కావడంతో ఈ శస్త్రచికిత్సలూ కాస్త ఖరీదే. అయితే భారతీయ రోబోలు అతి వేగంగా అందుబాటులోకి రానున్నాయి. ఇవి అమెరికన్ రోబోల ఖరీదులో సగానికే దొరుకుతాయి. ఫలితంగా అవి అందుబాటులోకి వస్తే ఇప్పటివరకూ అడ్వాన్స్‌డ్‌గా పరిగణిస్తున్న లాపరోస్కోపీ సర్జరీల స్థానంలో అన్ని వర్గాల ప్రజలకూ కొద్దిరోజుల్లోనే కారు చవగ్గా రోబో శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

రేపు వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా...

అన్యురిజమ్స్ అంటే?



మెదడులోని రక్తనాళాల్లో బలహీనమైన చోట ఉబ్బిపోయి బుడగలా మారడాన్ని 'అన్యురిజమ్స్' అంటారు. అకస్మాత్తుగా ప్రమాదకరంగా పరిణమించే ఈ సమస్య గురించి...

మెదడులోని ఏ ప్రాంతంలో రక్తనాళాలు ఉబ్బి ఉంటే ఆ ప్రాంతం పేరుతో అన్యురిజాన్ని చెబుతారు. ఉదాహరణకు సెరిబ్రమ్ అనే ప్రదేశంలో ఉంటే సెరిబ్రల్ అన్యురిజమ్స్ అంటారు. మెదడు చుట్టూ ఉండే ప్రధాన ప్రాంతం సబార్కనాయిడ్‌లో రక్తనాళాలు చిట్లి రక్తస్రావమైతే దాన్ని 'సబార్కనాయిడ్ హ్యామరేజ్' (ఎస్‌ఏహెచ్) అంటారు. రక్తనాళాలు చిట్లిన ప్రదేశాన్ని బట్టి మెదడు ఏ అవయవాన్ని కంట్రోల్ చేస్తుందో, ఆ అవయవం ప్రభావితమవుతుంది. అయితే ఇలా అన్యురిజమల్ బ్లీడ్‌కి గురైన ప్రతి ఏడుగురిలోనూ నలుగురు ఏదో ఒక రకమైన వైకల్యానికి గురయ్యే అవకాశం ఉంది. కీలక ప్రాంతంలో రక్తస్రావం కాగానే మొదట అది పక్షవాతానికీ (స్ట్రోక్‌కు), తీవ్రతను బట్టి కోమాలోకి తీసుకెళ్లే అవకాశాలెక్కువ.

బయట పడేందుకు అవకాశం తక్కువ... ఎందుకంటే?

అన్యురిజమ్స్ ఉన్న చాలామందిలో అవి వారి జీవితకాలంలో అవి చిట్లకపోవచ్చు. ఉబ్బు చిన్నగా ఉన్నవి కాకుండా... 'జెయింట్ అన్యురిజమ్స్' అని పిలిచే పెద్దవి అకస్మాత్తుగా చిట్లే అవకాశాలెక్కువ. దాంతో బాధితుల్లో అకస్మాత్తుగా పక్షవాతం కనిపించవచ్చు. హార్ట్ ఎటాక్స్‌లాగే 'సబర్కనాయిడ్ హ్యామరేజ్' అకస్మాత్తుగా వస్తుంది. గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లోని పూడిక వల్ల గుండెపోటు వస్తే... అప్పటికే అన్యురిజమ్స్‌కు గురైన రక్తనాళాలు చిట్లడం వల్ల సబర్కనాయిడ్ హ్యామరేజ్ వస్తుంది.

కారణాలు: ● కంట్రోల్‌లో లేని అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటి జబ్బులు. ● చాలావరకు పుట్టుకతో వచ్చే (కంజెనిటల్), అలాగే జన్యుపరమైన కారణాలు (ఈ కారణంగా ఫ్యామిలీ హిస్టరీలో ఈ సమస్య ఉన్నప్పుడు ముప్పు ఎక్కువ) ● రక్తానికి వచ్చే ఇన్ఫెక్షన్‌తో కలిగే కాంప్లికేషన్లు ● ఆరోగ్యకరంగా లేని జీవన శైలి ● పొగాకు వాడకం, మద్యం అలవాటు ● యాక్సిడెంట్‌లో రక్తనాళాలకు గాయం ● కొన్ని అరుదైన కేసుల్లో : ఉదా. ఫైబ్రోమస్క్యులార్ డిస్‌ప్లేసియా, కిడ్నీల్లో నీటితిత్తులు వచ్చే పాలిసిస్టిక్ కిడ్నీ డిసీజ్.

చిట్లినప్పుడు కనిపించే లక్షణాలు: ● జీవితంలో ఎప్పుడూ అనుభవించనంత బాధతో కూడిన తలనొప్పి ● స్పృహ కోల్పోవడం ● పక్షవాతం / ఫిట్స్ కూడా ● మాట్లాడలేకపోవడం, మూతి వంకరపోవడం.



డాక్టర్ ఎమ్.ఎల్. నీహారిక
కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్

చికిత్సలు : ● **మందులిస్తూ చేసే చికిత్స:** ఇది రక్తనాళాలు చిట్లకముందు చేసే చికిత్స. రక్తపోటును అదుపులో ఉంచేందుకు మందులిస్తూ, కొన్ని ఆహారాలు, వ్యాయామాలు సూచిస్తారు. ● **శస్త్రచికిత్స / క్లిప్పింగ్ :** పుర్రె (క్రేనియమ్) తెరవడం ద్వారా చేసే శస్త్రచికిత్స (క్రేనియాటమీ) ద్వారా అన్యురిజమ్‌లను గుర్తించి, శస్త్రచికిత్సతో వాటిని జాగ్రత్తగా వేరుచేస్తారు. ఉబ్బిన చోట క్లిప్పింగ్ జరిపాక ముందులాగే రక్తప్రసరణ జరిగేలా చూస్తారు. ● **ఎండోవాస్క్యులార్ కాయిలింగ్ :** తొడ ప్రాంతంలోని రక్తనాళం నుంచి ఒక పైప్‌ను ప్రవేశపెట్టి... అందులో నుంచి మరింత చిన్నపైప్‌లను అన్యురిజమ్స్ వరకు చేరేలా చేసి, అక్కడ కాయిల్ అనే డివైజ్‌ని అన్యురిజమ్ నింపడానికి వాడతారు. దాంతో ఉబ్బిన బలహీన ప్రాంతానికి రక్తసరఫరా ఆగడంతో చిట్లడం జరగదు. ఇందులోనే బెలూన్ కాయిలింగ్ అనే ప్రక్రియతో అన్యురిజమ్ ఉన్న ప్రాంతానికి దగ్గర్లో బెలూన్ లాంటి దాన్ని ఉబ్బేలా చేసి, అటు తర్వాత కాయిలింగ్ చేస్తారు. దాంతో పెద్ద రక్తనాళాల దగ్గర ఉన్న ఉబ్బును చిట్లకుండా రక్షిస్తారు. ఇక 'ఫ్లో డైవర్టర్ స్టెంట్స్'తో రక్తపు దిశను మళ్లించి ఉబ్బు తగ్గిపోయేలా చేస్తారు.

మెడీ ఫ్యాక్ట్

దగ్గును అణిచేయకండి!



దగ్గు రక్షణ వ్యవస్థలో భాగం. దగ్గడానికి ముందు శ్వాసనాళాల్లోని గాలి చాలా వేగంగా ప్రవహించి, దగ్గుతున్న సమయంలో లోపల ఉన్న అనవసర స్రావాల్ని బయటకు బలంగా నెట్టివేస్తూ దగ్గు ఒక రక్షణ ప్రక్రియలా పనిచేస్తుంది. అందుకే వీలైనంత మేరకు దగ్గును మందులతో అణచేయడానికి ప్రయత్నించకూడదు. లంగ్స్‌లోని స్రావాలు చిక్కబడ్డా, వాయునాళాల్లో ఏదైనా అడ్డుపడ్డా దగ్గు రావడం పెరుగుతుంది. దగ్గుతో పాటు కళ్లె / కఫం పడుతుంది. అలా వ్యర్థ స్రావాలను బయటకు పంపించి వేస్తుంది. కాబట్టి దగ్గును మందులతో అణచివేయకూడదు.

పరిపరిశోధన

టాబ్లెట్ త్వరగా పనిచేయాలంటే?



టాబ్లెట్ వేసుకున్న తర్వాత కుడి పక్కకు ఒరిగి కూర్చున్నా లేదా కుడిపక్కకే ఒరిగి పడుకున్నా కడుపులో టాబ్లెట్ త్వరగా కరిగి, ప్రతి కణానికీ అందుతుందంటున్నారు జాన్ హాప్‌కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు. ''టాబ్లెట్ వేసుకున్నాక రక్తంలోకి వెళ్లడానికి ముందు అది చిన్న పేగుల్లోకి వెళ్లాలి. అయితే అలా వెళ్లాలంటే... కడుపును దాటాక టాబ్లెట్ మొదట చిన్నపేగుల తలుపు (వాల్వ్) 'పైలోరస్'నూ దాటాక కరిగి రక్తంలో చేరాలి. కుడిపక్కకు ఒరగడం వల్ల అది మరింత వేగంగా, ప్రభావవంతంగా చేరుతుందన్నది వారి మాట.



భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్‌గా మనోలో మార్క్వెజ్

భారత ఫుట్‌బాల్ టీమ్‌కు కొత్త కోచ్ వచ్చాడు. స్పెయిన్‌కు చెందిన మనోలో మార్క్వెజ్‌ను టీమ్ హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) శనివారం ప్రకటించింది. 55 ఏళ్ల మార్క్వెజ్ ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టీమ్ ఎఫ్‌సీ గోవాకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే 2024-25 సీజన్‌లో ఆయన ఇటు భారత జట్టుతో పాటు అటు ఎఫ్‌సీ గోవా కోచ్‌గా కూడా రెండు బాధ్యతలను నిర్వర్తిస్తారని ఏఐఎఫ్ఎఫ్ వెల్లడించింది. కోచ్‌గా యూఈఎఫ్ఏ ప్రొ లైసెన్స్ ఉన్న మార్క్వెజ్ పదవీకాలంపై ఫెడరేషన్ ఎలాంటి స్పష్టతనివ్వలేదు. వియత్నాం, లెబనాన్‌లతో వచ్చే అక్టోబరులో జరిగే మూడు దేశాల టోర్నీనుంచి కొత్త కోచ్ బాధ్యతలు స్వీకరిస్తారు. 2020 నుంచి భారత్‌లో మార్క్వెజ్ కోచింగ్ కొనసాగుతోంది. ఎఫ్‌సీ గోవాకు కోచ్‌గా మారక ముందు ఐఎస్ఎల్‌లో ఆయన హైదరాబాద్ ఎఫ్‌సీకి కోచ్‌గా పని చేశారు. మార్క్వెజ్ నేతృత్వంలోనే 2021-22లో హైదరాబాద్ ఐఎస్ఎల్ చాంపియన్‌గా నిలవడం విశేషం. స్పెయిన్‌లో కోచ్‌గా మార్క్వెజ్ అపార అనుభవం ఉంది. పలు స్థానిక క్లబ్‌లతో పాటు లా లిగా జట్టు లాస్ పామాస్‌కు కూడా కోచ్‌గా పని చేశారు.

అసిస్టెంట్ కోచ్‌గా అభిషేక్ నాయర్

- ర్యాన్ టెన్ డష్కెట్‌కూ అవకాశం
- శ్రీలంక సిరీస్ నుంచి బాధ్యతలు


అభిషేక్


డష్కెట్

న్యూఢిల్లీ: భారత మాజీ క్రికెటర్ అభిషేక్ నాయర్, నెదర్లాండ్ మాజీ ఆటగాడు ర్యాన్ టెన్ డష్కెట్ టీమిండియా సహాయక సిబ్బందిలో భాగం కానున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూచనల మేరకు వీరిద్దరినీ అసిస్టెంట్ కోచ్‌లుగా ఎంపిక చేసినట్లు సమాచారం. గంభీర్‌తో పని చేసిన అనుభవం ఉండటంతో వీరిద్దరి ఎంపికకు మార్గం సుగమమైంది. 2024 ఐపీఎల్‌లో చాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ టీమ్‌కు గంభీర్ మెంటార్‌గా వ్యవహరించగా...నాయర్, డష్కెట్ అసిస్టెంట్ కోచ్‌లుగా వ్యవహరించారు. భారత్ తరఫున 3 వన్డేలు ఆడిన నాయర్‌కు ఆల్‌రౌండర్‌గా దేశవాళీ క్రికెట్‌లో ఘనమైన రికార్డు ఉంది. 103 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అతను రంజీ చాంపియన్‌గా నిలిచిన ముంబై టీమ్‌లలో భాగంగా ఉన్నాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ట్రినబాగో నైట్‌రైడర్స్ టీమ్‌కు నాయర్ హెడ్‌కోచ్‌గా వ్యవహరించాడు. డష్కెట్ నెదర్లాండ్స్ తరఫున 34 వన్డేలు, 24 టి20లు ఆడాడు. కౌంటీ టీమ్ కెంట్‌కు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించిన అతను ప్రస్తుతం మేజర్ లీగ్‌లో లాస్ ఏంజెల్స్ నైట్‌రైడర్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరు శ్రీలంకతో సిరీస్ కోసం జట్టుతో కలుస్తారు. స్వయంగా గంభీర్ అగ్రశ్రేణి బ్యాటర్ కావడంతో టీమిండియాకు ప్రత్యేకంగా బ్యాటింగ్ కోచ్ అని కాకుండా ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మరో వైపు బౌలింగ్ కోచ్ రేసులో దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్ ముందున్నాడు. ఐపీఎల్‌లో లక్నో టీమ్‌కు మోర్కెల్, గంభీర్ కలిసి పని చేశారు. ఫీల్డింగ్ కోచ్ విషయంలో మార్పు లేకపోవచ్చు. వరల్డ్ కప్ వరకు టీమ్‌కు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించిన హైదరాబాదీ టి.దిలీప్ ఇకపై కూడా కొనసాగే అవకాశం ఉంది.

శ్రీలంక, థాయిలాండ్ విజయం

- నేడు యూఏఈతో భారత్ ఢీ
- మహిళల ఆసియా కప్ టోర్నీ



దంబుల్లా: మహిళల ఆసియా కప్ టోర్నీలో శనివారం శ్రీలంక, థాయిలాండ్ జట్లు విజయాలు నమోదు చేశాయి. మాజీ చాంపియన్ బంగ్లాదేశ్‌ను 7 వికెట్ల తేడాతో శ్రీలంక ఓడించింది. ముందుగా బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (59 బంతుల్లో 48 నాటౌట్; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. అనంతరం లంక 17.1 ఓవర్లలో 3 వికెట్లకు 114 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విష్మీ గుణరత్నే (48 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా...హర్షిత సమరవిక్రమ (31 బంతుల్లో 33; 4 ఫోర్లు) రాణించింది. మరో మ్యాచ్‌లో థాయిలాండ్ 22 పరుగుల తేడాతో మలేసియాపై విజయం సాధించింది. ముందుగా థాయిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 133 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ననపట్ కొంచరోంకయ్ (35 బంతుల్లో 40; 6 ఫోర్లు) కీలక పరుగులు సాధించింది. ఆ తర్వాత మలేసియా 20 ఓవర్లలో 8 వికెట్లకు 111 పరుగులే చేయగలిగింది. వాన్ జూలియా (53 బంతుల్లో 52; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించినా మిగతావారంతా విఫలమయ్యారు.

గ్రూప్ 'ఎ'లో భాగంగా నేడు జరిగే తమ రెండో మ్యాచ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో భారత్ తలపడుతుంది. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి జరిగే ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. తమ తొలి పోరులో పాకిస్తాన్‌పై 7 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది.

ఇంగ్లండ్ 248/3

వెస్టిండీస్‌తో రెండో టెస్టు

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్ (78 బంతుల్లో 71 నాటౌట్; 8 ఫోర్లు), బెన్ డకెట్ (92 బంతుల్లో 76; 11 ఫోర్లు), ఒలీ పోప్ (67 బంతుల్లో 51; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా...జో రూట్ (33 నాటౌట్) రాణించాడు. అంతకు ముందు వెస్టిండీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగుల ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 351/5తో ఆట కొనసాగించిన విండీస్ 457 పరుగులకు ఆలౌటైంది. జోషువా డి సిల్వా (122 బంతుల్లో 82 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), షామర్ జోసెఫ్ (27 బంతుల్లో 33; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. వీరిద్దరు పదో వికెట్‌కు 78 బంతుల్లో 71 పరుగులు జోడించడం విశేషం. ప్రస్తుతం ఇంగ్లండ్ 207 పరుగులు ముందంజలో ఉంది.


జోషువా
జోసెఫ్

'హ్యాట్రిక్'పై సింధు గురి

- సాత్విక్-చిరాగ్ జోడీకి పతకావకాశాలు
- సంచలనంపై లక్ష్యసేన్ దృష్టి
- ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్‌పై ఆశలు



చిరాగ్
సాత్విక్
లక్ష్యసేన్
ప్రణయ్
సింధు

బ్యాడ్మింటన్‌ను 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో, ఆ తర్వాత 1988 సియోల్ ఒలింపిక్స్‌లలో ఎగ్జిబిషన్ / డెమాన్‌స్ట్రేషన్ స్పోర్ట్‌గా ఆడించారు. అంటే పోటీలు జరిపి విజేతలను ప్రకటించినా...ఆ విజయాలను పతకాల జాబితాలో కలపరు. 1992లో జరిగిన బార్సిలోనా ఒలింపిక్స్‌నుంచి అధికారికంగా బ్యాడ్మింటన్ ఒలింపిక్స్‌లో భాగమైంది. 1992 నుంచి 2008 వరకు భారత షట్లర్లు పోటీల్లో పాల్గొన్నా...ఈ ఐదు ప్రయత్నాల్లోనూ మనకు ఒక్క పతకం కూడా దక్కలేదు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో చెప్పుకోదగ్గ విజయాలతో అప్పటికే తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పుల్లెల గోపీచంద్, విమల్ కుమార్, మధుమిత బిష్త్, పీవీవీ లక్ష్మి, అపర్ణా పోపట్, అనూప్ శ్రీధర్‌లాంటి ఆటగాళ్లు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ క్వార్టర్ ఫైనల్ వరకు చేరడమే అప్పటి వరకు భారత అత్యుత్తమ ప్రదర్శన.

వరుసగా మూడు సార్లు...

2012 లండన్ ఒలింపిక్స్‌లో భారత్ పరిస్థితి మారింది. అప్పటికే వరుస విజయాలు, సూపర్ సిరీస్ టైటిల్స్‌తో అద్భుత ఫామ్‌లో ఉన్న సైనా నెహ్వాల్ భారత్‌కు బ్యాడ్మింటన్‌లో తొలి ఒలింపిక్ పతకాన్ని అందించింది. సెమీ ఫైనల్లో యిహాన్ వాంగ్ (చైనా) చేతిలో ఓడిన సైనా...ప్లే ఆఫ్ మ్యాచ్‌లో గ్జిన్ వాంగ్ (చైనా)పై విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మరో వైపు పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్ క్వార్టర్ ఫైనల్ వరకు రాగలిగాడు. నాలుగేళ్ల తిరిగే సరికి షటిల్‌లో భారత్ పతకం మరింత మెరుగైంది. అంతర్జాతీయ యవనికపై దూసుకొచ్చిన 21 ఏళ్ల యువ తార పూసర్ల వెంకట (పీవీ) సింధు రజత పతకాన్ని గెలుచుకొని భారత అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. పదునైన ఆటతో ఫైనల్ చేరిన సింధు...తుది పోరులో కరోలినా మరీన్ (స్పెయిన్) చేతిలో ఓడింది. ఈ ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్స్ వరకు చేరినా...చైనా దిగ్గజం లిన్ డాన్ చేతిలో ఓడి నిష్క్రమించాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో కాంస్యం చేరింది. ఈ సారి కూడా సింధునే పతకాన్ని గెలుచుకుంది. సెమీస్‌లో తై జు (తైపీ) చేతిలో ఓటమిపాలైన సింధు... ప్లే ఆఫ్ పోరులో బింగ్‌జియావో (చైనా)పై గెలిచి వరుసగా రెండో ఒలింపిక్ పతకాన్ని తన మెడలో వేసుకుంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీపై ఆ సమయంలో మంచి అంచనాలే ఉన్నా...దురదృష్టవశాత్తూ వాళ్లు గ్రూప్ దశకే పరిమితమయ్యారు.

అనుకూలమైన 'డ్రా'తో...


ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి వ్యక్తిగత విభాగంలో రెండు పతకాలు గెలుచుకున్న ఆటగాళ్లు ఇద్దరే ఉన్నారు. సుశీల్ కుమార్ (రెజ్లింగ్), సింధు మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇప్పుడు వరుసగా మూడో ఒలింపిక్స్‌లోనూ పతకం గెలిచి ఆల్‌టైమ్ గ్రేట్‌గా నిలిచే అవకాశం సింధు ముందుంది. ఊహించినట్లుగానే గ్రూప్ దశలో రెండు సునాయాస మ్యాచ్‌లు ఉన్నాయి. ఆ తర్వాత వరుసగా 2020లో కాంస్య పోరులో తాను ఓడించిన బింగ్‌జియావో, చెన్ యు ఫె, మరీన్‌లను దాటితే ఫైనల్ వరకు వెళ్లగలదు. గత కొంత కాలంగా గొప్ప ఫామ్‌లో లేకపోయినా... కీలక సమయంలో సత్తా చాటగల నైపుణ్యం సింధు సొంతం. అందుకే ఆమె పతకం గెలవడంపై అంచనాలున్నాయి. పురుషుల డబుల్స్‌లో కూడా సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి మంచి 'డ్రా'నే లభించింది. గ్రూప్ 'సి'లో విజేతగా ముందంజ వేస్తే ఈ జోడీకి నాకౌట్‌లోనూ తమకంటే బలహీన ప్రత్యర్థులే ఎదురు కావచ్చు. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ ఎంత వరకు వెళతాడనేది ఆసక్తికరం. జొనాథన్ క్రిస్టీలాంటి టాప్ ప్లేయర్‌ను ఓడిస్తే లక్ష్యసేన్ నాకౌట్‌కు వెళ్లే అవకాశం ఉంది. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్, ప్రణయ్ ఎదురు కావచ్చు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప - తనీషా క్రాస్టో జోడి గ్రూప్ దశను దాటి నాకౌట్‌కు చేరడం కష్టమే.

ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో గత మూడు ఒలింపిక్స్‌లలో వరుసగా పతకాలు వచ్చాయి. 2012లో సైనా నెహ్వాల్ కాంస్యంతో మెరవగా...2016లో పీవీ సింధు రజతం సాధించింది. 2020లోనూ తన జోరును కొనసాగిస్తూ సింధు కాంస్యాన్ని అందుకుంది.

–సాక్షి క్రీడా విభాగం

సినిమా

సరితూగే సమరమే...


● ఎస్‌జే సూర్య

నాని హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సరిపోదా శనివారం'. ఇందులో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్‌జే సూర్య, సాయికుమార్ లీడ్ రోల్స్‌లో నటించారు. శనివారం (జూలై 20) ఎస్‌జే సూర్య బర్త్ డే సందర్భంగా 'సరిపోదా శనివారం' నుంచి కొత్త వీడియోను రిలీజ్ చేశారు. 'సరితూగే సమరమే... సంహారం తథ్యమే' అంటూ ఈ వీడియోను షేర్ చేశారు నాని. డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 29న రిలీజ్ కానుంది.

కుర్రోళ్లు వస్తున్నారు


● 'కమిటీ కుర్రోళ్ళు' పోస్టర్

నిహారిక కొణిదెల సమర్పణలో ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదు వంశీ దర్శకత్వంలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో వచ్చే ఫ్రెండ్‌షిప్ వీక్‌లో విడుదలకు సిద్ధమైంది. వచ్చే నెల 9న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామని చిత్రయూనిట్ ప్రకటించింది. ''ఈ చిత్రం ద్వారా పదకొండు మంది హీరోలను, నలుగురు హీరో యిన్లను పరిచయం చేస్తున్నాం. స్నేహం, భావోద్వేగాలు, ప్రేమ, పల్లెటూరిలోని రాజకీయాలు, యువత పడే సంఘర్షణలన్నింటినీ ఈ చిత్రంలో చూపించాం'' అన్నారు. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్ కుమార్ పరిమి తదితరులు ఈ చిత్రంలో నటించారు.

తీర్పు ఒక్కటే

హాస్య నటుడు అలీ ఫ్యామిలీకి చెందిన సదన్ హీరోగా నటించిన సినిమా 'ప్రణయ గోదారి'. ప్రియాంకా ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సాయికుమార్, సునీల్ రావినూతల కీలక పాత్రలు పోషించారు. పి.ఎల్. విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా గ్లింప్స్‌ను రిలీజ్ చేసిన నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ– ''గ్లింప్స్‌లో సాయికుమార్‌గారి డైలాగ్స్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి'' అన్నారు. ఈ సినిమాలో ఊరి పెద్దలా సాయికుమార్ నటించారు. సాయి కుమార్ పలికిన 'తప్పు ఎవరు చేసినా తీర్పు ఒక్కటే' అనే డైలాగ్ గ్లింప్స్‌లో ఉంది.


● విఘ్నేష్, రాజ్ కందుకూరి, మార్కండేయ


● పూజా హెగ్డే

అమ్మాయి... సూర్యుడు... జెలాటో

''భగవంతుడు సృష్టించిన ఈ పెద్ద ప్రపంచంలో మనం ఎంత చిన్నవాళ్లమో ప్రకృతి గుర్తు చేస్తుంది. ప్రకృతికి సంబంధించిన ప్రతిదీ చాలా వైశాల్యంతో కూడుకుని ఉంటుంది. చాలా గంభీరంగా, వినయంగా అనిపిస్తుంటుంది. అలాగే ప్రతిదాంట్లోనూ ఓ ఆధ్యాత్మిక ఉట్టిపడుతుంది'' అంటున్నారు పూజా హెగ్డే. ఈ బ్యూటీ ప్రస్తుతం ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. షూటింగ్స్‌కి కాస్త విరామం రావడంతో విహార యాత్రకు ఇటలీలో వాలిపోయారు పూజా హెగ్డే. అక్కడ పలు ప్రదేశాలను సందర్శిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. కలర్‌ఫుల్ ఫ్రాక్‌లో సన్ గ్లాసెస్‌తో, చేతిలో జెలాటో (ఇటలీలో అన్ని రకాల ఐస్‌క్రీమ్‌లను జెలాటో అంటారు)తో చిరునవ్వులు చిందిస్తూ దిగిన ఫొటోలను 'అమ్మాయి... సూర్యుడు... జెలాటో' అనే క్యాప్షన్ ఇచ్చి, షేర్ చేశారామె. అలాగే పడవ ప్రయాణం చేస్తూ, ప్రకృతిని చూసి పరవశించిన వీడియోను షేర్ చేసి, పై విధంగా పేర్కొన్నారు. ఇక ఈ హాలిడేలో ఫుల్‌గా రిలాక్స్ అయి, ఇండియా వచ్చాక ఓ నూతనోత్సాహంతో పూజా హెగ్డే షూటింగ్స్‌లో పాల్గొంటారని చెప్పొచ్చు.

టార్గెట్ పంద్రాగస్ట్

వరుసగా సెలవులు వస్తే సినిమాలకు పండగే పండగ. ఆగస్ట్ రెండో వారం అలాంటి పండగే కానుంది. ఆగస్ట్ 15 గురువారం... స్వాతంత్ర్య దినోత్సవం కాబట్టి గవర్నమెంట్ హాలిడే. ఆ రోజుతో పాటు శుక్ర, శని, ఆదివారాల వసూళ్లు రాబట్టుకోవచ్చు. సోమవారం రక్షా బంధన్... అది కూడా కలిసొస్తుంది. అందుకే పంద్రాగస్ట్ టార్గెట్‌గా థియేటర్స్‌లో గెలుపు జెండా ఎగురవేయడానికి కొందరు నిర్మాతలు తమ చిత్రాలను ఆ తేదీన విడుదలకు సిద్ధం చేస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


● రామ్



● రవితేజ

మిస్టర్ బచ్చన్ రెడీ

రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రవితేజ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా కనిపిస్తారని తెలుస్తోంది. పనోరమా స్టూడియోస్, టీ సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14 లేదా 15న థియేటర్స్‌లోకి రానుందని సమాచారం.

డబుల్ ఎనర్జీ

పంద్రాగస్టుకు థియేటర్స్‌లోకి వచ్చేందుకు డబుల్ ఎనర్జీతో రెడీ అయ్యాడు 'డబుల్ ఇస్మార్ట్'. హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కింది. సీక్వెల్‌లో కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించగా, సంజయ్ దత్, అలీ కీలక పాత్రధారులు. పూరి జగన్నాథ్, ఛార్మీ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. ఓ సీబీఐ ఆఫీసర్ మెమొరీని ఓ సైన్స్ చిప్ సాయంతో కిరాయి హంతకుడు శంకర్ (రామ్) మెదడులోకి ట్రాన్స్‌ఫార్మ్ చేస్తారు. ఆ తర్వాత శంకర్ జీవితం ఏ విధంగా ప్రభావితమైంది? అనే కోణంలో 'ఇస్మార్ట్ శంకర్' కథ సాగిన విషయం తెలిసిందే. ఈ కథకు కొనసాగింపుగా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఉంటుందని తెలుస్తోంది.

కేజీఎఫ్ కథ


● విక్రమ్

కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్)లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'తంగలాన్'. 18వ శతాబ్దం నేపథ్యంలో పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్రమ్ హీరోగా నటించారు. పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్, అన్బుదురై ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ సినిమాను జనవరి 26న విడుదల చేయాలనుకున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కాకపోవడంతో విడుదల కాలేదు. అలా వాయిదా పడి ఫైనల్‌గా ఆగస్టు 15న రిలీజ్ కానుంది. కేజీఎఫ్‌లోని బంగారం కోసం జరిగే అక్రమ తవ్వకాలకు, అక్కడి ఓ గిరిజన తెగకు ఉన్న సంబంధం ఏంటి? అనేది ఈ చిత్రం ప్రధానాంశం. ఇందులో ఆ తెగ నాయకుడిగా విక్రమ్ కనిపిస్తారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం తెలుగులోనూ ఆగస్ట్ 15నే రిలీజ్ కానుంది.

చిన్న కథ కాదు

'అమ్మ టెన్త్ ఫెయిల్... కొడుకు ఫిఫ్త్ ఫెయిల్... చిన్న కథ కాదు..' అనే డైలాగ్ '35: చిన్న కథ కాదు' సినిమాలోనిది. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ఇది. నంద కిశోర్ ఈమాని ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రసాద్ (విశ్వతేజ్), సరస్వతి (నివేదా థామస్) భార్యాభర్తలు. వీరి కొడుక్కి 35 పాస్ మార్కులు కూడా రావు. దీంతో వాళ్ల కుటుంబం కాస్త నిరాశకు లోనవుతుంది. నిజంగా... 35 పాస్ మార్కులు ముఖ్యమా? ఆ ఊర్లోని మాస్టర్ (ప్రియదర్శి) వల్ల సరస్వతి కొడుకు పడిన ఇబ్బందులు ఏంటి? అనే అంశాలతో ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.


● నివేదా థామస్

స్ఫూర్తిదాయక పోరాటం



● కీర్తీ సురేష్

కీర్తీ సురేష్ నటించిన ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రఘుతాత'. తన గ్రామం కోసం కయల్‌విళి అనే ఓ యువతి చేసే స్ఫూర్తిదాయక పోరాటం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. సుమన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిలింస్ బేనర్ నిర్మించింది. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఈ సినిమా రిలీజ్‌పై మరో అప్‌డేట్ రాలేదు. మరి.. ఆగస్టు 15 బరిలో కీర్తీ సురేష్ 'రఘుతాత' సినిమా ఉంటుందా? లేదా అనేది చూడాలి. ఈ తమిళ చిత్రం తెలుగు, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది.

పుష్ప వాయిదా పడటంవల్లేనా?

'పుష్ప' ఫ్రాంచైజీలో హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప: ది రూల్' సినిమా రానుంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కావాల్సింది. అయితే క్వాలిటీ విషయంలో రాజీ పడాలనుకోవడం లేదని, అందుకే విడుదలను వాయిదా వేశామని యూనిట్ పేర్కొంది. ఆ తర్వాత 'పుష్ప: ది రూల్'ను డిసెంబరు 6న విడుదల చేస్తామని ప్రకటించింది. ఆగస్టు 15కి 'పుష్ప' రాకపోవడంవల్ల, లాంగ్ వీకెండ్, రక్షాబంధన్ ఫెస్టివల్ కూడా కలిసొచ్చి తమ సినిమాలకు లాభాలు వస్తాయని ఆయా చిత్రయూనిట్‌లు ఆలోచన చేసి ఆగస్టు 15ను టార్గెట్‌గా చేసుకుని ఈ సినిమాలను రిలీజ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

మేం ఫ్రెండ్సండి....


● నార్నే నితిన్

మేం ఫ్రెండ్సండి అంటూ థియేటర్స్‌లోకి వస్తున్నారు కార్తీక్, సబ్బు, హరి. మరి... వీళ్ల కథ ఏంటి? అనేది ఆగస్టు 15న థియేటర్స్‌లో తెలియనుంది. ఈ చిత్రంలో కార్తీక్‌గా నార్నే నితిన్, అతని ప్రేయసి పల్లవి పాత్రలో నయన్ సారిక, సుబ్బుగా రాజ్‌కుమార్ కసిరెడ్డి, హరిగా అంకిత్ నటించారు. ప్రేమ, స్నేహం అంశాల మేళవింపుతో అంజి కె. మణిపుత్ర దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆగస్టు 15కి ఇంకా సమయం ఉంది. సో... ఈ విడుదల జాబితా ఇంకా పెరిగే చాన్స్ ఉంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C.Govt. ట్రైన్ డ్రైవర్/ రైల్వే/ 60,000/-PM/5'11"ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16317]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ Govt. బీట్ ఆఫీసర్/ఫారెస్ట్ Dept/ 60,000/-PM/6'ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-16317]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. Sr. ఇంజినీర్/రైల్వే/ 89,000/-PM/6'ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16317]

SC హిందూ మాదిగ/కట్నం ప్రసక్తి లేదు /M.Tech / Govt.Asst. ఇంజినీర్ / జిహెచ్ఎంసీ / 1.20 Lakhs. PM/5'11"ఎత్తు/30 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-16317]

యాదవ/M.Tech / Govt. Asst. Exq. ఇంజినీర్/RWS/10 Lakhs. PA/ 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-16317]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్/ ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept / 80,000/-PM/5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16316]

యాదవ / B.Tech(సివిల్) / C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/85000/-PM/5'8" ఎత్తు /28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-16316]

SC మాదిగ/M.Tech, IT / C.Govt. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్ / 14 Lakhs. PA / 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 6304407230 [HA-16316]

బ్రాహ్మణ(శ్రీవత్సవ)/33 Age (AP) DED ప్రైవేట్ టీచర్ పౌరోహితం వరుడికి వధువు కావలెను శాఖా భేదం లేదు. 1& 2 మ్యారేజ్ అయినా పర్వాలేదు. Ph: 7993670455 [H-778900]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తిలేదు/28/ 5'9"/ B.Tech/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI / 1 Lakh pm/ అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-16318]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్ / 34y / నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి, ఒన్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK. కుల, కట్నం ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801637]

★★

డైరెక్ట్. 5'5"/55 Yrs/ కాపు. కుల పట్టింపు లేదు. నెలకు సుమారు రూ. యాభైవేల ఆదాయం కలిగి రూ.40 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న వధువు కావలెను. మోసము, ఆర్థిక ఇబ్బందులు ఉండవు. Ph: 8341482731 [H-1177705]

REDDY, 34 y, MS (Civil USA) Civil Engineer in USA, 5'11", Fair, 5C, Looking for Graduate Bride Pls Cont: 9493242896/ 5 [G-795924]

వరుడు కావలెను



రెడ్డి/విడో/2nd మ్యారేజ్, కుల, మత ప్రసక్తి లేదు /డిగ్రీ/5'4"/Own ట్రావెల్స్ & షాప్స్/ బిజినెస్‌లు గల అందమైన వధువుకు వరుడు కావలెను 1st/ 2nd (ఇల్లరికం ఓకే) Ph: 9063623252 [H-782751]

రెడ్డి/37y/5'5"/ఫెయిర్ / కుల పట్టింపు లేదు/ M.Com/Govt.ఎంప్లాయ్/65K (PM)/వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (1st & 2nd మ్యాచ్ & ఇల్లరికం OK) సంప్ర : 9133672661 [H-778900]

క్రిస్టియన్ మాదిగ/B.Tech, IIT/C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI బ్యాంక్/35000/-PM/ 5'5"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-16317]

బెస్త, గంగపుత్ర, అగ్నికులక్షత్రియ/ B.Tech /Govt.A.E/జిహెచ్ఎంసీ / 12 Lakhs PA/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-16317]

వాల్మీకి బోయ/B.Sc/Govt.Jr.Asst./ రెవెన్యూ Dept/40,000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16317]

రజక/B.Tech /C.Govt. టెక్నికల్Asst./ పోస్టల్ Dept/32000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16317]

SC హిందూ మాల/ఏకైక కుమార్తె/ B.Tech (Agri)/C.Govt.Asst.మేనేజర్/ఇండియన్ బ్యాంక్ /1 Lakh. PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16317]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ C. Govt. డిప్యూటీ మేనేజర్/SBI బ్యాంక్/ 65000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16316]

SC మాల/B.Tech / C.Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్/ 60,000/-PM/ 5'4"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16316]

రెండోపెళ్ళి/విడో/46y/Animal Husbandry & Veternary(Dept) మంచి జీతం. సొంత ఇల్లు/20 ఎ॥ పొలాలు, కోట్ల ఆస్తి గల వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9032670876 [H-782751]

రెండవ పెళ్ళి/విడో / 50y/Fair / భద్రాచలం/ Govt. Job/80,000/-PM/Own House Rents పిల్లలు లేని ఏ బాదర బందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-782751]

కమ్మ/విడో/56Y/Eluruలో సొంత ఫ్లాట్లు/Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-778900]

2వ పెళ్లి/4,00,000 PM/బాగా స్థిరపడిన అందమైన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. ఇల్లరికం: పిల్లలు ఉన్నా OK. కోట్ల ప్రాపర్టీ ఉంది. Ph: 9381696641 [H-778900]

పద్మశాలి/విడో/52y/B.Ed/ప్రైవేట్ జాబ్ / సొంత బిజినెస్/సొంత ఇల్లు/7 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. 9705499686 [H-796322]

FC/విడో/60y/రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్/ఏ బాదరబందిలేని సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకి వరుడు కావలెను. 7893328547 [H-796322]

రెడ్డి/విడో/ 58y/5'5" / V.Fair/Govt.HM /సొంత ఇల్లు & రెంట్స్/26 ఎకరాల కొబ్బరి తోటలు /3L.PM/ పిల్లలు లేని ఒంటరి వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 9492718486 [H-796322]

రెడ్డి/30/5'4"/MBBS, MS ENT "29/5'2"/ MBBS, MD Paediatric "25/5'4" / B.Tech, MS / F1 / USA రెడ్డి అమ్మాయిలకు తగిన రెడ్డి అబ్బాయిలు కావలెను. సంప్ర: "శుభమస్తు" DSNR, HYD. S.రాములు గౌడ్ 8790690309 [H-796322]

వయస్సు : 34yrs/ఎత్తు:5'5"/ గవర్నమెంట్ జాబ్, 1.50 Laks జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. 8019954482 [H-796322]

యాదవ /ఎర్ర శాఖ అప్పర్ మిడిల్, 37Y/ 5'4"/ M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగి లక్ష రూ॥ P/M అపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father సంప్ర : 9989597799 [H-778746]

బ్రాహ్మణ /24/5'3"/B.Sc "27/5'4"/ MBA "30/ 5'3"/ B.Sc "27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్ / బిజినెస్ / పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph : 7842636086 [HA-16313]

రెడ్డి/2nd మ్యారేజ్, (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు/AGe: 29/ Degree/ 2 Own Houses/ Site/ Business/ గల అందమైన వధువుకి 1 లేదా 2వ వరుడు కావలెను. (ఇల్లరికం Ok). Ph: 9573797905 [HA-16318]

రెండో పెళ్ళి/59y&58y&56y&55y&53y&52y &50y&49y&47y&46y&44y&43y&41y&40y & 38y &37y & 35y&33y & 31y&30y&28y&27y&25y& 24y/"మానేవ"(Since 1998). Ph/WH: 9291503949 [HA-16318]

క్రిస్టియన్ మాల/25 / 5'4" / B.Tech/ Govt. A.E / ఇరిగేషన్ Dept. / 60,000/- pm/ అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-16318]

★★

డైరెక్ట్/42/ ఒంటరి, 2nd మ్యారెజ్ వధువుకి కుల, వయసు, మత ప్రసక్తి లేని వెల్‌సెటిల్డ్ అయిన వరుడు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్-Ph: 81063 28649. [L-796409]

కమ్మ/వయస్సు 56 పైన / భర్త చని పోయారు/ పిల్లలు లేరు/చదువు : B.Com., LLM, DCA. / 3 కోట్లు పైన ఆస్తి / వరుడు కావలెను. డైరెక్ట్ ✆ : 720 748 7220 [R-1154979]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1వ/ 2వ/లేట్ విడో/విడోయర్/ పెన్షనర్స్/ఒంటరి స్త్రీలకు మరియు పురుషులకు వ॥ 21-80 సం॥ పెళ్లి సంబంధాలు త్వరగా చూడబడును. సంప్ర : 8374802603 [H-778900]

మాల, మాదిగ, హిందూ, క్రిస్టియన్/ Govt. సాఫ్ట్‌వేర్ / గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/ బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS/ 15 సం॥ Exp. Ph: 8790555273 [HA-32610]

కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-782751]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 8555980066, 9885144375 [H-782751]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Suresh, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Suresh, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

ధ్రువ మ్యారేజెస్ అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూడబడును. Age: 18-70 సం॥లు. Ph: 7702955854 [HA-15721]

క్రైస్తవ వివాహ సంబంధాలు & ఫ్రాంచైజీ కొరకు Visit: www.christianholymatrimony.com, YMCA Clock Tower Secunderabad. మీ ప్రొఫైల్స్‌ను వాట్సాప్ చేయండి. 7330957771 [HA-97698]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులము వారికి Govt/ సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్ / MBBS / PG/NRI/ Pvt / బిజినెస్/1వ/2వ/లేట్/AP/TS 15 సం॥ Exp: Ph: 9989140444 [H-32366]

Doctors, Software, NRI, Rich Persons కు Late Matches కు, అన్ని ప్రాంతాల వార్కి వ్యక్తిగత శ్రద్ధతో Fast గా సెటిల్‌మెంట్ చేయబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2957]

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్. USA, UK. Ph: 7396915712 [HA-16318]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-909]

★★

అన్ని కులాల వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి. స్త్రీలకు రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. విఘ్నేశ్వర మ్యారేజెస్. సెల్: 63016 18808. [N-1246028]

అఫ్గానిస్తాన్ టు హైదరాబాద్!

- తొలుత విమానంలో రాజస్తాన్‌కు..
- అక్కడి నుంచి ప్రైవేట్ బస్సుల్లో నగరానికి చేరవేత
- నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- రూ.7 కోట్ల విలువైన కిలో హెరాయిన్ స్వాధీనం
- సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడి

దేశ సరిహద్దుల నుంచి హెరాయిన్ సరఫరా



సైబరాబాద్ కమిషనరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహంతి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కొకైన్ ప్యాకెట్లు

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్‌లో ఇటీవలే పెద్ద మొత్తంలో కొకైన్‌ను సరఫరా చేస్తున్న నైజీరియా గ్యాంగ్ పట్టుబడగా.. తాజాగా అఫ్గానిస్తాన్ నుంచి హైదరాబాద్‌కు రూ.ఏడు కోట్ల విలువైన హెరాయిన్‌ను సప్లయి చేసిన మరో ముఠా పోలీసులకు చిక్కింది. సైబరాబాద్‌లో ఈ స్థాయిలో నాణ్యమైన హెరాయిన్ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. బ్రౌన్ కలర్‌లో ఉండే ఈ హెరాయిన్ మన దేశంలో ఉత్పత్తి కాదని, అఫ్గానిస్తాన్ వంటి దేశ సరిహద్దు ప్రాంతాల నుంచే ఇక్కడికి సరఫరా అవుతుందని చెప్పారు. తొలుత దేశ సరిహద్దుల నుంచి విమానంలో రాజస్తాన్‌కు తరలిస్తున్నారని, అక్కడ్నుంచి ప్రైవేట్ బస్సుల్లో హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నారని వివరించారు. నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల నుంచి రూ.7 కోట్ల విలువైన కిలో హెరాయిన్‌ను పట్టుకున్నామని చెప్పారు. ఆయా వివరాలను మాదాపూర్ డీసీపీ వినీత్, శంషాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్‌ఓటీ) డీసీపీ శ్రీనివాస్ గుప్తాతో కలిసి శనివారం సైబరాబాద్ కమిషనరేట్‌లో విలేకరుల సమావేశంలో మహంతి తెలిపారు.

గ్రాము రూ. 7 వేల చొప్పున

రాజస్తాన్‌లోని నాగోర్ జిల్లాకు చెందిన సంతోష్ ఆచారి, నేమిచంద్ భాటి, సర్వత్ సింగ్ అక్కడే చిన్న చిన్న డ్రగ్ పెడ్లర్లకు హెరాయిన్, ఎండీఎంఏ వంటి డ్రగ్స్‌ను విక్రయిస్తుంటారు. ఈక్రమంలో మాదక ద్రవ్యాల కేసులో అరెస్టయి ప్రస్తుతం జోధ్‌పూర్ జైలులో ఉన్న సంతోష్ నుంచి నేమిచంద్ హెరాయిన్‌ను తీసుకున్నాడు. రెండున్నర నెలల క్రితం హైదరాబాద్‌లోని తన సోదరుడు అజయ్ భాటి అలియాస్ లాలును కలిసేందుకు నేమి చంద్ వచ్చాడు. హెరాయిన్, ఎండీఎంఏ విక్రయాల గురించి తెలిపి, భారీగా డబ్బు సంపాదించవచ్చని సూచించాడు. దీంతో అజయ్ తన స్నేహితుడైన చౌటుప్పల్‌లోని మల్కాపూర్‌లో నివాసం ఉంటున్న రాజస్తాన్‌కు చెందిన హరీష్ సిర్విత్‌తో జట్టుకట్టాడు. ఖరీదైన హెరాయిన్‌ను గ్రాము రూ.7 వేల చొప్పున మాదాపూర్‌లోని డ్రగ్ పెడ్లర్లు, కస్టమర్లకు విక్రయించాలని నిర్ణయించుకున్నారు.

శిల్పారామం సమీపంలో స్వాధీనం

పథకం ప్రకారం నేమి చంద్, సర్వత్ సింగ్ కిలో హెరాయిన్ (నాలుగు ప్యాకెట్లు, ఒక్కోటి 250 గ్రాములు)ను ప్రైవేట్ బస్సులో రాజస్తాన్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని శిల్పారామం సమీపంలో డ్రగ్స్‌ను విక్రయించేందుకు సిద్ధమవుతుండగా.. విశ్వసనీయ సమాచారం అందుకున్న తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహాయంతో ఎస్‌ఓటీ శంషాబాద్, మాదాపూర్ పోలీసులు నలుగురు డ్రగ్ పెడ్లర్లను పట్టుకున్నారు. నిందితుల నుంచి హెరాయిన్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ సమాచారం ఇవ్వండి..

గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాల సరఫరాదారుల గురించి ఏ సమాచారం ఉన్నా డయల్ 100 ద్వారా లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 94906 17444లో తెలియజేయాలని కమిషనర్ అవినాష్ మహంతి కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు.

అభినందించిన డీజీపీ...

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాను పట్టుకున్న మాదాపూర్ పోలీసులతో పాటు శంషాబాద్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ టీ సంజయ్ కుమార్, అతని బృందాన్ని డీజీపీ జితేందర్ అభినందించారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీసులు నిరంతర పోరాటం చేస్తున్నారని, దీంతో డ్రగ్స్ సరఫరా చెయిన్‌కు బ్రేకులు పడుతున్నాయని వ్యాఖ్యానించారు. పోలీసులపై ప్రజలకు విశ్వాసం పెరుగుతోందనీ, పోలీసులు కూడా ఇలాంటి అంకితభావాన్ని కొనసాగించాలని సూచించారు.

ప్రభుత్వ సలహాదారుగా కేశవరావు బాధ్యతలు




కేకేను అభినందిస్తున్న తుమ్మల. చిత్రంలో విజయలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు)గా మాజీ ఎంపీ కె.కేశవరావు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం ఆయన సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. కుమార్తె, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు కాంగ్రెస్ నేతల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేశవరావును రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నేత పి.వినయ్‌కుమార్ తదితరులు కలిసి అభినందించారు.

ట్రాన్స్‌జెండర్లకూ 'థర్డ్' స్టేటస్ వర్తింపజేయండి

టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్లకు కుల ఆధారిత రిజర్వేషన్లతో పాటు థర్డ్ జెండర్ స్టేటస్ రిజర్వేషన్లు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ)ను హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు శిక్షణ శాఖ కూడా దీన్ని పాటించాలని స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సబార్డినేట్ రూల్స్–1996లోని రూల్ 22లో థర్డ్ జెండర్ కేటగిరీకి రిజర్వేషన్లను ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ థర్డ్ జెండర్ వ్యక్తి ఏడుకొండలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్ పాల్, నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు మార్గదర్శకాలున్నా రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు శిక్షణ శాఖ, టీజీఎస్‌పీఎస్సీ పాటించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఆ తీర్పు మేరకు మూడవ కేటగిరీ రిజర్వేషన్‌లను చేర్చాలన్నారు. లింగమార్పిడి వర్గానికి చెందిన వ్యక్తులకు విద్యాసంస్థల్లో అడ్మిషన్లు, ప్రభుత్వ, పబ్లిక్ సర్వీసెస్‌లో, రిక్రూట్‌మెంట్ విషయాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్‌కు ఉద్యోగ నోటిఫికేషన్లలో కుల ఆధారితతో పాటు ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వాలని టీజీఎస్‌పీఎస్సీని ఆదేశించింది. ఇదే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌కు జత చేయాలని చెబుతూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

కొత్త బస్సులకు తగ్గట్టుగా మరిన్ని ఖాళీల భర్తీ

రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ



సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా ఆర్టీసీకి కొత్త బస్సులు సమకూరుస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మహిళల ఉచిత ప్రయాణ పథకంతో బస్సుల్లో రద్దీ పెరిగిందని, ఆ రద్దీని తట్టుకునేందుకు దశలవారీగా మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు కొత్త బస్సులను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. శనివారం ఆయన బస్‌భవన్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సంస్థ ఆర్థిక పరిస్థితి, మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రీయింబర్స్ చేసే జీరో టికెట్ల మొత్తం, కొత్త బస్సుల కొనుగోలు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం డిపో స్థాయిలో పనిచేసే కొందరు డ్రైవర్లు, కండక్టర్లతో వర్చువల్ మాధ్యమం ద్వారా మాట్లాడారు. మహబూబాబాద్, హయత్‌నగర్–2, నిజామాబాద్, ఆసిఫాబాద్, హుస్నాబాద్, నారాయణపేట, మిర్యాలగూడ, మధిర, సిద్దిపేట, సంగారెడ్డి డిపోల సిబ్బందితో ముచ్చటించారు. జాబ్ క్యాలెండర్ ఆధారంగా త్వరలో 3,035 ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. 2015 వేతన సవరణ నాటి బాండు డబ్బుల్లో బకాయి ఉన్న రూ.200 కోట్లను త్వరలో చెల్లిస్తామని, ఇతర బకాయిలు కూడా చెల్లిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే టీజీఎస్ ఆర్టీసీ బిలియన్ డాలర్ (రూ.8,500 కోట్లు) టర్నోవర్ ఉన్న కార్పొరేషన్‌గా అవతరించబోతోందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. డిపో ఉద్యోగులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతున్న సమయంలో సంగారెడ్డి డిపో ఉద్యోగి ఒకరు ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అంశాన్ని లేవనెత్తారు. గత ప్రభుత్వం ఆర్టీ సీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీలో బిల్లు తెచ్చినందున, ఆ కసరత్తును ఈ ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు.

కులగణన చేస్తే బీసీలదే భవిష్యత్ : జాజుల



భానుపురి (సూర్యాపేట): దేశంలో బీసీ కులగణన జరిగితే రాజకీయాలతో పాటు అన్ని రంగాలలోనూ భవిష్యత్తు బీసీలదేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో బీసీ కులగణన సాధన యాత్ర ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ కులగణన చేసినట్లయితే ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదుగుతామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీసీ గణన చేస్తామని ప్రకటించిన బీజేపీ, అధికారంలోకి రాగానే మాట మార్చి బీసీ కులాల లెక్కలు తీస్తే దేశ సమగ్రత దెబ్బతింటుందని చెబుతోందన్నారు. బీసీ గణన పూర్తయితే వారికి 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందని అన్ని పార్టీలు బీసీల లెక్కలు అడగకుండా తొక్కిపెడుతున్నాయని విమర్శించారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరిస్తాం

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 11వ వార్షికోత్సవంలో ఎంపీ అనిల్ కుమార్



కోవిడ్ సమయంలో తలసేమియా బాధితులకు రక్తదానం చేసిన వారిని సన్మానిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఐవీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసగుప్త

సాక్షి, హైదరాబాద్ : ఆర్యవైశ్యుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ హామీనిచ్చారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) 11వ వార్షికోత్సవం శనివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను పేద ఆర్యవైశ్యుల కుటుంబాలకు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రవాణా, ఆర్‌అండ్‌బీ స్పెషల్ సీఎస్‌గా వికాస్‌రాజ్

- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు స్థానచలనం, అదనపు బాధ్యతలు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రవాణా, గృహ నిర్మాణ, సాధారణ పరిపాలన శాఖల (కేంద్రంతో సమన్వయం, స్మార్ట్ గవర్నెన్స్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ)గా వికాస్‌రాజ్ రాష్ట్ర శాసనసభ, లోక్‌సభ సాధారణ ఎన్నికలను నిర్వహించారు. ఇటీవల ఆయన బదిలీ కాగా, పోస్టింగ్ కోసం నిరీక్షణలో ఉన్నారు. నిరీక్షణలో మరో అధికారి బెన్హర్ మహేశ్‌దత్ ఎక్కా సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్) ముఖ్యకార్యదర్శిగా నియమితులయ్యా రు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్‌కు ఆ శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను ప్రభు త్వం అప్పగించింది. రెవెన్యూ శాఖ(విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ దీర్ఘకాలిక సెలవుల్లో ఉండడంతో ఆ పోస్టు అదనపు బాధ్యతలను రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖ జాయింట్ సెక్రటరీ ఎస్.హరీష్‌కు ప్రభుత్వం అప్పగించింది.

బదిలీ అయిన వారి వివరాలు ఇవి..

అధికారి	ప్రస్తుత పోస్టు	బదిలీ అయిన స్థానం
వికాస్‌రాజ్	వెయిటింగ్	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, గృహ నిర్మాణం, సాధారణ పరిపాలన శాఖ (కేంద్రంతో సమన్వయం, స్మార్ట్ పరిపాలన)
బి.మహేశ్‌దత్ ఎక్కా	వెయిటింగ్	ముఖ్యకార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ(సర్వీసెస్)
రాధికా గుప్తా	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు, హనుమకొండ)	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), మేడ్చల్ మల్కాజ్‌గిరి

అదనపు బాధ్యతలు అందుకున్న అధికారులు

అధికారి	ప్రస్తుత బాధ్యతలు	అదనపు బాధ్యతలు
ఎ.శరత్	గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి	గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్
కొర్ర లక్ష్మీ	డైరెక్టర్ స్పోర్ట్స్	ఎండీ, తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్
ఎస్.హరీశ్	రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖ జాయింట్ సెక్రటరీ	రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (విపత్తుల నిర్వహణ)


ఫీజులు.. గుండెలు గుభిల్లు


దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న విద్యా వ్యయం



విద్యార్థులు, తల్లిదండ్రుల డ్రీమ్ కోర్సు అయిన ఇంజనీరింగ్‌కు సంబంధించి దేశంలోనే ప్రఖ్యాత విద్యా సంస్థ ఐఐటీ బాంబేలో నాలుగేళ్ల బీటెక్‌కు 2008లో మొత్తం ట్యూషన్ ఫీజు రూ.1,08,000 ఉండగా ఇది 2024-25 నాటికి ఏకంగా రూ.8,00,000కు చేరింది. గత 16 ఏళ్లలో 7.2 రెట్లు పెరిగింది. అలాగే మరో ప్రముఖ విద్యా సంస్థ ఎన్ఐటీ తిరుచిరాపల్లిలో 2011-12లో బీటెక్‌కు రూ.1,42,000 ఫీజు ఉండగా 2023-24 నాటికి ఇది 5,02,800కు పెరిగింది. ఇక్కడ 12 ఏళ్లలో మూడున్నర రెట్లు ఫీజులు పెరిగాయి. మొత్తం మీద ఐఐటీల్లో 15 ఏళ్లలో ఏడు రెట్లు, అలాగే ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 15 ఏళ్లలో 8 రెట్లు ఫీజులు పెరిగాయి. భారతదేశంలో పెరిగిపోతున్న విద్యా వ్యయంపై కెరీర్స్360 ఫౌండర్ చైర్మన్ మహేశ్వర్ పెరి అందిస్తున్న ప్రత్యేక వ్యాసం

- మన దేశంలో చదువు రోజురోజుకీ భారంగా మారుతోంది. ప్రాథమిక విద్య నుంచి మేనేజ్ మెంట్ చదువుల వరకు ప్రతి దశలోనూ విద్య సామాన్యుడికే కాదు, మధ్య తరగతికీ తలకు మించిన భారంగా పరిణమించింది. విద్యలో ప్రభుత్వ పాత్ర క్రమేణా తగ్గడం.. ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టుకొచ్చి ఫీజులు పెంచుకుంటూ పోవడమే అందుకు ప్రధాన కారణం.
- గత 13 ఏళ్లలో ప్రభుత్వ బడుల సంఖ్యలో పెరుగుదల కేవలం 9 శాతం. అదే సమయంలో ప్రైవేటు స్కూళ్లు ఏకంగా 35% పెరిగిపోయాయి. ప్రస్తుతం దేశంలోని మొత్తం కాలేజీల్లో 79 % ప్రైవేటువే. 14 ఏళ్ల కిందట దేశంలోని ప్రతి రెండు ప్రభుత్వ యూనివర్సిటీలకు ఒక ప్రైవేటు యూనివర్సిటీ ఉంటే నేడు ప్రైవేటు వర్సిటీల సంఖ్య ప్రభుత్వ వర్సిటీల సంఖ్యను అధిగమించేసింది. వీటన్నింటి ఫలితంగా చదువులపై పెట్టాల్సిన ఖర్చు గణనీయంగా పెరిగిపోయింది. ఇవన్నీ ఆందోళనకరమైన పరిణామాలు.
- మన చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టి, పెద్ద పెద్ద విషయాలను పక్కనపెట్టేశామేమో అనిపిస్తోంది. ఈ సందర్భంగా మనమంతా కొన్ని అంశాలు ఆలోచించాలి. మన ప్రజల సుసంపన్నమైన అభివృద్ధికి ఇప్పటికీ కట్టుబడే ఉన్నామా? నిపుణులైన మానవ వనరులను తయారుచేసుకోవడంలో మనం వెనకబడుతున్నామా? గత 15–20 ఏళ్లలో దేశంలో విద్యా రంగంలో చోటుచేసుకున్న పరిణామాలను గమనిస్తే అవుననే అనిపిస్తుంది.





ఐఐటీలను మించి స్కూల్ ఫీజులు..

ముఖ్యంగా మెట్రో నగరాల్లో ఫీజులు స్కూల్‌ను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉన్నాయి. హైదరాబాద్ లోని పటాన్‌చెరులో ఉన్న ఒక ఇంటర్నేషనల్ స్కూల్ 2024-25 విద్యా సంవత్సరానికి రూ.12 లక్షల ఫీజు వసూలు చేస్తోంది. ఇది కాకుండా అడ్మిషన్ ఫీజు కింద మరో రూ.1.7 లక్షలు చెల్లించాల్సిందే. అలాగే శంషాబాద్‌లో ఉన్న మరో అకాడమీ ఏడాదికి రూ.9.5 లక్షల ఫీజు వసూలు చేస్తోంది. అలాగే మోకిలాలో ఉన్న ఇంకో ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏడాదికి రూ.8.2 లక్షల ఫీజు ఉంది. వీటికి అదనంగా అడ్మిషన్ ఫీజు కింద మరింత ముట్టజెప్పాల్సిందే.

భారీ ఫీజులతో తల్లిదండ్రుల్లో ఆందోళన

ఆ కోర్సు, ఈ కోర్సు అనే తేడా లేకుండా ప్రతి కోర్సుకు ఫీజుల మోత మోగిపోతోంది. మనదేశంలో విద్యా వ్యయం ఏయేడాదికాయేడాది అంతకంతకూ పెరిగిపోతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను అత్యున్నత విద్యా సంస్థల్లో చదివించాలని కలలు కంటారు. తమ కంటే తమ పిల్లల భవిష్యత్ బాగుండాలని ఆశిస్తారు. మంచి విద్యా సంస్థలో తమ పిల్లలు సీటు సాధించాలని.. ఆ తర్వాత కోర్సు పూర్తయ్యాక మంచి పే ప్యాకేజీతో ఉద్యోగం సాధించాలని ఆకాంక్షిస్తారు. అత్యుత్తమ విద్య, ఆ తర్వాత మంచి ఉద్యోగం సాధించాలంటే మేటి విద్యా సంస్థల్లో చదవకతప్పదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ పోటీ ప్రపంచంలో అందరికంటే ముందుండాలన్నా, మంచి అవకాశాలు దక్కించుకోవాలన్నా నాణ్యమైన చదువులతోనే సాధ్యమని నమ్ముతున్నారు. అయితే పెరుగుతున్న ఫీజులు తల్లిదండ్రుల్లో ఆందోళన రేపుతున్నాయి.

క్యాష్ చేసుకుంటున్న విద్యా సంస్థలు..

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆకాంక్షలను విద్యా సంస్థలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఫీజులను అమాంతం పెంచేస్తున్నాయి. నర్సరీ నుంచి మొదలుపెడితే పీజీలు, పీహెచ్‌డీల వరకు ఈ విద్యా వ్యయం ఏటా అంతకంతకూ గణనీయంగా పెరుగుతోంది. ధనవంతులకు ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా మధ్యతరగతి వర్గాలు, పేదలు అంతకంతకూ పెరిగిపోతున్న విద్యా వ్యయంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏటా భారీగా పెరిగిపోతున్న ఫీజులను కట్టలేక నాణ్యమైన చదువులకు విద్యార్థులు దూరమవుతున్నారు. ఇలా అర్ధంతరంగా చదువులు మానేసేవారి శాతం అంతకంతకూ పెరిగిపోతోంది. కొంతవరకు బ్యాంకులు విద్యా రుణాలు అందిస్తున్నా అవి అందరికీ దక్కడంలేదు. దీంతో డ్రాపవుట్లు పెరుగుతున్నాయి.

ప్రభుత్వరంగంలో తగ్గిపోయిన విద్యాసంస్థలు

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా భారతదేశంలోనే ఉంది. అయితే దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ రంగంలో విద్యా సంస్థలు ఏర్పాటు కావడం లేదు. ప్రైవేటు రంగంలోనే ఎక్కువ విద్యా సంస్థలు ఏర్పాటవుతున్నాయి. దీంతో ప్రైవేటు విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తూ నడ్డి విరుస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో ఎక్కువ విద్యా సంస్థలు ఏర్పాటయితే ప్రైవేటు సంస్థలతో పోలిస్తే ఫీజుల భారం తక్కువగా ఉంటుంది. అయితే అలా జరగకపోవడంతో పేదలు, మధ్య తరగతి వర్గాలు భారీ ఫీజులను చెల్లించలేక చదువులకు స్వస్తి చెబుతున్నాయి. దేశంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో గత 15 ఏళ్లలో వివిధ కోర్సుల ఫీజులు 300 శాతం పెరిగాయి. దేశంలో గత 20 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ గణాంకాలను పరిశీలిస్తే దిమ్మతిరిగే విషయాలు వెల్లడయ్యాయి.

భారీగా ఫీజుల భారం..

దేశంలో ప్రైవేటు స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు పెరిగిపోవడం.. ప్రభుత్వ రంగంలో విద్యా సంస్థలు తగ్గిపోవడంతో విద్యార్థులపై భారీ ఎత్తున ఫీజుల భారం పడుతోంది. దీంతో విద్యకు సంబంధించిన ద్రవ్యోల్బణం అంతకంతకూ పెరిగిపోతోంది. తాజా నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం.. 2014–2018 మధ్య ప్రాథమిక విద్యకు తల్లిదండ్రులు 30.7 శాతం వ్యయం చేశారు. అలాగే ప్రాథమికోన్నత తరగతులకు 27.5 శాతం ఖర్చు పెట్టారు. లోకల్ సర్కిల్స్ సర్వే ప్రకారం.. కోవిడ్ తర్వాత తమ పిల్లల స్కూల్ ఫీజులు 30 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగాయని 42 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు. తన కుమారుడి ఫీజు కింద నెలకు రూ.30,000 చెల్లిస్తున్నానంటూ హరియాణాలోని గురుగ్రామ్‌లో ఒక తండ్రి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లో ఒక స్కూల్ ఒకేసారి 50 శాతం ఫీజు పెంచింది.

44 శాతం మంది చదువులకు దూరం

నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం.. 23 శాతం మంది ఆర్థిక ఇబ్బందులతోనే చదువులు మానేశారు. 21 శాతం మంది తమ కుటుంబ పోషణ కోసం పనులకు వెళ్లడం వల్ల చదువులు మానేశామని చెప్పారు. అంటే దేశ యువతలో 44 శాతం మంది పెరిగిన ఫీజులు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఉన్నత చదువులు చదవలేకపోయారు. ఈ నేపథ్యంలో విద్య నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు భారం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

ఎంబీబీఎస్.. ఫీజుల మోత మోగాల్సిందే..

- ప్రైవేటు స్టేట్ యూనివర్సిటీల్లో రూ.80 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకు
- డీమ్డ్ యూనివర్సిటీల్లో రూ.1.25 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు
- ఎన్నారైలకు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు

అటవీ శాఖ పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: అటవీ శాఖ పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా కౌన్సెలింగ్ విధానం ద్వారా బదిలీలు, పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు ఆ శాఖ విడిగా మార్గదర్శకాలను జారీచేసింది. అయితే బదిలీలు చేసే ముందు స్పౌజ్ గ్రౌండ్స్ (భార్యభర్తల) కింద రెండేళ్లలోపు సర్వీసు ఉన్న వారికి, వచ్చే ఏడాది జూన్ 30 లోగా రిటైరయ్యే ఉద్యోగులకు, 70 శాతం వైకల్యం ఉన్నవారికి, మతిస్థిమితం సరిగా లేని పిల్లలున్న వారికి, వితంతువులు, మెడికల్ గ్రౌండ్స్, కష్టతరమైన ప్రాంతాల్లో ఎక్కువకాలం పనిచేస్తున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసింది. ఈ విషయంలో పీసీసీఎఫ్ తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం ఉత్తర్వులు జారీచేశారు.

4 కొత్త లైన్లు!

ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి.. రైల్వే బోర్డుకు డీపీఆర్‌ల సమర్పణ
అన్నీ కీలకమైనవే.. ఈసారి బడ్జెట్‌లో నిధులిచ్చే చాన్స్

సాక్షి, హైదరాబాద్: నూతన గ్రీన్ ఫీల్డ్ మార్గాలతో ప్రధాన రైల్వే లైన్లను అనుసంధానించే నాలుగు కొత్త రైల్వే లైన్లు రానున్నాయి. వీటికి సంబంధించి ఇటీవలే దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఫైనల్ లొకేషన్ సర్వేలు పూర్తి చేశారు. తాజాగా వాటి డీపీఆర్‌లు రైల్వే బోర్డుకు చేరాయి. ఈనెల 23న కొత్తగా ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటారా, కొన్నింటికే మంజూరు చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

1. కరీంనగర్-హసన్‌పర్తి..

రెండు పెద్ద పట్టణాల అనుసంధానం..

నిడివి: 62 కి.మీ., అంచనా వ్యయం రూ.1418.60 కోట్లు

→ కీలక పట్టణాలైన వరంగల్–కరీంనగర్‌లను నేరుగా అనుసంధానించే కీలక లైన్ ఇది. ప్రస్తుతం రైళ్లు వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్లాలంటే బల్లార్షా రూట్‌లో ఉన్న పెద్దపల్లి స్టేషన్‌కు వెళ్లి అక్కడ రివర్స్ చేసుకుని కరీంనగర్ వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల పెద్దపల్లి స్టేషన్‌లో ఇంజిన్‌ను వెనకకు మార్చుకోవాల్సి రావటంతోపాటు దూరం పెరిగి సమయం వృథా అవుతోంది. 111 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో వరంగల్ శివారులో ఉన్న హసన్‌పర్తి స్టేషన్ నుంచి నేరుగా కరీంనగర్‌కు కొత్త లైన్ నిర్మించాలన్నది ఈ ప్రతిపాదన. దీనిప్రకారం కేవలం62 కి.మీ. ప్రయాణంతో కరీంనగర్‌కు చేరుకోవచ్చు. మానకొండూరు, హుజూరాబాద్‌లాంటి కీలక పట్టణాలకు రైల్వే వసతి సమకూరుతుంది. ఉప్పల్ ప్రాంతంలో విస్తారంగా ఉన్న గ్రానైట్ ఎగుమతి కోసం రైలు ద్వారా నేరుగా కాకినాడ పోర్టుకు తరలించే వెసులుబాటు కలుగుతుంది. తిరుపతి లాంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రైళ్లను దీనిమీదుగా మళ్లిస్తే దూరాభారం తగ్గుతుంది.

2. మణుగూరు-రామగుండం

2 బొగ్గు గని ప్రాంతాల అనుసంధానం

నిడివి: 200 కి.మీ.
ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4014.38 కోట్లు.

సింగరేణి బొగ్గు నిక్షేపాల ప్రాంతంలో రెండు ప్రధాన కేంద్రాలను రైల్వే మార్గం ద్వారా అనుసంధానించే కీలక ప్రాజె క్టు ఇది. బల్లార్షా లైన్ ద్వారా రామగుండం నుంచి నిత్యం దాదాపు వంద వరకు సరుకు రవాణా రైళ్లు బొగ్గును వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నాయి. మణుగూరు ప్రాంతం కూడా సింగరేణి కోల్‌బెల్ట్‌లో కీలకమైంది. కానీ, ఈ రెంటి మధ్య నేరుగా అనుసంధానం లేదు.ప్రస్తుతం రూట్‌లో దాదాపు 287కి.మీ. దూరం ప్రయాణించి చేరుకోవాల్సి వస్తోంది. ప్రతిపాదిత లైన్ ద్వారా 87కి.మీ. దూరం తగ్గడంతో పాటు రామప్పలాంటి కొత్త ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ కలుగుతుంది.

3. డోర్నకల్-మిర్యాలగూడ

కాజీపేట–విజయవాడ బీబీనగర్–గుంటూరు లైన్లకు మరో అనుసంధానం

నిడివి: 94 కి.మీ.
ప్రాజెక్టు అంచనా: రూ.2184.45 కోట్లు

కాజీపేట–విజయవాడ ప్రధాన లైన్‌ను బీబీనగర్–గుంటూరు రైలు మార్గంతో అనుసంధానించే కీలక ప్రాజెక్టు ఇది.కాజీపేట మీదుగా సికింద్రాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన మార్గంపై ఉన్న డోర్నకల్‌ను బీబీనగర్–గుంటూరు మార్గంలో ఉన్న మిర్యాలగూడ స్టేషన్‌ను నేరుగా అనుసంధానిస్తూ దీన్ని నిర్మిస్తారు. మిర్యాలగూడ ప్రాంతంలో ఉన్న సిమెంటు పరిశ్రమలకు కావాల్సిన బొగ్గును దగ్గరి మార్గంతో తరలించేందుకు ఇది కీలకంగా మారుతుంది. విష్ణుపురం–మోటమర్రి మధ్య ఉన్న లైన్‌కు ఇది ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుంది. అయితే దాన్ని కేవలం సరుకు రవాణా రైళ్లకే పరిమితం చేశారు.

4. పెండ్యాల-హసన్‌పర్తి

ఇదో బైపాస్‌లైన్..

నిడివి: 24.55 కి.మీ.
ప్రాజెక్టు అంచనా: రూ.465.28 కోట్లు.

→ జనగామకు చేరువలో ఉన్న పెండ్యాల స్టేషన్ నుంచి కరీంనగర్ మార్గంలో ఉండే హసన్‌పర్తిరోడ్ స్టేషన్‌కు అనుసంధానిస్తారు. దీనివల్ల కాజీపేట జంక్షన్‌తో ప్రమేయం లేకుండా రైళ్లు నేరుగా ముందుకు సాగుతాయి. ఈ జంక్షన్ వద్ద ప్రయాణికుల రైళ్లు–సరుకు రవాణా రైళ్ల మధ్య క్లాష్ ఏర్పడుతోంది. ఒకదాని కోసం మరొకటి నిలిచిపోవాల్సి వస్తోంది. ప్రతిపాదిత మార్గం అందుబాటులోకి వస్తే దాని మీదుగా కాజీపేట జంక్షన్‌ను తప్పించి సరుకు రవాణా రైళ్లు నేరుగా ముందుకు సాగుతాయి. దీనివల్ల రెండు కేటగిరీ రైళ్లకు సమయం కలిసి వస్తుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.